# వెలమ వైజయంతి

సంపుటి - 29 | సంచిక-4 | జులై, ఆగష్టు - 2019 | వెల రూ.5/-





## మహారాష్ట్రలో 'ఐవా' ప్రతినిధుల బృందం



శ్రీ కల్వకుంట్ల తారక రామారావు
తెలంగాణ రాష్ట్ర ఐటి & పురపాలక శాఖామాత్యులు



శ్రీ తన్నీరు హరీష్ రావు
తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు




శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్
తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు



శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు
తెలంగాణ రాష్ట్ర శాసన మండలి ప్రభుత్వ విప్

Kapila Agro Farm

# Cow Rotary Parlour













## కపిల ఫామ్స్ ప్రత్యేకతలు...

పాల ఉత్పత్తి స్వయంగా మా ఫారంలోని ఆవుల నుండి చేయబడుతుంది.

ఒకే ఫారంలోని ఆవుల నుండి పాలు ఉత్పత్తి అవుతాయి.

“రోటరీ మిల్కింగ్ పార్లర్” ద్వారా పరిశుద్ధమైన, స్వచ్ఛమైన పాలను శుభ్రపరచిన ఆవు పొదుగు నుండి చిల్లింగ్ ట్యాంక్‌లలోకి నేరుగా సంగ్రహించటం జరుగుతుంది.

పాల నుండి వెన్నను వేరు చేయడం జరుగదు. కావున ప్రకృతి సిద్ధంగా పాలలో ఉండవలసిన వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతాలు మరియు పోషక పదార్థాలు కపిల పాలలో ఉంటాయి.

అంటి బయోటిక్స్, హార్మోన్లు, ప్రిజర్వేటివ్స్ మరియు ఇతర రసాయన అవశేషాలు ఉండవు.

కపిల డెయిరీలో ఉత్పత్తి అయ్యే పరిశుభ్రమైన, స్వచ్ఛమైన మరియు చక్కటి విలువలగల పాల నుండి తయారు చేసిన పాల పదార్థాలను నేరుగా వినియోగదారులకు అందించాలనే సదుద్దేశంతో మా డెయిరీ ఫామ్ ఆవరణలో ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.

వివరాలకు... **కపిల డెయిరీ ఫామ్**
**రఘు ధరణిపతి**
**98666 77767**




# KAPILA AGRO FARMS

Thimmareddypally (Vill), Kondapaka (mdl), Rajeevrahadari Highway,
80 Kms. from Hyderabad, (Karimnagar road), Siddipet District.

Website: www.kapilafarms.com E-mail : contact@kapilafarms.com

సంపుటి : 29 సంచిక : 4 జులై - ఆగష్టు 2019

Email: allindiavelamaassociation@yahoo.in / allindiavelamaassociation@gmail.com
Website : www.aiva.org.in

## సంపాదక మండలి

| | | |
|---|---|---|
| శ్రీ పూస్నూరు శ్రీకాంత్ రావు: | ప్రధాన కార్యదర్శి | 9581781234 |
| శ్రీ బల్మూరి జగన్మోహన్ రావు : | కన్వీనర్ | 9989556804 |
| శ్రీ గుడిబండ ప్రవీణ్ రావు : | సభ్యులు | 9393664558 |
| శ్రీ అర్రాడి దివాకర్ రావు : | సభ్యులు | 9391372407 |
| శ్రీ చెన్నమనేని కళ్యాణ్ : | సభ్యులు | 9290077444 |
| శ్రీ బోయినిపల్లి ఆనంద్ రావు : | సభ్యులు | 9440927917 |

## కార్యాచరణ కమిటీ

| | |
|---|---|
| శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు, MLC | : అధ్యక్షులు |
| శ్రీమతి జువ్వాడి ఇందిరా రావు | : ఉపాధ్యక్షులు |
| శ్రీ రంగినేని శ్రీనివాస్ రావు | : ఉపాధ్యక్షులు |
| శ్రీ గోన రవీందర్ రావు | : ఉపాధ్యక్షులు |
| శ్రీ పూస్నూరు శ్రీకాంత్ రావు | : ప్రధాన కార్యదర్శి |
| శ్రీ తన్నీరు బాపు రావు | : కోశాధికారి |
| శ్రీ మెట్‌పల్లి కిరణ్ కుమార్ | : కార్యనిర్వాహక కార్యదర్శి |
| శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు | : కార్యనిర్వాహక కార్యదర్శి |
| శ్రీమతి పుల్లూరు పద్మ | : కార్యనిర్వాహక కార్యదర్శి |
| శ్రీ చల్మెడ లక్ష్మినర్సింహా రావు | : మాజీ అధ్యక్షులు |

## కార్యవర్గ సభ్యులు

1. శ్రీ రామడుగు సీతారామా రావు
2. శ్రీ వడ్డేపల్లి కొండల్ రావు
3. శ్రీ సురభి రవీందర్ రావు
4. శ్రీ మణికొండ కేశవ రావు
5. శ్రీ జువ్వాడి అశోక్ కుమార్
6. శ్రీ చెన్నమనేని రామ్మోహన్ రావు
7. శ్రీ సురభి చలపతి రావు
8. శ్రీమతి పానుగోటి జ్యోతి
9. శ్రీమతి కోట్ల వీణ
10. శ్రీ పీచర రామ్మోహన్ రావు
11. శ్రీ గన్నమనేని క్రిష్ణప్రవీణ్ రావు
12. శ్రీ బల్మూరి ఆనంద్ రావు
13. శ్రీ బల్మూరి జగన్‌మోహన్ రావు
14. శ్రీ చీటి అశోక్ రావు
15. శ్రీ కొత్త భూపతి రావు
16. శ్రీ అయిలేని నర్సింహా రావు
17. శ్రీమతి గోన శ్రీలత
18. శ్రీ పుల్లయ్యగారి జలపతి రావు

### ఈ పత్రికలో వ్యాపార ప్రకటనల రేట్లు :

వెనుక కవర్ : రూ. 9,450/-; 2,3 లోపలి కవర్లు : రూ. 7,350/-; లోపలి పేజి సాదా : రూ. 2,100/-; అరపేజి : రూ. 1,050/-; పావు పేజి : రూ. 525/-; కలర్‌లో పెళ్ళి ఫోటోలు: పేజికి రూ. 4,200/- జిఎస్‌టి 5%తో కలుపుకొని.. (కనీసం నాలుగు కలర్ పేజీలకు ప్రకటనలు లభిస్తే తప్ప కలర్ ప్రింటింగ్ సాధ్యం కాదు)

*D.T.P & Designing:- Upakar 8106130524*

## ముఖచిత్రం : మహారాష్ట్రలో ఐవా ప్రతినిధులు

సంచిక - 4 / జులై - ఆగష్టు 2019

| | |
|---|---|
| అధ్యక్షులవారి అభిలాష | 4 |
| కార్యదర్శిగారి ఆకాంక్ష | 5 |
| వైజయంతీయం | 6 |
| ఐటి, పురపాలక శాఖామాంత్రిగా శ్రీ కెటిఆర్ | 7 |
| ఆర్థిక శాఖామంత్రిగా శ్రీ తన్నీరు హరీష్ రావు | 10 |
| ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా బి. వినోద్ కుమార్ | 12 |
| శాసనమండలి ప్రభుత్వ విఫ్‌గా టి. భానుప్రసాద్ రావు | 14 |
| షిర్డీలో చౌల్ట్రీ కొరకు మహారాష్ట్రకు ఐవా బృంధం | 16 |
| స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ రావు జయంతి | 19 |
| ఐవా వార్షిక సర్వసభ్య సమావేశం | 20 |
| ఘనంగా వివాహ పరిచయ వేదిక | 22 |
| ఐవా ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు | 24 |
| ప్రాజెక్ట్ హ్యాపీ లైఫ్ | 26 |
| అవయవదానం మహాదానం | 33 |
| కుముదవల్లి విలాసము పుస్తకావిష్కరణ | 34 |
| జీవన గమనంలో | 36 |
| పౌరుషానికి పుట్టినిల్లు బొబ్బిలి సంస్థానము | 37 |
| గోన విష్ణువర్ధన్ రావు పదవీ విరమణ | 42 |
| బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ వెలిచాల కొండల్ రావు | 49 |
| క్షీరవిప్లవంలో భాగంగా కపిల డెయిరీ | 53 |
| వార్తలు - విశేషాలు | 55 |
| వివాహ వేదిక | 78 |

### ముద్రణ మరియు ప్రచురణ కర్త

అఖిల భారత వెలమ సంఘం, రిజిస్టర్డ్ నెం. 367/74, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500 029 వారి కొరకు మరియు వారి తరఫున ప్రధాన కార్యదర్శి ఈ 'వెలమ వైజయంతి' సంచికను ముద్రించారు మరియు ప్రచురించారు.

ముద్రించిన వారు : **సూర్యా గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 9849022838, 040-2760 3339
e-mail : jk.suryagraphics@gmail.com

### చిరునామా:

**'వెలమ వైజయంతి'**
అఖిల భారత వెలమ సంఘం,
3-6-432, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500 029. ఫోన్: 2763 7694.



## అధ్యక్షులవారి అభిలాష

**వెలమ బంధుమిత్రులు, శ్రేయోభిలాషులందరికీ**
**వినమ్రపూర్వక నమస్కారములు...**

గత జులై 28న జరిగిన ఐవా వార్షిక సర్వసభ్య సమావేశంలో సంఘ కార్యకలాపాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించుకోవడం జరిగింది. మా కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఏడాది కాలంలో పెండింగ్ పనులను దాదాపుగా పూర్తిచేయడం, భవిష్యత్ కార్యాచరణలో భాగంగా షిర్డి పుణ్యక్షేత్రంలో వెలమ చౌల్ట్రీ నిర్మించాలనే ప్రతిపాదనకు వచ్చాము. ఈ విషయంలో ఐవా ప్రతినిధి బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర పడ్నవీస్‌ను కలిసి షిర్డిలో వెలమ చౌల్ట్రీ నిర్మాణానికి అనువైన ఒక ఎకరం స్థలం కెటాయించాలని మెమోరాండం సమర్పించాము. ఈ మెమొరాండంలో 'ఐవా' లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి సవివరంగా వారికి తెలియజేయటం జరిగింది.

'ఐవా' ప్రతిపాదనకు 'మహా' ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఐవా ఆధ్వర్యంలో చేపడుతున్న, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రశంసించారు. 'ఐవా' ప్రతినిధి బృందం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఫడ్నవీస్‌ను కలిసివచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అహమద్‌నగర్ జిల్లా కలెక్టర్, షిర్డి ఆర్డివోకు ఆదేశాలు జారీ చేశారు. ఐవా ప్రతిపాదనకు అనుగుణంగా ఎకరం స్థలాన్ని చౌల్ట్రీ నిర్మాణం కోసం కేటాయించాలని కోరుతు లేఖ వ్రాసారు. దీంతో అక్కడి సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ చౌల్ట్రీ నిర్మాణ వివరాలు (ప్రాజెక్టు వివరాలు) సమర్పించాలని 'ఐవాను' కోరటం జరిగింది. దీంతో మన ప్రాజెక్టు వివరాలను ఆర్డీవోకు సమర్పించే బాధ్యతను ఐవా కోశాధికారి శ్రీ తన్నీరు బాపురావుకు అప్పగించడం జరిగింది. శ్రీ బాపురావుకు సహకరించేందుకు సంఘ కార్యనిర్వాహక కార్యదర్శులు శ్రీ కిరణ్ కుమార్, శ్రీ వెంకటేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ ఐలేని నర్సింహా రావులతో పాటు మరో ఇద్దరు సభ్యులు శ్రీ పి. సత్యనారాయణ రావు, శ్రీ చక్రధర్ రావులకు బాధ్యతలు అప్పగించటం జరిగింది. వెలమ చౌల్ట్రీకి స్థలం కేటాయించే విషయమై మహారాష్ట్ర గృహ నిర్మాణ శాఖామాత్యులు శ్రీ వికె పాటిల్‌గారు చాలా శ్రద్ధ చూపిస్తున్నారు. వారికి ఐవా పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

షిర్డి సాయినాథుని సన్నిధానానికి కేవలం 3, 4 కిలోమీటర్ల దూరంలోనే స్థలం కేటాయించే అవకాశాలున్నాయి. స్థలం కేటాయించిన తర్వాత దాతల సహకారంతో చౌల్ట్రీ నిర్మాణానికి శ్రీకారం చుట్టాలన్నది ఐవా సంకల్పం. ఈ చౌల్ట్రీ నిర్మాణం జరిగితే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల 'బాబా' భక్తులకు ఎంతో సౌకర్యవంతమైన వసతి లభిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా నన్ను నియమించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి, టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ తారక రామారావు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

రాష్ట్ర ఐటి, పురపాలక శాఖామంత్రిగా శ్రీ కల్వకుంట్ల తారక రామారావు, రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులుగా శ్రీ తన్నీరు హరీష్ రావులు పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారికి నా హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేసు కొంటున్నాను.

పేదల పెన్నిది డా॥ కటారి సత్యసాగర్ రావు, సామాజిక సేవా తత్పరులు శ్రీ జువ్వాడి నారాయణ రావుల అకాల మరణానికి చింతిస్తు వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను.

మీ తానిపర్తి భానుప్రసాద్ రావు
అధ్యక్షులు, అఖిల భారత వెలమ సంఘం

## కార్యదర్శిగారి ఆకాంక్ష



**ప్రియమైన వెలమ బంధుమిత్రులు, శ్రేయోభిలాషులందరికీ వినమ్రపూర్వక నమస్కారములతో ...**

మా కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా మా కార్యవర్గ పనితీరును ఆదరించి, ఆశీర్వదించిన వెలమ బంధువులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనాలు. ఏడాది కాలంలో పెండింగ్ పనులన్నింటిని దాదాపుగా పూర్తి చేయడం జరిగింది. టిఆర్ఆర్ కల్చరల్ సెంటర్, వేములవాడలోని పాలెపు ఆండాళమ్మ రాజేశ్వర్ రావు వెలమ చౌట్రీ, శ్రీశైలం చౌట్రీలోని రాణి మల్లమ్మ బ్లాక్ పనులను పూర్తి చేసి వెలమ బంధువులు, భక్తులకు అందుబాటులోకి తెచ్చాము. బాసర పుణ్యక్షేత్రంలోని శ్రీ వోని ధర్మయ్య వెలమ చౌట్రీ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. మహారాష్ట్ర, అహ్మద్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, సద్గురు సాయి సన్నిధానంలో వెలమ చౌట్రీ నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఐవా ప్రతినిధుల బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర పడ్నవీస్‌ను కలిసి మెమొరాండం సమర్పించింది. మా అభ్యర్థనను పరిశీలించిన ముఖ్యమంత్రి స్థలం కేటాయింపుకు సానుకూలంగా స్పందించారని తెలుపుటకు సంతోషిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ వెలమ సంఘం ఉపాధ్యక్షులుగా విశిష్ట సేవలందించిన స్వర్గీయ ప్రొఫెసర్ పొనుగోటి ప్రమదా దేవి జన్మదినం సందర్భంగా కుముదవల్లి విలాసము అనే గ్రంథావిష్కరణ జరగడం ఆనందంగా ఉంది. మహిళా సాధికారత కోసం, సంఘ పురోభివృద్ధి కోసం ప్రమదాదేవి అందించిన విశిష్ట సేవలు చిరస్మరణీయం. ఈ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించిన నిర్వాహకులు డా॥ పొనుగోటి ఇందిరాదేవి, శ్రీమతి కోరుకంటి పద్మినీదేవిలు అభినందనీయులు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన వెలమ ఆణిముత్యం వెంపల్లి సిద్ధార్థ ఎన్నో పోటీపరీక్షలు వ్రాసి అత్యుత్తమర్యాంకు సాధించి నిట్ వరంగల్‌లో(ఇఇఇ) బి.టెక్‌లో ప్రవేశం పొందాడు. ఈ విద్యార్థి తల్లిదండ్రుల ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నందున అడాప్ట్ ది స్టూడెంట్ కార్యక్రమం క్రింద ఆర్థిక సహాయం అందించాలని 'ఐవా'ను అభ్యర్థించారు. ఈ విద్యార్థికి ఆర్థిక సహాయం అందివ్వడానికి ముందుకు వచ్చే దాతలను సాదరంగా ఐవా కార్యవర్గం పక్షాన స్వాగతిస్తున్నాను.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మేడ్చల్ ఆర్‌టిఏ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీ ఉత్పల చంద్రకాంత్ రావుకు ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా వారికి నా శుభాభినందనలు. అక్వాకల్చర్‌లో ఉత్తమ రైతుగా అవార్డునందుకొన్న శ్రీ సంకినేని శేఖర్ రావుకు నా అభినందనలు. సంఘ కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహిస్తూ, భవిష్యత్ కార్యాచరణ పై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఐవా కార్యవర్గం కసరత్తు చేస్తుంది. సంఘపరంగా ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేయాలన్నా దాతల దాతృత్వం ఎంతైనా అవసరమన్నది మీకు తెలియంది కాదు. ఔదార్యం కలిగిన దాతలకు ఐవా సాదరంగా స్వాగతం పలుకుతుంది. అడాప్ట్ ది స్టూడెంట్ కార్యక్రమానికి స్పాన్సర్స్ ముందుకు వచ్చి తమ మానవతావాదాన్ని చాటాలని సవినయంగా కోరుతున్నాను.

పదవీ ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర ఐటి, పురపాలక శాఖామంత్రి శ్రీ కల్వకుంట్ల తారక రామారావు, రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్, శాసన మండలి చీఫ్ విప్, ఐవా అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావులకు ఈ సందర్భంగా నా హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేసుకొంటున్నాను.

ఇటీవల మరణించిన ప్రముఖ వైద్యులు స్వర్గీయ కటారి సత్యసాగర్‌రావు, స్వర్గీయ జువ్వాడి నారాయణరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నాను.

సదా సంఘసేవలో... మీ

**పూస్కూరు శ్రీకాంత్ రావు**
ప్రధాన కార్యదర్శి

# వెలమ బంధువుల నిత్య చైతన్య దీప్తి...



'ఐవా' ఆధ్వర్యంలో వెలువడుతున్న వెలమ వైజయంతి ద్వైమాసిక పత్రిక క్రమం తప్పకుండా వెలువడుతు వెలమ బంధువుల నిత్య చైతన్య దీప్తిగా వెలుగొందుతుంది. మన (మీ) పత్రికలో ప్రచురణార్హమైన కవితలు, సామాజిక స్పృహ కల్గించే వ్యాసాలు, వెలమ సంక్షేమ సంఘం అనుబంధ సంఘాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలు, పుస్తక సమీక్షలు, వెలమ ఆణిముత్యాల వివరాలు సవివరంగా వ్రాసి పంపించాలని సవినయంగా కోరుకుంటున్నాను.

సంఘంపై భారం పడకూడదనే ఉద్దేశంతో పత్రిక ప్రచురణ కోసం వ్యాపార, వాణిజ్య ప్రకటనలు సేకరించడం జరుగుతుంది. పత్రిక పురోభివృద్ధిలో మన వెలమ బంధువులంతా భాగస్వాములవుతారని ఆశిస్తున్నాను. ఐవా చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను ప్రతి వెలమ బంధువులు తెలుసుకోవాలన్న తపనతో నిత్యనూతనంగా పత్రికను తీర్చిదిద్దడం జరుగుతుంది.

కొందరి సభ్యులకు పత్రిక అందటం లేదన్న ఫిర్యాదులు రావడమే కాకుండా ప్రతి రెండు మాసాలకోమారు ప్రచురించే వెలమ వైజయంతి ద్వైమాసిక పత్రిక సరైన పోస్టల్ చిరునామా లేక తిరిగి కార్యాలయానికి చేరుతున్నాయి.

ఈ విషయంలో చిరునామాలలో మార్పు చేర్పులున్న గౌరవ సభ్యులు, వెలమ బంధువులు తమ చిరునామాలను ఎప్పటికప్పుడు 'ఐవా' ప్రధాన కార్యాలయంలో అప్‌డేట్ చేయించుకోవాలని కోరుతున్నాను. వెలమ వైజయంతిని ఆశీర్వదించి, ఆదరిస్తారని విశ్వసిస్తూ...

పత్రికాభివందనాలతో...
మీ
శ్రీకాంత్ రావు పూస్కూరు

**మీ చిరునామా మారితే ఈ క్రింది విధంగా కార్యాలయానికి మీ మారిన చిరునామా తెలుపగలరు.**

| | |
|---|---|
| ఎల్.ఎమ్. నెంబర్ : | **చిరునామా:** |
| 1) పేరు : | **'వెలమ వైజయంతి'** |
| 2) తండ్రి పేరు : | అఖిల భారత వెలమ సంఘం, |
| 3) ఇంటి. నెంబరు : | 3-6-432, హిమాయత్‌నగర్, |
| 4) వీధి : | హైదరాబాద్-500 029. ఫోన్: 2763 7694. |
| 5) పట్టణము/గ్రామం : | పూస్కూరు శ్రీకాంత్ రావు |
| 6) మండలం : | ప్రధాన కార్యదర్శి |
| 7) జిల్లా / పిన్ కోడ్ : | ఫోన్: 9581781234 |
| 8) ఫోన్ నెంబరు : | |

# ఐటీ, పురపాలక శాఖామాత్యులుగా...
# కల్వకుంట్ల తారక రామారావు



అరమరికలు లేని ఆప్యాయత, కరకుదనంలేని చురుకుదనం, పటిష్ట వ్యూహాలు రూపొందించే రాజకీయ చతురత, ఆంగ్ల, హిందీ, ఉర్దూ భాషలలో అనర్గళంగా మాట్లాడే వాక్చాతుర్యం అన్నింటికి మించి చెదరని ఆత్మవిశ్వాసం ఈ లక్షణాలన్నీ పుణికిపుచ్చుకొన్న యువనాయకుడు శ్రీ కల్వకుంట్ల తారక రామారావు. 2006లో ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో చేరి తెలంగాణ ఉద్యమ సారథి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు బాసటగా నిలిచారు. ఉద్యమ సందర్భంగా రాజకీయ, పోరాటపటిమ మెళకువలు నేర్చుకొన్నారు.

గత నాలుగున్నరేళ్ళ కాలంలో ఐ.టి. పురపాలక జౌళీ, ఎన్ఆర్ఐ ఎఫేర్స్ మంత్రిగా సత్తాచాటిన శ్రీ కెటిఆర్ జిహెచ్ఎంసి ఎన్నికలలో తనదైన వ్యూహంతో బల్దియా పై గులాబి జెండాను రెపరెపలాడించారు. తన రాజకీయయుక్తి, టిఆర్ఎస్ శక్తిని జోడించి తరగని ఉత్సాహంతో 2018 అసెంబ్లీ ముందస్తు ఎన్నికల్లో టిఆర్ఎస్ అఖండ విజయాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఇందుకు నజరానాగా టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని దక్కించుకొన్నారు. ప్రస్తుతం ఐటి, పురపాలక శాఖామాత్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామంలో శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, శ్రీమతి శోభారావు దంపతులకు 1976 జులై 24న జన్మించిన శ్రీ కల్వకుంట్ల తారక రామారావు రెండేళ్ళపాటు కరీంనగర్‌లో విద్యనభ్యసించారు. అనంతరం హైదరాబాద్‌లో పాఠశాల విద్య పూర్తి చేశారు. గుంటూరు విజ్ఞాన్ కళాశాల నుండి ఇంటర్మీడియెట్ పూర్తి చేసి మెడికల్ ఎంట్రెన్స్ వ్రాశారు. కర్నాటకలోని ఒక మెడికల్ కళాశాలలో సీటు వచ్చినప్పటికి వైద్యవిద్యపట్ల అంతగా ఆసక్తి లేని శ్రీ కెటిఆర్ నిజాం కళాశాల నుండి మైక్రోబయాలజీలో డిగ్రీ పూర్తి చేశారు. మహారాష్ట్రలోని పూణె విశ్వవిద్యాలయం నుండి బయోటెక్నాలజీలో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. అమెరికాలోని న్యూయార్క్ సిటి విశ్వవిద్యాలయం నుండి మేనేజ్‌మెంట్ కామర్స్‌లో ఎంబిఏ పట్టా పుచ్చుకున్నారు. ఆ తర్వాత అమెరికాలో ఇంట్రా సంస్థ ప్రాజెక్టు మేనేజర్‌గా దాదాపు ఐదేళ్ళు పనిచేశారు. 2006లో ఉద్యోగానికి రాజీనామాచేసి తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో తండ్రికి తోడుగా నిలిచారు.

2009లో మొట్టమొదటిసారి సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యారు. 2010లోను 2014లోను సిరిసిల్ల అసెంబ్లీ



నియోజకవర్గం నుండి శాసన సభకు ఎన్నికైన శ్రీ కె.టి. రామారావు టిఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో మొదటగా పంచాయతీరాజ్ శాఖామంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత ఐటి పుర పాలక, ఎన్నారై ఎఫైర్స్ జౌళీ శాఖా మంత్రిగా సమర్ధవంతమైన బాధ్యతలు నిర్వర్తించారు.

ఐటి పురోగతి:

2014లో దుబాయ్‌కి చెందిన లులు గ్రూప్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. దుబాయిలో పర్యటించిన శ్రీ కెటిఆర్ అక్కడి 20 వేల మంది తెలంగాణ కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మే 2015న ఐటి శాఖకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గంతో రెండు వారాల పర్యటన కోసం అమెరికా వెళ్ళారు. దీని ప్రధాన ఉద్దేశం తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం మొదటిది కాగా అక్కడి ప్రతిష్టాత్మక కంపెనీల భాగస్వామ్యాన్ని ఆశించే ప్రక్రియ రెండవది. ఈ సందర్భంగా శ్రీ కెటిఆర్ ప్రతిష్టాత్మక 30 కంపెనీలతో చర్చించారు. ఇందులో జాన్ చాంబర్స్ ఆఫ్ సిస్కో, మార్క్ హార్డ్ ఆఫ్ ఒరాకిల్‌లున్నాయి. మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెళ్ళ అమెజాన్ ఎగ్జిక్యూటివ్‌లతోను వీరు సమావేశమై తెలంగాణ నూతన పారిశ్రామిక విధానం పై చర్చించారు. సీటెల్‌లో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు.

హైదరాబాద్‌ను గ్లోబల్ సిటిగా మార్చాలన్నది శ్రీ కెటిఆర్ సంకల్పం. ఇందుకు తగ్గరీతిలో వారు వివిధ దేశాలలో పర్యటించారు. తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలలోను ఐటి హబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఐటి రంగంలో విప్లవాత్మక ప్రగతి సాధించాలన్నదే ధ్యేయంగా ముందడుగు వేశారు. గూగుల్ సంస్థ హైదరాబాద్ కేంద్రంగా మరింత విస్తరించేందుకు వేయికోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది.

అమెజాన్ సంస్థ తెలంగాణలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు ముందుకు వచ్చేలా శ్రీ కెటిఆర్ ఒప్పించగలిగారు. ఇందుకు సంబంధించి అమెజాన్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకొంది. ఊబర్ సంస్థ హైదరాబాద్‌లో 50 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం విశేషం.

2015 జూన్ 4న హాంకాంగ్‌లో పర్యటించిన శ్రీ కెటిఆర్ ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ ఉత్పత్తిదారులతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వారిని ఆహ్వానించారు. ఈ దేశపర్యటనలో భాగంగా దాదాపు 50 మంది వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

జూన్ 8న తైవాన్‌లో పర్యటించిన శ్రీ కెటిఆర్ ఫాక్స్‌కాన్ టెక్నాలజీస్, ఎఫ్ఐహెచ్ మొబైల్స్, టెక్నో ఎలక్ట్రిక్ మిషనరీ కంపెనీ ప్రతినిధులను తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించారు. వీరందరికీ తెలంగాణ రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానాన్ని వివరించారు. 2015 నవంబర్ 5న 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 40 కోట్ల అంచనా వ్యయంతో గచ్చిబౌలిలో ఐటిహబ్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. 2016 మార్చి 19న కేంద్ర ఐటి శాఖ మంత్రి శ్రీ రవిశంకర్ ప్రసాద్‌ను కలిసి టి.హబ్ రెండవ దశకు వందకోట్ల రూపాయలు మంజూరి చేయాలని కోరారు. ఐటి రంగ అభివృద్ధికి 3 వేల కోట్లు అవసరమని చెప్పారు.

సింగిల్ విండో క్లియరెన్స్‌ల ద్వారా దాదాపు వెయ్యి సంస్థలకు అనుమతులు మంజూరు చేశారు. 2015 జులై ఆగష్టు మాసాల మధ్య ఈ అనుమతులిచ్చారు. 25 వేల కోట్ల పెట్టుబడులతో 70 వేల కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడింది. నిరుద్యోగులలో వృత్తిపరమైన మెళకువలు పెంపొందించేందుకు టాస్క్‌ను ఏర్పాటు చేశారు. సైబర్ క్రైంల నియంత్రణకు సంబంధించి రెండు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారు.

పంచాయితీరాజ్ శాఖామంత్రిగా:

2015 జనవరి 19న వివిధ శాఖలకు చెందిన 29 మంది ప్రభుత్వ ఉద్యోగులు సర్పంచ్‌ల నేతృత్వంలో పనిచేసేలా చట్టాన్ని రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. దీని వల్ల గ్రామ పంచాయితీలు బలోపేతం కాగలవన్నది శ్రీ కెటిఆర్ విశ్వాసం. తెలంగాణ రాష్ట్రంలోని వెనుకబడిన 150 మండలాలలో పల్లె ప్రగతి క్రింద 2020 నాటికి 642కోట్లు ఖర్చు చేయాలన్న ప్రతిపాదనలున్నట్లు ప్రకటించారు.

2015 జూన్‌లో కేంద్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి శ్రీ నిహాల్ చంద్‌ను కలిసి 13వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ నిధులతో మా గ్రామం, మా ప్రగతి నినాదంగా హరితహారం, డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణాలకు ఈ నిధులు ఖర్చు పెట్టవచ్చున్నది శ్రీ కెటిఆర్ ఉద్దేశం. గ్రామజ్యోతి కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేపట్టేందుకు కేబినెట్ సబ్ కమిటి ఏర్పాటైంది. 2015 ఆగష్టు 15న గ్రామజ్యోతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా తాగునీటి సమస్యపరిష్కారం, ఆరోగ్యం,

విద్య, విద్యుత్, సానిటేషన్, రహదారుల నిర్మాణాలకు ఈ కార్యక్రమం క్రింద నిధులు విడుదల చేసే అవకాశం లభించనుంది. తెలంగాణ పల్లె ప్రగతి, కళ్యాణ లక్ష్మి, బీమా సురక్ష, స్వయం సహాయక సంఘాలను పటిష్ఠం చేయడం లాంటి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చారు. ఈ కార్యక్రమాల అమలు కోసం గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించేవారు.

**జిహెచ్ఎంసి ఎన్నికలలో...**

జిహెచ్ఎంసి ఎన్నికలలో టిఆర్ఎస్‌ను విజేతగా నిలిపే గురుతర బాధ్యతను ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శ్రీ కెటిఆర్‌కు అప్పగించారు. నగరంలోని 150 వార్డులలో కేవలం వారం రోజుల వ్యవధిలో విస్తృతంగా పర్యటించి వంద సమావేశాలలో పాల్గొని క్యాడర్‌కు దిశానిర్దేశం చేయడమే కాకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ప్రజా దీవెనలను అర్థించారు.

సీమాంధ్రుల విశ్వాసం చూరగొనేలా తన వాగ్ధాటితో ప్రచార పర్వంలో దూసుకెళ్ళారు.

బస్తీ లీడర్లను కలుపు కొని ఉదయం 6 గంటల నుండి రాత్రి పొద్దుపోయే వరకు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కెటిఆర్ పడ్డ శ్రమకు తగ్గఫలితం దక్కింది. 150 వార్డులలో 99 వార్డులను టిఆర్ఎస్ దక్కించుకొంది. బల్దియాపై గులాబి జెండా రెప రెపలాడటంలో శ్రీ కెటిఆర్ కృషి అనిర్వచనీయం. పురపాలక శాఖామంత్రిగా విశ్వనగరం కలల సాకారానికి విప్లవాత్మక నిర్ణయాలు గైకొన్నారు.

గత నాలుగున్నరేళ్ళ కాలంలో పరిపక్వత చెందిన నేతగా ఎదిగిన శ్రీ కెటిఆర్ 2018 ముందస్తు శాసనసభ ఎన్నికలలోను ప్రచార పర్వంలో ముఖ్య భూమిక పోషించారు. తత్ఫలితంగా వీరిని కార్య నిర్వాహక అధ్యక్ష పదవి వరించింది.

తెలంగాణ రాష్ట్ర ఐటి, పురపాలక శాఖామాత్యులుగా ఎన్నికైన సందర్భంగా శ్రీ కల్వకుంట్ల తారక రామారావుకు అఖిల భారత వెలమ సంఘ కార్యవర్గం శుభాభినందనలు తెలియజేసింది. •

---

## రవాణాశాఖలో ఉత్తమ అధికారిగా ...

# ఉత్పల చంద్రకాంత్‌కు పురస్కారం




విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నీతి, నిజాయితీ, పారదర్శకతతో పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులలో నూతనోత్సాహం కల్గించేందుకు జిల్లాస్థాయి, రాష్ట్ర, కేంద్రస్థాయిల్లో స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం రోజున అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించటం ఆనవాయితీగా వస్తుంది. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మేడ్చల్ రవాణా శాఖలో పరిపాలనాధికారి (ఏఓ)గా పని చేస్తున్న ఉత్పల చంద్రకాంత రావును జిల్లా పాలనా యంత్రాంగం ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో శ్రీ ఉత్పల మాధవ రావు, శ్రీమతి ఉత్పల రమాదేవి దంపతులకు జన్మించిన శ్రీ చంద్రకాంత్ రావు బిఎస్సీ పట్టభద్రులు. 1995లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన శ్రీ చంద్రకాంత్ రావు రవాణాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగిన వీరు ప్రస్తుతం మేడ్చల్ రవాణాశాఖలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా సేవలందిస్తున్నారు. 2019 ఆగష్టు 15న జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమఅధికారిగా ప్రశంసా పత్రాన్ని అందుకొన్నారు. వరుసగా ఆరు సార్లు ఉత్తమ అధికారిగా జిల్లా పాలనా యంత్రాంగం ఎంపిక చేయడం విశేషం.

వీరి సతీమణి శ్రీమతి రమాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయులు కాగా ఈ దంపతులకు ఇద్దరు కుమారులు శ్రీ ప్రణీత్ రావు, శ్రీ వినీత్ రావులున్నారు. రవాణాశాఖలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఐవా కార్యవర్గం, వెలమ వైజయంతి ఆకాంక్షిస్తుంది.

– నీలగిరి వెంకటేశ్వర్ రావు

# ఆర్థిక శాఖామాత్యులుగా...
# తన్నీరు హరీష్ రావు



పెదాలపై చెరగని చిరునవ్వు, సాటి మనిషికి సాయపడాలనే తపన, అన్ని వర్గాలను కలుపుకొని పోగల మనస్తత్వం ఆయన సొంతం. వారు కారు దిగితేనే చాలు తండోపతండాలుగా తరలివచ్చే జనం. అందరిని ఆప్యాయంగా పలు కరించి వారి యోగక్షేమాలు తెలుసు కొనే వ్యక్తిత్వం ఈ లక్షణా లన్నీ మూర్తీభవించిన జన హృదయ నేత శ్రీ తన్నీరు హరీష్ రావు. చిన్నవయస్సులోనే తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో తన ఉనికిని చాటి ఉద్యమనేత టిఆర్ఎస్ అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆశీస్సులందుకున్నారు. ఓటమెరుగని ధీరుడు, మడమ తిప్పని యోధునిగా తెలంగాణ సాధన ఉద్యమంలో తనదైన ముద్ర వేసుకొన్నారు. భారీ నీటి పారుదల, మార్కెటింగ్, శాసన సభా వ్యవహారాల శాఖామంత్రిగా సమర్థవంతమైన సేవలందించారు. 'ఐవా' కార్యక్రమాలను సైతం సహృదయంతో ప్రోత్సహించారు. మాస్ లీడర్, స్ట్రాంగ్ క్యాడర్ కలిగిన శ్రీ హరీష్ రావు 2018 అసెంబ్లీకి జరిగిన ముందస్తు ఎన్నికలలో దేశ చరిత్రలోనే అరుదైన రికార్డు సాధించారు. 1లక్షా 20వేల 650ఓట్ల ఆధిక్యతతో 6వ సారి శాసన సభకు ఎన్నికయ్యారు. ఏడాదిలోపు తిరిగి రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చెందిన శ్రీ తన్నీరు సత్యనారాయణ రావు శ్రీమతి లక్ష్మిబాయి దంపతులకు 1972 జూన్ 3న జన్మించిన శ్రీ తన్నీరు హరీష్ రావు కరీంనగర్‌లోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు వాణినికేతన్‌లో చదువుకొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పట్టా పుచ్చుకొన్నారు. హైదరాబాద్‌లోని మసాబ్‌ట్యాంక్ జెఎన్‌టియులో పాలిటెక్నిక్ విద్యనభ్యసించారు.



తెలంగాణ సాధన ఉద్యమంలో తెలంగాణ ఉద్యమ సారథి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు బాసటగా నిలిచారు. ఉద్యమ సారథి శ్రీ కెసిఆర్‌కు స్వయాన మేనల్లుడైన శ్రీ హరీష్‌రావు చిన్న వయస్సులోనే అలవర్చుకొన్న నాయకత్వ లక్షణాలు, పోరాట పటిమను గుర్తించిన శ్రీ కెసిఆర్ శ్రీ హరీష్‌రావును రాజకీయంగా,ఉద్యమపరంగా ప్రోత్సహించారు.

2004లో తెలంగాణ ఉద్యమ సారథి శ్రీ కెసిఆర్ సిద్ధిపేట శాసన సభ్యుడిగా,

కరీంనగర్ పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక కావడం, ఆ తర్వాత శ్రీ కెసిఆర్ సిద్ధిపేట శాసన సభ్యత్వానికి రాజీ నామా చేయడం జరిగింది. దీంతో సిద్ధిపేట అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో శ్రీ తన్నీరు హరీష్ రావును టిఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దింపారు. అప్పుడు ఆయన వయస్సు 32 ఏళ్ళు. 2004 ఉపఎన్నికలలో శ్రీ హరీష్‌రావు 24 వేల 829ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికైన శ్రీ హరీష్ రావు శాసనసభలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలపై తీవ్రస్థాయిలో గళమెత్తారు. టిఆర్ఎస్ పార్టీలో కీలకనేతగా మారారు. 2008లో జరిగిన ఉప ఎన్నికలలోను వీరు 58 వేల 935 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2009లో అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికలలో సిద్ధిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి 64 వేల 677 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శాసనసభలో వీరు శాసనసభా పక్షనేతగా ఎంపికయ్యారు. ప్రత్యేక తెలంగాణ విషయంలో కేంద్రలోని యూపిఏ సర్కారు డిసెంబర్ 9న చేసిన ప్రకటనను వెనుకకు తీసుకొన్న నేపథ్యంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తత్ఫలితంగా 2010లో జరిగిన ఉపఎన్నికలలో 95వేల 878 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి డా॥ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సాధించిన 68,681 ఓట్ల రికార్డును శ్రీ తన్నీరు హరీష్ రావు అధిగమించారు.

తెలంగాణసాధన ఉద్యమంలో కాలుకు బట్ట కట్టకుండా ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ, తూర్పు, పశ్చిమ తెలంగాణ జిల్లాలలో విస్తృతంగా పర్యటించి టిఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఉత్తేజపరచడంలో విశేష కృషి చేశారు. వాస్తవానికి తెలంగాణ ఉద్యమ ఆత్మ శ్రీ కెసిఆర్ అయితే ఆ ఉద్యమానికి గుండెకాయలాంటి శ్రీ తన్నీరు హరీష్ రావు పరిపక్వత చెందిన పోరాట యోధునిగా ఎదిగారు. పాల పళ్ళూడని పసివాడి నుండి కాటికి కాళ్ళు చాపే ముసలివాళ్ళలో సైతం ఉద్యమ వేడిని రగిలించిన పోరాట యోధుడు శ్రీ హరీష్ రావు. తెలంగాణ సాధన ఉద్యమంలో కులసంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలలో నూతనోత్సాహం రగిలించి ఉద్యమానికి ఊపిరి లూదిన శ్రీ తన్నీరు హరీష్ రావుకు తెలంగాణ సాధనలో ఒక ప్రత్యేక పాత్ర ఉందనడంలో సందేహం లేదు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకను గుణంగా కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వం 2014లో దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా పార్లమెంటు ఉభయ సభలు తెలంగాణ బిల్లును ఆమోదించాయి. అప్పటి సమైక్య రాష్ట్రంలోనే అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలోను శ్రీ హరీష్ రావు 93,328 ఓట్ల మెజార్టీతో సిద్ధిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా ఏర్పాటైన శాసనసభలో శ్రీ తన్నీరు హరీష్ రావు భారీ నీటి పారుదల శాఖామంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. భారీ నీటిపారుదల శాఖామాత్యులుగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చెరువు కుంటలకు జలకళ తెచ్చేందుకు వీలుగా 2015 మార్చి 12 న మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సత్ఫలితాలిచ్చింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం వల్ల దాదాపు 45 వేల చెరువు కుంటలకు జలకళ వచ్చేసింది.

**కాళేశ్వరం ప్రాజెక్టు:** తెలంగాణ సాగు నీటి ప్రాజెక్టులలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని శ్రీ తన్నీరు హరీష్ రావు మొదటి నుండి డిమాండ్ చేస్తున్నారు. ప్రాణహిత, చేవెళ్ళ ప్రాజెక్టును రీడిజైనింగ్ చేసి కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. ప్రాణహిత, చేవెళ్ళ ప్రాజెక్టు ద్వారా ఆశించిన నీటి నిలువ సామర్థ్యం లేకపోవడం, పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టువల్ల కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలలోని మెట్ట ప్రాంతాలలో దాదాపు 7 లక్షల 38 వేల 851 హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించే అవకాశం కలుగుతుంది. సాగునీటి, తాగునీటి రంగాలలో విప్లవాత్మక ప్రగతి సాధించడంలో శ్రీ తన్నీరు హరీష్ రావు చేసిన కృషి ప్రశంసనీయం.

మార్కెటింగ్ శాఖామంత్రిగా రైతు బజార్లను ఏర్పాటు చేయడం, రైతాంగ సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ఆయన అన్నదాతకు కూడా ఆప్తులయ్యారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగా గత నాలుగున్నరేళ్ళ కాలంలో శ్రీ హరీష్ రావు నిర్వహించిన పాత్ర అనిర్వచనీయం. 2018 అసెంబ్లీ ముందస్తు ఎన్నికలలో 6వసారి సిద్ధిపేట అసెంబ్లీ నియోజక వర్గం నుండి దేశ చరిత్రలోనే మొదటి సారిగా 1లక్షా 20వేల 650 ఓట్ల భారీ ఆధిక్యతతో ఘన విజయం సాధించి రికార్డు సృష్టించారు. •

## తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులుగా

# బోయినిపల్లి వినోద్ కుమార్



***నైతిక విలువల పునాదిపై ఎదిగిన శ్రీ బోయినిపల్లి వినోద్ కుమార్ మంచి స్నేహశీలురు. వివాదాలకు అతీతంగా రాగద్వేషాలకు, ఇష్టాయిష్టాలకు, కోపతాపాలకు దూరంగా, ప్రజాహితమే పరమార్థంగా, ప్రజాహిత సేవకునిగా అన్నివర్గాల మన్ననలందుకొన్నారు. 16వ లోకసభలో డిప్యూటి ఫ్లోర్ లీడర్‌గా తెలంగాణ రాష్ట్రం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై గళమెత్తారు. అభ్యుదయవాదిగా 14 ఏళ్ళ ప్రాయంలోనే విద్యార్థి రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించిన శ్రీ బోయినిపల్లి వినోద్ కుమార్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ సమయం నుండి నేటి వరకు పార్టీ పటిష్టతకు అలుపెరుగని సేవలందించారు. రెండుసార్లు 14వ లోక్‌సభ, 16వ లోక్‌సభలో ప్రాతినిథ్యం వహించిన వీరి సేవలకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైన శ్రీ బోయినిపల్లి వినోద్ కుమార్‌ను ఐవా కార్యవర్గం అభినందించింది.***

1959 జులై 22న వరంగల్ జిల్లా ఎన్గల్‌లో శ్రీ బోయినిపల్లి మురళీధర్ రావు, శ్రీమతి సుగుణాదేవి దంపతులకు జన్మించిన శ్రీ బోయినిపల్లి వినోద్ కుమార్ కాకతీయ విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల నుండి న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకొన్నారు. వరంగల్ దేశాయిపేటలోని నెహ్రూ మెమోరియల్ స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసిన వీరు హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. 1977-1980లో హన్మకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో బి.ఎస్సీ డిగ్రీ పూర్తి చేసి 1980-1984లో ఎల్‌ఎల్‌బి పూర్తి చేశారు.



1984లో వరంగల్‌లో న్యాయవాద వృత్తి ప్రారంభించిన వీరు 1998లో హైదరాబాద్‌కు మకాం మార్చి హైకోర్టు న్యాయవాదిగా తన వృత్తిని కొనసాగించారు. 2001 ఏప్రిల్ 27న జలవిహార్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం సందర్భంగా టిఆర్ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా పార్టీని విస్తృతస్థాయిలో పటిష్ట పరిచే దిశగా అలుపెరుగని సేవలందించి పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రికి సన్నిహితునిగా ఎదిగారు. క్రమశిక్షణ కల్గిన పార్టీనేతగా పార్టీ క్యాడర్‌కు, నాయకత్వానికి సంధానకర్తగా వ్యవహరించారు.

14 ఏళ్ళ ప్రాయంలోనే విద్యార్థి రాజకీయాలలో ప్రవేశించి ఏఐఎఫ్ఎస్ నాయకునిగా విద్యార్థుల సమస్యల పరి



ష్కారానికి కృషి చేశారు. వరంగల్ జిల్లా ఏఐఎస్ఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీగా సేవ లందించిన వీరు స్టేట్‌కౌన్సిల్ మెంబర్‌గా ఎదిగారు. కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘనేతగా మంచి గుర్తింపు పొందారు. ఇండో-సోవియట్ కల్చరల్ సొసైటి సభ్యునిగా పని చేశారు. ప్రపంచ శాంతికోసం జరిగిన అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని తన వాణి వినిపించారు.

2004 నుండి 2009 వరకు హన్మకొండ పార్లమెంటు నియోజకరవ్గం నుండి 14వ లోక్‌సభకు ప్రాతినిథ్యం వహించారు. 2014-19లో కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం నుండి 16వ లోక్‌సభకు ప్రాతినిథ్యం వహించారు. 2017లో పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటి సభ్యునిగా, 2014లో వాటర్ రిసోర్సెస్ స్టాండింగ్ కమిటి సభ్యునిగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో కన్సల్టేటివ్ కమిటి సభ్యునిగా సేవలందించారు.

వీరికి సహధర్మచారిణి గైనకాలజిస్ట్ శ్రీమతి మాధవితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. •



శ్రీ చీటి లక్షణరావు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఎల్లారెడ్డిపేట మండల జెడ్‌పిటిసిగా ఎన్నికయ్యారు. నిరంతరం ప్రజాసేవలో తరించే వీరు రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండల వాస్తవ్యులు. వీరు ఇంతకు ముందు పదిరలోని హరిదాస్‌నగర్‌కు సర్పంచ్‌గా విశిష్ట సేవలందించారు. వీరు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ అవసరమైన సహాయసహకారాలు అందించడం వల్ల కేంద్ర ప్రభుత్వం నుండి నాటి కేంద్ర మంత్రి చేతుల మీదుగా నిర్మల్ పురస్కార్ అవార్డును కూడా అందుకున్నారు. నిరంతరం ప్రజలతో మమేకమయ్యే వీరి సేవలను గుర్తించిన ప్రజలు తిరిగి జెడ్‌పిటిసిగా ఎన్నుకొన్నారు. అలాగే పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండల జెడ్‌పిటిసిగా శ్రీమతి మినుపాల స్వరూప ప్రకాశ్‌రావు ఎన్నికయ్యారు. •

JD Rao
9989781888
(FREE SERVICE ONLY)
GAAYATHREE
Velama Marriage Bureau
'Iam not a Creator just Introducer'
# 10-3, Plot No. 14, East Maredpally, Mahendra Hills, Sec-bad.
E-mail: gaayathreemarriagebureau@gmail.com

## శాసన మండలి ప్రభుత్వ విప్‌గా నియమితులైన...

# తానిపర్తి భానుప్రసాద్ రావు



**నిగర్వి, నిరాడంబరుడు, మృధుభాషి, సేవాభావమే ఊపిరిగా నైతిక విలువల పరిరక్షణకు కంకణబద్ధులైన, బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజకీయ విశ్లేషకులు, శాసన మండలి సభ్యులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావును శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా నియమించారు. కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి రెండుసార్లు ఏకగ్రీవంగా శాసన మండలికి ఎన్నికైన వీరు స్థానిక సంస్థల బలోపేతానికి అలుపెరుగని కృషి చేశారు. శాసన మండలి సభ్యుని నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించే నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజాదీవెనలందుకొన్నారు. శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావును 'ఐవా' కార్యవర్గం అభినందించింది.**

శ్రీ భానుప్రసాద్ రావు కరీంనగర్ జిల్లా, పెద్దపల్లి తాలుకా, ఎలిగేడు మండలం,లోకపేట గ్రామ వాస్తవ్యులు. వీరి తల్లి దండ్రులు శ్రీమతి ప్రేమలత, శ్రీ ప్రభాకర్ రావు. శ్రీ ప్రభాకర్ రావు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖలో ఉన్నత పదవులు చేపట్టి పదవీ విరమణ పొందారు.

శ్రీ భానుప్రసాద్ రావు 1966 మే 3న జన్మించారు. వీరి హైస్కూల్ విద్యాభ్యాసం ఇంటర్ మీడియట్ విద్య వరంగల్‌లో జరిగింది. వీరు ఔరంగాబాదులో ఎమ్.ఐ.టి.యందు ఆర్కిటెక్చర్‌లో ఇంజనీరింగ్ చేశారు.ఆ తర్వాత ఉన్నత చదువులకై యూ.ఎస్. వెళ్ళి బెల్‌షోరు యూనివర్సిటీలో కన్‌స్ట్రక్షన్ మెనేజ్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ ఆఫ్ పి.హెచ్.డి. చేశారు. ఉన్నత విద్యావంతులైన శ్రీ భాను ప్రసాద్ రావు స్వదేశం తిరిగివచ్చి భవన నిర్మాణ రంగంలో ప్రవేశించి అంచలంచెలుగా ఎదుగుతూ ఎన్నో ప్రతిష్టాత్మక నిర్మాణాలు చేపట్టి పలువురి నిష్ణాతుల మెప్పు పొందుతూ ఆ రంగములో తనకంటు పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నారు.

వీరు ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి కరీంనగర్ స్థానిక సంస్థల నియోజక వర్గ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెరాసా అభ్యర్థిగా రెండవ దఫా కరీంనగర్ స్థానిక సంస్థల నియోజక వర్గం నుండి ఏకగ్రీవంగా శాసన మండలికి ఎన్నిక కావడం విశేషం. శాసన మండలి సభ్యునిగా కరీంనగర్ జిల్లాలోని స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో వీరు విశేష కృషి చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఎమ్మెల్సీ నిధుల నుండి డ్రైనేజీల నిర్మాణం, సిసి రోడ్ల నిర్మా



ణాలు చేపట్టి గ్రామీణాభివృద్ధిలో తన వంతు కృషి చేశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నూతనంగా ఆవిర్భవించిన పెద్దపల్లి జిల్లాలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

శ్రీ భానుప్రసాద్ 2013-15 మధ్య కాలంలో రాష్ట్ర వెలమ సంఘ అధ్యక్షునిగా విశిష్ట సేవలందించారు. ప్రస్తుతం 2018-2021 కాలానికి గాను అధ్యక్ష పదవికి ఎన్నుకోబడి పదవీ బాధ్యతలను చేపట్టినారు.

1994 జనవరి 17న వీరి వివాహం కరీంనగర్ జిల్లా వెలిచాల గ్రామానికి చెందిన శ్రీమతి సులోచన, శ్రీ వేణు గోపాలరావు దంపతుల పుత్రిక అయిన మంజులతతో జరిగింది. శ్రీమతి మంజులత ఎమ్.ఏ. లిటరేచర్ చదివారు. భానుప్రసాద్ మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు చిరంజీవి శ్రియ, త్రిషలున్నారు.

ఉన్నత విద్యలతో నిర్మాణ రంగం, రాజకీయ రంగంలో తలమునకలుగా ఉన్న శ్రీ భానుప్రసాద్ రావు సామాజిక రంగము, సంఘ సేవలో పాలుపంచుకోవడం కాకతాళీయంగానే జరిగింది.

తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్థించడం, పెద్దలమెప్పు పొందడం, తన టీము సభ్యుల విద్యుక్త ధర్మమని తెలిపారు. •

## ఉత్తమ ఆక్వారైతుగా.. సంకినేని శేఖర్ రావు

# వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారం



సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఏర్పడిన ఎంపిడిఏ భారత ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల శాఖ నోడల్ ఎజెన్సీ. ఈ ఎజెన్సీ ఆధ్వర్యంలో సముద్ర ఉత్పత్తులను ప్రధానంగా ఆక్వా కల్చర్, షెల్ ఫిష్ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ప్రోత్సహించేందుకు ఆక్వా అక్వేరియా ఇండియా 2011 నుండి దేశంలోని వివిధ ప్రదేశాలలో ఈవెంట్లను నిర్వహిస్తు ఆక్వా రైతులను ప్రోత్సహిస్తుంది.

ఈ క్రమంలో భాగంగా దక్షిణ భారత దేశంలోని హైదరాబాద్‌లో హైటెక్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆగష్టు 30న ఆక్వా అక్వేరియా ఇండియా ఆధ్వర్యంలో 5వ సారి గొప్ప ఈవెంటు నిర్వహించారు. ఆక్వా కల్చర్ రంగంలో ఔత్సాహితులైన రైతులను ప్రోత్సహించేందుకు అవార్డులను ప్రధానం చేశారు.

ఈ అవార్డులను భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరం వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రధానం చేశారు.

న్యాయశాస్త్రంలో పట్టాపుచ్చుకొని, ఆక్వా రైతుగా రాణించి, ఉత్తమ రైతుగా పురస్కారం అందుకొన్న శ్రీ సంకినేని శేఖర్‌రావు పోరాటాల పురిటిగడ్డ, నిత్య చైతన్య దీపిక ఓరుగల్లు జిల్లా ముద్దుబిడ్డ వర్ధన్నపేట మండలం, ల్యాబర్తి గ్రామంలో శ్రీ సంకినేని జగన్నాథ రావు, శ్రీమతి తారమ్మ దంపతులకు జన్మించిన శ్రీ సంకినేని శేఖర్ రావు డిగ్రీ తర్వాత పూణెలో న్యాయశాస్త్ర విద్యనభ్యసించారు.

1983 నుండి 1986 వరకు శ్రీ శేఖర్ రావు జెవిఆర్ బాలుర వసతి గృహ విద్యార్థి కావడం విశేషం.

నెల్లూరు జిల్లా గూడూరులో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా కల్చర్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచిన ఈ ఆక్వా కల్చర్ రైతుకు భారత ఉప రాష్ట్రపతి శ్రీ ముప్పవరం వెంకయ్య నాయుడు ఉత్తమ రైతుగా అవార్డు ప్రధానం చేయడం పట్ల ఐవా కార్యవర్గం, వెలమ వైజయంతి హర్షం వ్యక్తం చేసింది. ఆక్వారంగంలో శ్రీ శేఖర్ రావు మరింతగా రాణించాలని ఐవా కార్యవర్గం, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు ఆకాంక్షించారు.

\- నీలగిరి వెంకటేశ్వర్ రావు



## షిర్డీలో చౌల్ట్రీ నిర్మాణానికి - స్థలం కేటాయించేందుకు

# సానుకూలంగా స్పందించిన 'మహా' సి.ఎం.

**"పుణ్యమెంత చేసినదో షిర్డిధామం, బాబా పాదం సోకిన పావన తీరం". మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లాలో ఉన్న షిర్డీ పుణ్యక్షేత్రంలో 'ఐవా' ఆధ్వర్యంలో వెలమ చౌల్ట్రీ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులకు అన్ని వసతులతో కూడిన చౌల్ట్రీని నిర్మించాలన్నది 'ఐవా' సంకల్పం. శాసన మండలి సభ్యులు, ఐవా అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు 'ఐవా' ప్రతినిధి బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర పడ్నవీస్, గవర్నర్ శ్రీ చెన్నమనేని విదాసాగర్ రావులను విడివిడిగా కలిసి వెలమ చౌల్ట్రీ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతు మెమొరాండం సమర్పించింది.**

జులై 5వ తేదీన ఐవా ప్రతినిధి బృంధం శాసన మండలి సభ్యులు, ఐవా అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు, ఉపాధ్య క్షులు శ్రీ రంగినేనని శ్రీనివాస్ రావు, ఐవా ఫైనాన్షియల్ కమిటి ఛైర్మెన్, బిజెపి నాయకులు శ్రీ సత్యానారాయణ రావు, శ్రీ చక్రధర్ రావు, ఐవా మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ పొట్లపల్లి రామ్మో హన్ రావుల ప్రతినిధి బృంధం మహా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫద్న వీస్‌ను కలిసి మెమొరాండం సమర్పిం చారు. ఈ మెమొరాండంలో లాభాపేక్ష లేకుండా 'ఐవా' చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పొందుపరిచింది. దాదాపు 7వేల మంది సభ్యులు, 35కు పైగా గల అనుబంధ





సంఘాలతో ఐవా విస్తృత కార్యకలాపాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఎంతో ఓపికతో ఐవా బృందం చెప్పిన వివరాలను ఆలకించిన ముఖ్యమంత్రి చౌల్ట్రీ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపికచేసి కెటాయించే ఏర్పాట్లు చేయవల్సిందిగా అహ్మద్‌నగర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఐవా ప్రతినిధి బృందం సమర్పించిన మెమొరాండంను పరిశీలించిన తర్వాత చౌల్ట్రీ నిర్మాణ ప్రతిపాదనలు (ప్రాజెక్టు వివరాలు) సమర్పించాల్సిందిగా ఐవాను కోరారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసేందుకు ఐవా సన్నద్ధమవుతుంది.

ముఖ్యమంత్రికి సమర్పించిన మెమొరాండంతో ఐవా ప్రగతిపథకాల గురించి సమగ్రంగా వివరించారు. శ్రీశైలంలోని తాండ్రపాపారాయ వెలమ చౌల్ట్రీ ద్వారా భక్తులకు అందుతున్న వసతి, భోజన సౌకర్యాలతో పాటు, ప్రసిద్ధ శైవక్షేత్రం దక్షిణకాశీగా బాసిల్లుతున్న వేములవాడలోని పాలెపు ఆండాళమ్మ రాజేశ్వర్ రావు వెలమ చౌల్ట్రీ, పావన గోదావరి నదీ తీరాన వెలసిన జ్ఞాన సరస్వతీ మాత సన్నిధానంలోని వోని ధర్మయ్య వెలమ చౌల్ట్రీ సేవలను ఇందులో వివరించారు. వీటితోపాటు జెవిఆర్ బాలుర, బాలికల వసతి గృహాల నిర్వహణ, వివిఎన్ఆర్ సీనియర్ సిటీజెన్స్ హోం, టిఆర్ఆర్ కల్చరల్ సెంటర్, జూపల్లి బాలమ్మ కళ్యాణ మండపం, జెవిఎన్ఆర్ కాంప్లెక్స్‌లను లాభాపేక్ష లేకుండా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా ఐవా నిర్వహిస్తుందని ముఖ్యమంత్రికి వివరించారు. ఐవా ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పై సంతృప్తి చెందిన ముఖ్యమంత్రి షిర్డిలాంటి పుణ్య క్షేత్రంలో ఐవా ఆధ్వర్యంలో చౌల్ట్రీ నిర్మాణానికి ముందుకు రావడం పట్ల ఐవా ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ అభినందించారు. అనంతరం ఐవా ప్రతినిధి బృంధం ముఖ్యమంత్రిని వారి చాంబర్‌లో శాలువా కప్పి సన్మానించింది.

అనంతరం మహారాష్ట్ర గవర్నర్ శ్రీ చెన్నమనేని విద్యాసాగర్ రావును కలిసిన ఐవా ప్రతినిధి బృందం ఐవా కార్యకలాపాలను, భవిష్యత్ కార్యాచరణను వారికి వివరించింది. 'ఐవా' చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను శ్రీ విద్యాసాగర్ రావు ప్రశంసించారు. షిర్డిలో వెలమ చౌల్ట్రీ నిర్మాణానికి అవసరమైన స్థల కెటాయింపు కోసం తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. •





## 'షిర్డీ' స్థల కేటాయింపు వ్యవహారాలు పరిశీలనకు...

# కో-ఆర్డినేషన్ కమిటి ఏర్పాటు

పావన గోదావరి నదీతీరాన ఉన్న షిర్డి పుణ్యక్షేత్రంలో 'ఐవా' ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన వెలమ చౌల్ట్రీ కోసం ఎకరా స్థలం కెటాయించేందుకు మహా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిం చడంతో అహ్మద్‌నగర్ జిల్లా కలెక్టర్ చౌల్ట్రీ నిర్మాణ ప్రతిపాదనలు (ప్రాజెక్ట్ డిటైల్స్) ఇవ్వాల్సిందిగా 'ఐవా'కు లేఖ రాయడంతో స్థల సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఐవా నిర్ణయించింది. ఈ మేరకు శాసన మండలి సభ్యులు, 'ఐవా' అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు కో-ఆర్డినేషన్ కమిటిని నియమించారు.

'ఐవా' కోశాధికారి శ్రీ తన్నీరు బాపు రావు నేతృత్వంలోని కార్యనిర్వాహక కార్య దర్శులు శ్రీ మెట్‌పల్లి కిరణ్ కుమార్, శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ ఐలేని నర్సింహా రావు, సభ్యు లుగా శ్రీ బి. చక్రాధర్ రావు, శ్రీ పి. సత్య నారాయణ రావులతో కూడిన కమిటిని నియమించారు.

ఈ కమిటి షిర్డి స్థల కేటాయింపు విష యమై శ్రీ గోవింద్ షిండే (సబ్ డివిజినల్ మెజిస్ట్రేట్)తో చర్చలు జరిపింది. ఈ చర్చల ఫలితంగా శ్రీ గోవింద్ షిండే రహత్ తాహసిల్దార్‌కు 17-9-2019 రోజున షిర్డిలో స్థలాలను గుర్తించి వాటి వివరా లను అందించాల్సిందిగా ఆదేశించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు స్థలాల గుర్తింపు నివేదిక ఆర్డీవోకు అందనుంది. ఈ విష యంలో త్వరితగతిన చర్యలు తీసుకొన్న ఆర్డీవోకు శ్రీ తన్నీరు బాపురావు ధన్యవా దాలు తెలిపారు. మహా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి శ్రీ వి.కే.పాటిల్ గారి ఆదేశాల మేరకు సహాయ కార్యదర్శి శ్రీ గోవింద్‌షిండే వెలమచౌల్ట్రీకి స్థలం కేటాయించే విషయం లోపూర్తిగా సహకారం అందిస్తున్నారని కో-ఆర్డినేషన్ కమిటి పక్షాన శ్రీ తన్నీరు బాపురావు తెలిపారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే స్థలకేటా యింపు కొంత జాప్యం జరగవచ్చన్నారు.

ఇట్టి ప్రాజెక్టు విషయంలో జగిత్యాల జిల్లా మోరెపల్లి గ్రామానికి చెందిన శ్రీ పైడిపల్లి సత్యనారాయణ రావు ప్రత్యేక శ్రద్ధతో మహారాష్ట్ర గవర్నర్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకువెళ్ళి ఈ లెటర్ రావడానికి ఎంతగానో సహకరిం చారు. ఇందులో శ్రీ పైడిపల్లి సత్యనారా యణ పాత్ర అమోఘమైనదని శ్రీ తన్నీరు బాపురావు తెలిపారు.

స్థలకేటాయింపు తర్వాత షిర్డిలో దాతల సహకారంతో చౌల్ట్రీని నిర్మించే పనులు ప్రారంభిస్తామని, ఈ నిర్మాణానికి దాతలను ఐవా స్వాగతిస్తుందన్నారు. •

## వివిఎస్ఆర్ వృద్ధాశ్రమం బౌరంపేటలో...

# వడ్డేపల్లి నర్సింగ రావు జయంతి వేడుకలు



**మానవత్వం పరిమళించిన మంచి మనిషి, వితరణశీలి, సేవాభావమే ఊపిరిగా, నైతిక విలువల పునాదిపై ఎదిగిన ఐవా పూర్వాధ్యక్షులు, ఎన్ఎండిసి మాజీ ఛైర్మెన్, దానగుణం, దయాగుణం మూర్తీభవించిన స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ రావు 68వ జన్మదిన వేడుకలను గండి మైసమ్మ దుండిగల్ మండలం బౌరంపేటలోని వివిఎస్ఆర్ సీనియర్ సిటీజెన్స్ హోంలో జులై 10న ఐవా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐవా ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరి శ్రీకాంత్ రావు 'వడ్డేపల్లి' కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళలర్పించారు.**


గండి మైసమ్మ దుండిగల్ మండలం బౌరంపేట గ్రామంలోని వివిఎస్ఆర్ సీనియర్ సిటీజెన్స్ హోంలో జులై 10న ఐవా పూర్వాధ్యక్షులు, ఎన్ఎండిసి మాజీ ఛైర్మెన్ స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగా రావు జయంతి వేడుకలను ఐవా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐవా ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్‌రావు తొలుత స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిఎస్ఆర్ సీనియర్ సిటీజెన్స్ హోం సబ్‌కమిటీ ఛైర్మెన్ శ్రీ రాంచందర్ రావు ఇతర సభ్యులు, వెలమ బంధువులు, స్వర్గీయ వడ్డేపల్లి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున హాజరై స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ రావు జయంతి వేడుకలలో పాల్గొని నివాళులర్పించారు.

ఐవా ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు మాట్లాడుతూ తన స్వంత డబ్బులతో మూడెకరాల భూమి కొనుగోలు చేసి దాతల సహకారంతో ఆహ్లాదకర వాతావరణంలో ఈఆశ్రమాన్ని నిర్మించి ఎందరో వృద్ధులకు ఆశ్రయం కల్పించిన వారి మనవతావాదానికి శిరస్సువంచి నమస్కరిస్తున్నానన్నారు. వితరణశీలిగా ఐవా అనుబంధ సంఘాలకు ఆర్థిక చేయూత నిచ్చి ఆయా సంఘాల పటిష్టతకు కృషి చేశారన్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలోని బీదబిక్కి జనాలతోపాటు పేద విద్యార్థుల చదువుల కోసం చేయూతనందించిన వడ్డేపల్లి నర్సింగరావు మంచి ఆధ్యాత్మిక చింతనాపరుడని శ్రీ శ్రీకాంత రావు కొనియాడారు. ఎన్నో దేవాలయాల నిర్మాణానికి ఉదారంగా విరాళాలిచ్చిన మహానుభావుడు స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ రావు అని తెలిపారు. నాటి ఏపి వెలమ అసోసియేషన్‌కు మూడుసార్లు అధ్యక్షునిగా ఉన్న నర్సన్న కాలంలో జరిగిన అభివృద్ధి మరువలేనిదన్నారు. ఆయన పదవీకాలాన్ని స్వర్ణయుగంగా భావించటంలో ఏ మాత్రం సందేహం లేదన్నారు.

స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ రావు పేదల అభ్యున్నతి కోసం చేసిన కృషి అనిర్వచనీయమని వివిఎస్ఆర్ సీనియర్ సిటీజెన్స్ హోం ఛైర్మెన్ శ్రీ రాంచందర్ రావు అభివర్ణించారు. ఎందరో వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న ఈ ఆశ్రమాన్ని తన ఆశయాలకనుగుణంగా నిర్మించారన్నారు. వారి సేవానిరతిని, త్యాగశీలతను వెలమ బంధువులంతా కొనియాడుతున్నారన్నారు. రాజకీయ రంగంలో ఎన్నో అవకాశాలు వచ్చినా సున్నితంగా తిరస్కరించిన వ్యక్తి స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ రావు అని పేర్కొన్నారు.

స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ రావుకు పుత్రునిగా జన్మించడం తనకు గర్వకారణమని వారి తనయుడు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వర్ రావు అన్నారు. తండ్రి ఆశయ సాధన కోసం శ్రమిస్తానన్నారు. •





# ఐవా వార్షిక సర్వసభ్య సమావేశం

'ఐవా' తొలి వార్షిక సర్వసభ్య సమావేశం జులై 27న ఐవా ప్రాంగణంలోని చెలికాని అచ్యుత రావు హాలులో ఉదయం 11 గంటలకు నిర్వహించారు. ఐవా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ జిల్లాల నుండి సభ్యులు హాజరయ్యారు.

ఐవా అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరి శ్రీకాంత్‌రావు, కోశాధికారి శ్రీ తన్నీరు బాపురావు వేదికనలంకరించారు. తొలుత శ్రీ భానుప్రసాద్ రావు సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. ఐవా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. గత ఏడాది కాలంలో జరిగిన ప్రగతిని వివరించిన సభాధ్యక్షులు భావి కార్యాచరణ గురించి వివరించారు. ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు వార్షిక సర్వసభ్య సమావేశానికి సంబంధించిన ఎజెండా గురించి మాట్లాడారు. అనంతరం కోశాధికారి శ్రీ తన్నీరు బాపు రావు 2018-19 సంవత్సరానికిగాను సంఘ ఆర్థిక లావాదేవీలను వివరించారు.

అనంతరం సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఐవా అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు వివరణ ఇచ్చారు. సభ్యులు శ్రీ గుడిబండ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు వెలమ వైజయంతి ద్వైమాసిక పత్రికకు ఎడిటర్‌ను నియమించాలని కోరారు. దీనికి సభాధ్యక్షులు స్పందిస్తూ వెలమ వైజయంతికి ఎడిటోరియల్ కమిటీ ఉందని, ప్రత్యేకంగా ఎడిటర్‌ను నియమించేందుకు బైలాలో ఎలాంటి ప్రతిపాదనలు లేవన్నారు. ఒక వేళ అలా చేయాల్సి వస్తే బైలాకు సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. సిబ్బందిని వారి నైపుణ్యతను గుర్తించాకే నియమిస్తున్నామన్నారు. కార్యాలయంలో నూతన సిబ్బందిని నియమించామని తెలిపారు.





ఐవా పూర్వాధ్యక్షులు శ్రీ బెల్లంకొండ నర్సింగ రావు మాట్లాడుతు ఇంకా ఐవా ఆధ్వర్యంలో కళ్యాణ మండపాలను నిర్మించాలని కోరారు. వీరి ప్రతిపాదనను పరిశీలిస్తామని సభాధ్యక్షులు తెలిపారు.

సంఘానికి సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న అభ్యంతరకర వాఖ్యలు, దుష్ప్రచారం గురించి శ్రీశైలం చౌల్ట్రీ సబ్ కమిటి సభ్యులు శ్రీ ఉజ్జిని కిషన్ రావు అడిగిన ప్రశ్నకు సభాధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు స్పందిస్తూ అలాంటి వాఖ్యానాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, నిర్ధిష్టంగా వీటిపై ఫిర్యాదు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సంఘ సీనియర్ సభ్యులు, ఐవా మాజీ ఉపాధ్యక్షులు శ్రీ సంకినేని జగన్‌మోహన్ రావు సంఘ ఆర్థిక లావాదేవీలపై అడిగిన ప్రశ్నకు సభాధ్యక్షులు వివరణ ఇచ్చారు. సంఘ పూర్వాధ్యక్షులు సహా మరికొంత మంది సభ్యులు చార్టెడ్ అకౌటెంట్ల నియామకం, ఆర్థిక లావాదేవీలపై అడిగిన వివిధ ప్రశ్నలకు సభాధ్యక్షులు, కోశాధికారి వివరణ ఇచ్చారు.

ఈ సమావేశంలో శ్రీ సిహెచ్ కమలాకర్ రావు, శ్రీ జువ్వాడి సత్యనారాయణ రావు, శ్రీ మురళీధర్ రావు, శ్రీమతి స్వరూపరాణిలు అడిగిన ప్రశ్నలకు సభాధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు చక్కటి వివరణ ఇచ్చారు.

అనంతరం 95 ఏళ్ళ వయోవృద్ధుడు, సంఘ సీనియర్ సభ్యుడు శాశ్వత సభ్యత్వ సంఖ్య 72 శ్రీ వెంకట నారాయణను సభాధ్యక్షులు శ్రీ తానిపర్తి భాను ప్రసాద్ రావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా శ్రీ వెంకట నారాయణ మాట్లాడుతు ఈ రోజు మీ అందరినీ కలవడం ఆనందంగా ఉందన్నారు. సంఘ పురోభివృద్ధి పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

సమావేశానంతరం హాజరైన సభ్యులందరికీ విందు ఇచ్చారు. •


## టిఆర్ఆర్ కల్చరల్ సెంటర్ భవన సముదాయం లీజుకు ఆహ్వానం



అఖిల భారత వెలమ సంఘం ఆధ్వర్యంలోని హకీంపేటలో గల టిఆర్ఆర్ కల్చరల్ సెంటర్ 20,000 స్కేర్ ఫీట్స్‌తో బాంకేట్ హాల్స్, రూమ్స్ మరియు మల్టీపర్పస్ హాల్‌తో కూడిన భవన సముదాయాన్ని ఆసక్తి కలిగిన ఔత్సాహికుల నుండి లీజు/అద్దె కై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. కావున వ్యాపారవేత్తలు ముందుకు రావాలని ఐవా కోరుతుంది.

- పూస్కూరు శ్రీకాంత్ రావు
ప్రధాన కార్యదర్శి, ఐవా

**అఖిల భారత వెలమ సంఘం**

3-6-432, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029; ఫోన్ : 040-27637694




## అఖిల భారత వెలమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ...

# పద్మనాయక వెలమ వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన

'ఐవా' ప్రాంగణంలోని చెలికాని అచ్యుతరావు హాలులో ఆగష్టు 11న ఐవా ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మనాయక వెలమ వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఐవా అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు, ఉపాధ్యక్షులు శ్రీమతి జువ్వాడి ఇందిరా రావు, ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరి శ్రీకాంత్ రావు, కోశాధికారి శ్రీ తన్నీరు బాపురావు, వివాహ విభాగం ఛైర్మెన్ శ్రీ తిరుపతి పోతన్ రావు, కార్యవర్గ సభ్యులు, వివాహ విభాగం కన్వీనర్ శ్రీమతి కోట్ల వీణ వేదికనలంకరించారు.

ఈ సందర్భంగా ఐవా అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు మాట్లాడుతు ఐవా ఆధ్వర్యంలోని పద్మనాయక వెలమ వివాహ వేదికను నిర్విరామంగా సేవాభావంతో నిర్వహిస్తున్న ఛైర్మెన్ శ్రీ తిరుపతి పోతన్ రావు సబ్ కమిటీ సభ్యుల కృషిని కొనియాడారు. ఈ వేదికకు వెలమ బంధువుల నుండి వచ్చిన స్పందన లభించడానికి ప్రధాన కారణం విశ్వసనీయతే ప్రధాన కారణమన్నారు. వధూవరుల ప్రొఫైల్స్‌ను గోప్యంగా ఉంచడంతోపాటు వారి వివరాలను పుస్తకరూపంలో తీసుకువస్తు సభ్యులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మంచి సంబంధాలు వెతుక్కొనేందుకు నేడు అన్ని వర్గాల వారు వివాహ పరిచయ వేదికలనే ఆశ్రయిస్తున్నదన్నారు.

ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు మాట్లాడుతు మంచి








సంబంధాలను వెతికి పెట్టే గురుతర బాధ్య తను వివాహ పరిచయ వేదిక ఛైర్మెన్ శ్రీ టి.పోతన్‌రావు నెత్తిన ఎత్తుకొని సేవా భావంతో కృషి చేయడం అభినందనీయ మన్నారు. ఈ వేదిక సబ్ కమిటీ కృషి కూడా ప్రశంసనీయమన్నారు. ఈ వేదికలో వధూవరుల ప్రొఫైల్ వివరాలను ప్రొజె క్టర్ సహాయంతో తెరపైడిస్‌ప్లే చేశారన్నారు. 11నాటి వివాహ పరిచయ వేదిక ద్వారా 72 మంది సభ్యులుగా నమోదు చేసుకొ న్నారన్నారు. ఈ వివాహ పరిచయ వేదిక కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు, ఐవా అధ్యక్షులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు, ఉపాధ్యక్షులు శ్రీమతి జువ్వాడి ఇందిరారావు,ప్రధానకార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు, కోశాధికారి శ్రీ తన్నీరు బాపురావు, కార్యనిర్వాహక కార్యదర్శి, వివాహ విభాగం కో-ఆర్డినేటర్ శ్రీమతి పుల్లూరు పద్మ,కార్యవర్గసభ్యులు శ్రీ జువ్వాడి అశోక్ రావు, శ్రీ మణికొండ కేశవరావు, శ్రీ పుల్లయ్యగారి జలపతి రావు, వివాహ విభాగం ఛైర్మెన్ శ్రీ తిరుపతి పోతన్ రావు, వైస్ ఛైర్మెన్ శ్రీ జె. సత్యనారాయణ రావు, కన్వీనర్ శ్రీమతి కోట్ల వీణ, సభ్యులు శ్రీ పల్లెపాటి శాంతపు రావు, శ్రీ బోయినిపల్లి జగపతిరావు, శ్రీమతి కె.రమాదేవి, శ్రీమతి రావు హరిప్రియ, శ్రీమతి ఎం. ప్రేమలత, శ్రీమతి దేశినేనిఅరుణ,శ్రీ యాదగిరి ప్రతాప్ రావులతోపాటు సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చిన వధూవరులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

పద్మనాయక వెలమ వివాహ పరి చయ వేదిక ద్వారా మంచి సంబంధాలు కుదుర్చుకొన్న వారందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆహుతులంద రికీ భోజన సదుపాయం కల్పించారు.●


AIVA వారు నిర్మించిన

పాలెపు ఆండాళమ్మ - రాజేశ్వర్ రావు

వెలమ చౌల్ట్రీ, వేములవాడలో



A/C మరియు NON A/C రూముల వసతి సౌకర్యం అందుబాటులో ఉంది.



సంప్రదించాల్సిన నెం: 9949464262, 9948638373, 9989121234

అఖిల భారత వెలమ సంఘం

హిమాయత్‌నగర్, హైదరాబాద్, ఫోన్ నెం : 040-27637694



## అంగరంగ వైభవంగా...
# అఖిల భారత వెలమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఐవా ఆధ్వర్యంలో ఆగష్టు 15న 73వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జెవిఆర్ బాలుర వసతి గృహంలో 'ఐవా' అధ్యక్షులు,శాసన మండలి సభ్యులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావు ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

మన పూర్వీకుల త్యాగఫలితంగా సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని ఈనాడు మనం సంపూర్ణంగా అనుభవిస్తున్నామన్నారు. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరడం ఆనందకర విషయమన్నారు. యువత ఈ దేశానికి భవితని అన్ని రంగాలలో అందివచ్చే అన్ని అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జెవిర్ బాలుర వసతి గృహ సబ్ కమిటి ఛైర్మెన్ శ్రీ దేశినేని వెంకటేశ్వర్ రావు మాట్లాడుతు దేశ పురోభివృద్ధిలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు.దేశంలో అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటు ముందడుగు వేయాలని హితవు చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఐవా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు శ్రీ తానిపర్తి భానుప్రసాద్ రావుతో పాటు ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు, ఐవా ఉపాధ్యక్షులు శ్రీమతి జువ్వాడి ఇందిరా రావు, మాజీ ఉపాధ్యక్షులు శ్రీ సంకినేని జగన్మోహన్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి, జెవిఆర్ సబ్ కమిటి కో అర్డినేటర్ శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు, జెవిఆర్ సబ్ కమిటీ కన్వీనర్ శ్రీ సురభి చలపతి రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ జువ్వాడి అశోక్ కుమార్, శ్రీ ఐలేని నర్సింహా రావు, శ్రీ చెన్నమనేని రామ్మోహన్ రావు, శ్రీమతి కోట్ల వీణ, శ్రీమతి పొనుగోటి జ్యోతిలతో





పాటు పెద్దసంఖ్యలో జెవిఆర్ బాలుర వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతరం విద్యానగర్‌లోని జెబి బాలికల వసతి గృహంలో ఉదయం 9:30 నిమిషాలకు ఐవా ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు జాతీయ పతాకావిష్కరణ చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జెబి బాలికల వసతి గృహ సబ్ కమిటి ఛైర్ పర్సన్ శ్రీమతి తాళ్ళపల్లి విజయలక్ష్మి, కన్వీనర్ శ్రీమతి పుల్లూరి పద్మ, శ్రీమతి జగ్గన్న గారి పద్మ, శ్రీమతి స్వాతి, శ్రీమతి శ్రీలతలతోపాటు ఐవా ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ జువ్వాడి అశోక్ కుమార్, శ్రీ ఐలేని నర్సింహా రావు, శ్రీ సురభి చలపతిరావులు హాజరయ్యారు.

విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకలలో శ్రీ గుడిబండ ప్రవీణ్ రావుతో పాటు వసతి గృహాల వార్డెన్‌లు శ్రీ పొన్నమనేని జగన్మోహన్ రావు, శ్రీమతి డి.లక్ష్మిలు పాల్గొన్నారు. •

# దారితప్పని ధీర వనిత సౌమ్యశ్రీ



ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడి ఉండాలని కోరుకుంటారు. అదే ప్రభుత్వ ఉద్యోగులైతే పెద్ద ఉద్యోగాలు కాకపోయినా కనీసం తమలాంటి ఓ ఉద్యోగమైనా దక్కించుకుంటే బాగుండునని ఆశపడటం సహజం. చదివింది పెద్ద చదువైనా ప్రయివేట్ ఉద్యోగ అవకాశం ఉన్నా తండ్రి బాటలోనే నడిచి చూపెట్టాలని అందుకు అదే శాఖలో ఒక మంచి స్థానాన్ని సంపాదించి తండ్రి గౌరవాన్ని పెంచే ఆశయంతో కృషిచేసి అనుకున్నది సాధించగలిగింది సౌమ్యశ్రీ.

నాగర్ కర్నూల్ జిల్లా తిప్పారెడ్డిపల్లె వాస్తవ్యులైన శ్రీమతి&శ్రీ కోట్ల లక్ష్మి జగదీశ్వర్ రావులకు ఇరువురు సంతానం. అమ్మాయి బి.టెక్ చేసి ఉండగా, అబ్బాయి ఫార్మసీ ఫైనల్‌లో ఉన్నాడు. హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో ఉంటున్న జగదీశ్వర్ రావు అంబర్‌పేట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారి కుమార్తెనే 24 ఏళ్ల సౌమ్యశ్రీ. బి.టెక్ తర్వాత పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్సై కావాలన్న లక్ష్యంతో తన పట్టు సడలకుండా కృషి చేసింది. అయితే ఒకసారి సఫలం కాకపోయినా నిరుత్సాహపడకుండా మరోసారి ప్రయత్నించింది. ఆ మధ్యలో పంచాయితీ కార్యదర్శి పరీక్ష వ్రాసి అందులో ఎంపిక చేయబడి యాచారం మండలంలోని మొండి గౌరెల్లిలో ప్రథమ ఉద్యోగంలో చేరింది. ఆ తర్వాత వచ్చిన విఆర్‌ఓ పరీక్ష వ్రాసి అందులో కూడా సెలక్ట్ కావడంతో మహేశ్వరం మండలం దుబ్బచెర్ల గ్రామం విఆర్‌ఓగా రెండవ ఉద్యోగ బాధ్యతలు చేపట్టింది. అయినా తృప్తి చెందని సౌమ్యశ్రీ ఎస్సై కావాలన్న ధ్యేయంతోనే ఉన్నందున ఇటీవల వెలువడిన ఫలితాల ద్వారా ఎస్సై పదవిని కూడా ఆమె దక్కించుకొని తన కలను సాకారం చేసుకుంది. ఎలాంటి రిజర్వేషన్ లేకున్నా ఓపెన్ క్యాటగిరీలో నున్న పోటీని తట్టుకొని విజేతగా రాణిస్తున్నది ఈ ధీరవనిత.

పోలీస్‌శాఖ అంటేనే అందరి దృష్టిలో అదో రఫ్ & టఫ్ డిపార్ట్‌మెంట్ అన్న భావన ఉంది. ఎందుకంటే ఎప్పుడు చూసినా గొడవలు, టెన్షన్స్ ఎదురవుతుంటాయి. అందుకే అమ్మాయిలు అందులో ఉద్యోగం కొరకు అంతగా ఆసక్తి కనబర్చరు. అయినా సౌమ్యశ్రీ కొంతకాలమైనా అందులో చేసి తన ప్రతిభను నిరూపించుకోవాలనుకుంటున్నది.

లక్ష్యసాధనలో గట్టి దృఢ సంకల్పము, పట్టుదలతో ఉన్న సౌమ్యశ్రీ మరో ఉన్నత పదవిని కూడా సాధించవచ్చని విశ్వసించవచ్చు. •

# సివిల్ సర్వీసెస్ పరీక్షల ప్రిపరేషన్ పై ప్రత్యేక కార్యక్రమం




సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు మార్గదర్శకత్వం ఇచ్చి మంచి విజయాలు సాధించేలా చేయూత నివ్వాలనే లక్ష్యంతో ప్రాజక్ట్ హ్యాపీ లైఫ్ లో భాగంగా జులై 4న జెవిఆర్ బాలుర వసతి గృహ సబ్ కమిటీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల ప్రిపరేషన్ పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో జెవిఆర్ బాలుర వసతి గృహ సబ్ కమిటీ ఛైర్మెన్ డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు, కన్వీనర్ శ్రీ సురభి చలపతి రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ జువ్వాడి అశోక్ రావు, అసిస్టెంట్ కమిషనర్, కమర్షియల్ టాక్సెస్ శ్రీ కె. విజయకుమార్, సివిల్స్‌లో మొదటి ప్రయత్నంలోనే 573 ర్యాంక్ సాధించిన డాక్టర్ కె. కిరణ్మయి పాల్గొన్నారు.

విద్యార్థులు సివిల్ సర్వీసెస్ పరీక్షలలో మంచి విజయాలు సాధించాలంటే అందుకు తగిన లక్షణాలను మొదటి నుంచే పెంపొందించుకోవాలని అందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, విజేతలతో మాట్లాడటం, చర్చించటం వలన మంచి జ్ఞానాన్ని పొందవచ్చని బాలుర వసతి గృహ సబ్ కమిటీ ఛైర్మెన్ డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు అన్నారు.

సివిల్స్ పరీక్షలలో విజయం సాధించటం వలన సమాజానికి ఎక్కువగా సేవ చేయవచ్చనే ఆశయంతో తాను వైద్య వృత్తిని వదిలి ఈ రంగంలోకి అడుగు పెట్టానని డా॥ కె. కిరణ్మయి అన్నారు. సివిల్స్ ప్రిపరేషన్ గురించి విద్యార్థులకు పలు విషయాలపై ఆమె అవగాహన కల్పించారు. విద్యార్థులు తమను తాము అనునిత్యం మెరుగుపరచుకోవాలని, సివిల్స్ విజేతలు మరియు నిపుణులు చెప్పిన విషయాలను నిరంతరం మననం చేసుకోవాలని, ప్రతి రోజు ప్రణాళిక బద్ధంగా చదవటం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి జీవితంలో ఓ 2,3 ఏళ్ళు శిక్షణతో కష్టపడి చదువుకుంటే జీవితంలో 50 ఏళ్ళు సంతోషంగా, ఆనందంగా ఉండవచ్చని అన్నారు. విద్యార్థి జీవితంలో సమయం ఎంతో విలువైనదని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలలో విజయం సాధించాలనే బలమైన కోరిక, సరైన ప్రణాళిక, సరైన మార్గదర్శకత్వం, కష్టపడి చదవటం, ఓటమిని అంగీకరించకపోవటం, ఎన్ని ఆటంకాలు ఎదురైనా దృఢంగా ఎదుర్కోవటం అనే ఆయుధాలు అవసరమని అన్నారు.

సివిల్స్ పరీక్షలలో విజయం సాధించటం వలన సమాజానికి ఎక్కువగా సేవ చేయవచ్చనే ఆశయంతో తాను ఇంజనీరింగ్ వృత్తిని వదిలి ఈ రంగంలోకి అడుగుపెట్టానని శ్రీ కె. విజయకుమార్ అన్నారు. విద్యార్థులు డిగ్రీ చదివేటప్పుడే సివిల్స్ పరీక్షలలో విజయం సాధించటం లక్ష్యంగా పెట్టుకొని ప్రిపేరయితే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించిన ముత్యాల రాజు వంటి వారిని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదవాలని సూచించారు.






ఈ సందర్భంగా శ్రీ సురభి చలపతి రావు మాట్లాడుతూ తాము విద్యార్థులుగా ఉన్నప్పుడు సరైన మార్గదర్శకత్వం ఇచ్చేవారుగాని, ఇలాంటి అవకాశాలు గాని అంతగా లేవని ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, హాస్టల్‌లో క్రమశిక్షణతో మెలగాలని, కష్టపడి చదివి సివిల్ సర్వీసెస్ పరీక్షలలో మంచి విజయాలు సాధించి అటు తల్లిదండ్రులకు ఇటు వెలమ సామాజిక వర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అందుకు ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ తరపున సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెవిఆర్ బాలుర వసతి గృహ విద్యార్థులతో పాటు జూపల్లి బాలమ్మ బాలికల వసతి గృహ విద్యార్థినులు కూడా పాల్గొన్నారు.

చివరగా శ్రీ కె. విజయకుమార్, డా॥ కె. కిరణ్మయిలను జెవిఆర్ బాలుర వసతి గృహ సబ్ కమిటీ ఛైర్మెన్ డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు, కన్వీనర్ శ్రీ సురభి చలపతి రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ జువ్వాడి అశోక్‌రావు, వార్డెన్ శ్రీ పొన్నమనేని జగన్‌మోహన్ రావు మరియు విద్యార్థులు శాలువా మెమొంటోతో సత్కరించారు. •

## జాతీయ స్థాయిలో సత్తా చాటిన ...

# బాస్కెట్ బాల్ ప్లేయర్ గోన ప్రతీక్



**9**వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలుడు అండర్ 16 'బాస్కెట్ బాల్' టోర్నీలో అద్భుతంగా ఆడి అందరిని అబ్బుర పరిచాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి 12వ మెంబర్‌గా ఎంపిక చేయబడి తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన టోర్నీలో 30వ మెంబర్‌గా కనిపించి బెంగళూరులో జాతీయ క్యాంప్‌లో శిక్షణ పొంది తాను ఎక్కడైనా ఆడగలనన్న నమ్మకాన్ని కలిగించాడు. అంతే కాకుండా ఇటీవల నోయిడాలో (ఢిల్లీ దగ్గర) జరిగిన జాతీయస్థాయి బాస్కెట్ బాల్ సెలక్షన్స్‌లో తన ప్రతిభను కనబర్చి జాతీయ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

నల్గొండ జిల్లా బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీ గోన విష్ణువర్ధన్ రావు, శ్రీమతి ప్రవీణల ఏకైక పుత్రుడైన చిరంజీవి ప్రతీక్ చిన్న నాటి నుండి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చడం పై తండ్రి (ఇటీవల రిటైర్ అయిన జాయింట్ రిజిస్ట్రార్ శ్రీ విష్ణువర్ధన్ రావు) తన తనయుడికి ఇష్టమైన క్రీడ బాస్కెట్ బాల్ అని గుర్తించి దానికి సరియగు కోచింగ్ ఇప్పించి ప్రోత్సహించడంతో ఈ స్థాయికి చేరుకోగలిగాడు. అయితే 6'.6" ఫీట్ల ఎత్తు ఉన్న ఈ చిరంజీవిని చూసిన వారెవరూ అతని వయసుని, ప్రస్తుత చదువును అంచనా వేయలేనంతగా ఎదగగలిగి అందరిని ఆకర్షింపబడుతున్నాడు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో ఈ ఆటల్లో పాల్గొని భారతదేశ ఔన్నత్యాన్ని తన ఆటతో సంపాదించి మన దేశానికి, మన జాతికి గర్వకారణంగా నిలువగలదని ఆశిద్దాం.! •

## జూపల్లి బాలమ్మ బాలికల వసతి గృహ విద్యార్థులకు ...

# మహిళా సాధికారత, మనోవిజ్ఞాన శాస్త్రం




విద్యార్థులకు మానసిక సంబంధమైన అంశాలపై మార్గదర్శకత్వం ఇచ్చి జీవితంలో మంచి విజయాలు సాధించేలా చేయూత నివ్వాలనే లక్ష్యంతో ప్రాజెక్ట్ హ్యాపీ లైఫ్‌లో భాగంగా ఆగష్టు 25న జుపల్లి బాలమ్మ వసతి గృహ సబ్‌కమిటీ ఆధ్వర్యంలో వసతి గృహ విద్యార్థినులకు మహిళా సాధికారత మరియు మనో విజ్ఞానశాస్త్ర సూత్రాలు అనే అంశం పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ప్రముఖ మనో విజ్ఞాన శాస్త్రవేత్త డా॥ శ్రీమతి సుమన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెబి బాలికల వసతి గృహ సబ్ కమిటీ ఛైర్‌పర్సన్ శ్రీమతి తాళ్లపల్లి విజయలక్ష్మి, మెంబర్ శ్రీమతి తూముల స్వాతి, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు, జెవిఆర్ వసతి గృహ సబ్ కమిటీ ఛైర్మెన్ డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు, బాలికల వసతిగృహ వార్డెన్ శ్రీమతి లక్ష్మితోపాటు పెద్ద సంఖ్యలో వసతి గృహ విద్యార్థినులు పాల్గొన్నారు.

మనో విజ్ఞాన శాస్త్రవేత్త డా॥ సుమన విద్యార్థులకు పలు మనో విజ్ఞాన శాస్త్ర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారతలో మనో విజ్ఞాన శాస్త్ర సూత్రాలు ఎంతో ముఖ్యమైనవని, వాటిపై విద్యార్థి దశలోనే మంచి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రత్యేకించి తమను తాము బాగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని ఏఏ సందర్భాలలో తాము ఎలా ఫీల్ అవుతామనేది గుర్తించాలని, తమ తమ ఎమోషన్స్‌ను సరిగ్గా అంచనా వేసుకోవాలని, అలాగే ఇతరుల ఎమోషన్స్‌ను సరైన కోణంలో అర్థం చేసుకోవాలని సూచించారు. తమ ఎమోషన్స్‌ను సరిగ్గా గుర్తించటం, ఇతరులకు ఇబ్బంది కలగకుండా వాటిని వ్యక్తీకరించటం అనేది ఒక కళ అని, సాధన ద్వారా దానిని ఎవరైనా సాధించవచ్చని అన్నారు. ఎమోషనల్ మేనేజ్‌మెంట్ సరిగ్గా చేసుకోలేని వ్యక్తుల్లో రకరకాల మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. సంతోషం,బాధ, దుఃఖం ఇలా ఏ ఎమోషన్స్ ఏర్పడిన, వాటిని ఇతరులతో పంచుకోవాలని సూచించారు. ఆనందం, సంతోషం వంటి పాజిటివ్ ఎమోషన్స్‌ను ఇతరులతో పంచుకోవటం వల్ల అవి మరింతగా పెరుగుతాయని, బాధ, దుఃఖం వంటి నెగెటివ్ ఎమోషన్స్‌ను ఇతరులతో పంచుకోవటం వల్ల వాటి తీవ్రత తగ్గి మానసికంగా ఉపశమనం చేకూరుతుందని, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్స్‌ను పరిమితంగా, అవసరానికి తగినంతగా మాత్రమే వాడాలని, మానవ సంబంధాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలని అన్నారు.

ఈ సందర్భంగా బాలికల వసతి గృహ ఛైర్‌పర్సన్ శ్రీమతి తాళ్ళపల్లి విజయ లక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో



త్యాగాలు చేసి తమ పిల్లలకు మంచి చదువులు చదివించాలని ప్రయత్నిస్తున్నా రని, దానిని మనసులో పెట్టుకొని, క్రమశిక్షణతో బాగా చదివి మంచి విజయాలు సాధించాలని అన్నారు. హాస్టల్‌లో రకరకాల కోర్సులు చదివే విద్యార్థులు ఉన్నారని, వీలైనప్పుడల్లా కలిసి మాట్లాడుకోవాలని, సబ్జెక్టు సంబంధమైన అంశాలపై చర్చించుకోవాలని సూచించారు.

ఐవా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు ఆయా సబ్జెక్టు సంబంధమైన విషయాలపై గ్రూప్ డిస్కషన్స్ ఏర్పాటు చేసుకోవాలని దాంతో నైపుణ్యం పెరుగుతుందని అన్నారు. ఐవా అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విజయాలు సాధించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు.

విద్యార్థులు జీవితంలో విజయాలు సాధించడానికి పునాదిని విద్యార్థి దశలోనే వేసుకోవాలని అందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని జెవిఆర్ బాలుర వసతి గృహ సబ్ కమిటీ ఛైర్మెన్ డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు అన్నారు.

ఈ సందర్భంగా బాలికల వసతి గృహ సబ్ కమిటీ ఛైర్‌పర్సన్ శ్రీమతి తాళ్ళపల్లి విజయలక్ష్మి, మెంబర్ శ్రీమతి తూముల స్వాతి విద్యార్థినులచే పర్సనాలిటీ డెవలప్‌మెంట్ మరియు పరిశుభ్రత ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేయించారు. భారత ప్రభుత్వం స్వచ్ భారత్ పేరిట పరిశుభ్రతపై దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రత గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ ప్రతి ఒక్కరు తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే దేశం పరిశుభ్రంగా ఉంటుందని అన్నారు. జెబి బాలికల వసతి గృహంలో స్వచ్ భారత్ స్ఫూర్తి కనిపించేలా హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

చివరగా డా॥ సుమనను శ్రీమతి తాళ్ళపల్లి విజయలక్ష్మి, శ్రీమతి తూముల స్వాతి, శ్రీ నీలగిరి వెంకటేశ్వర్ రావు, డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు మరియు విద్యార్థినులు శాలువా, మెమొంటోతో సత్కరించారు. •

# నార్త్ కరోలినాలో 'వానా' ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు




అమెరికాలోని నార్త్‌కరోలినాలో ప్రవాస వెలమ బంధువులు ఆనందోత్సాహాల మధ్య ఉగాది వేడుకలను జరుపుకొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకనుగుణంగా పంచాంగ శ్రవణం, ఉగాది పూజ, పచ్చడి పంపిణీలాంటి కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న పిల్లల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కూచిపూడి, భరతనాట్యం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల నిర్వహణలో శ్రీ రాజాచంద్ర రంగినేని, శ్రీమతి వెంకన్నగారి భారతిరావులు ముఖ్య భూమిక పోషించారు. ఈ వేడుకలలో దాదాపు 270 మంది వెలమ బంధువులు పాల్గొన్నారు. శ్రీ రాకేష్ తాటిపర్తి స్వాగతోపన్యాసం చేశారు. ఈ వేడుకలలో వేములవాడ శాసన సభ్యులు శ్రీ చెన్నమనేని రమేష్‌బాబు పాల్గొన్నారు. శ్రీ వేనేపల్లి భాస్కర్ రావు వెలమ జాతి చరిత్ర, విశిష్టతలను వివరించారు. వెలమ జాతి సంస్కృతి, మూలాలను భావి తరాలకు చాటి చెప్పారు. వానా కో ఆర్డినేషన్ కమిటిలో శ్రీ వెంకట్‌రావు తాండ్ర, శ్రీ రామడుగు వెంకటేశ్వర్ రావు, శ్రీ సంకినేని వేణుగోపాల్ రావు, శ్రీమతి వాల కమల, శ్రీ దన్నపునేని రవీందర్ రావులు 'వానా' చేపట్టిన, చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి చర్చించారు. •

# ఐవా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు.. దాతల దాతృత్వం



'ఐవా' ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో దాతల పాత్ర చాలా కీలకం. ఏ కార్యక్రమం చేపట్టాలన్న ఔధార్యం కల్గిన దాతల దాతృత్వం ఎంతైనా అవసరం. 'ఐవా' అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా శ్రీశైలం వెలమ చౌల్ట్రీలోని రాణి మల్లమ్మ బ్లాక్ 2 గది నెం. 304నకు పదవీవిరమణ చేసిన ఆర్డీఓ శ్రీ జి. రంగారావు, శ్రీమతి జి. పద్మావతి దంపతులు ఐవా కోశాధికారి శ్రీ తన్నీరు బాపురావు ద్వారా 5లక్షల రూపాయల విరాళము ఇచ్చారు. విద్యాదాన నిధి అడాప్ట్ ది స్టూడెంట్ కార్యక్రమాలకు కూడా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. విద్యాదాన నిధికి ప్రముఖ సివిల్ న్యాయవాది శ్రీ పి. నారాయణ రావు 50 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు.

అడాప్ట్ ది స్టూడెంట్ పథకంలో భాగంగా 'వానా'కు చెందిన శ్రీ తాండ్ర వెంకట్, శ్రీ పర్వతనేని నర్సింగ రావు, శ్రీ మెన్నేని రామారావులు బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమారి కోటగిరి రోషణికి ఆర్థిక చేయూతనందించారు.

దాతల సహకారం మరువలేనిది, మరుపు రానిదని, గతంలో ఐవాకు సహకరించిన దాతలు, సహకరించాలనుకొనే దాతలందరికీ ఐవా ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు, కోశాధికారి శ్రీ తన్నీరు బాపురావులు మరియు కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు. •

# మహిళామణులకు ఆదర్శం .. శ్రీమతి చెప్యాల సుజాత



ఫోన్ నెం: 9290556939

శ్రీమతి చెప్యాల సుజాత 68 ఏళ్ళ వయస్సులో కూడా చాలా చురుకుదనంగా ఉంటూ పూజా గదులలో ఉండే చిన్న దేవతా విగ్రహాలకు వస్త్రాలు కుట్టడం లాంటి కళాత్మక పనులను చేస్తున్నారు. స్వతహాగా ఆధ్యాత్మిక చింతనాపరులైన వీరు ఇంట్లో పూజగదిలో ఉండే చిన్న చిన్న దేవుడి ప్రతిమలకు వస్త్రాలు కుట్టడం అలవాటు చేసుకున్నారు. ఈ అలవాటును ఓ అభిరుచిగా మార్చుకొని తెలిసినవాళ్ళకి కుట్టి ఇవ్వడం ప్రారంభించారు. ఇలా ఐదు సంవత్సరాల నుండి చేస్తున్నారు. తన ఖర్చులను తనే సంపాదించుకుంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పటి వరకు 5 వేలకు పైగా దేవుడి వస్త్రాలు కుట్టి భగవంతుని సేవలో తరిస్తున్నారు. ఈ వయసులో కూడా ఇప్పటికీ సిటీ బస్సులో వెళ్ళి అవసరమున్న వారికి వస్త్రాలు సమకూరుస్తున్నారు.

వీరి స్వగ్రామం మంచిర్యాల జిల్లా జైనూర్ మండలంలోని నర్సింగపూర్. వీరి భర్త స్వర్గీయ ప్రకాశ్ రావు. వీరికి ఒక కుమారుడు శ్రీ రామేశ్వర్ రావు మైహోం ఇండస్ట్రీస్‌లో పని చేస్తున్నారు., కోడలు వనజ స్వంతంగా శారీ రోలింగ్ వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుతం వీరి కుటుంబం అల్వాల్‌లో స్థిరపడ్డారు. వీరు పది మంది అన్నదమ్ముల్లు, ముగ్గురు చెల్లెండ్లు. శ్రీమతి చెప్యాల సుజాతగారి తల్లి పెద్దపెల్లి జిల్లాలోని ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామ వాస్తవ్యురాలైన శ్రీమతి అనసూయ (94) ఇంకా చురుకుగా తన పనులు తాను చేసుకుంటున్నారు. శ్రీమతి సుజాతగారి అత్తమామలు స్వర్గీయ చెప్యాల వెంకటమ్మ రంగారావులు. •

# స్మృతిపథంలో...



# స్వర్గీయ కాసుగంటి శ్రీనివాస్ రావు

నిజామాబాద్ జిల్లా, నందిపేట మండలం, బాద్గుణ గ్రామానికి చెందిన స్వర్గీయ కాసుగంటి శ్రీనివాస్ రావు గారు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మొదటిసారి 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి నియోజకవర్గం నుండి పోటీచేసి శాసన సభ్యులుగా గెలిచి అక్కడి ప్రజల మన్ననలనందుకున్నారు.



స్వర్గీయ కాసుగంటి విజయ రామారావు

వారి కుమారుడు స్వర్గీయ కాసుగంటి విజయ రామారావు గారు ఆర్మూర్ సమితి ఉపాధ్యక్షులుగా సేవలందించారు. వీరు రాజకీయంగా మంచి పలుకుబడి ఉన్న నాయకుడుగా ఎదిగారు. వీరికి పలువురు నేతలతో మంచి సంబంధాలున్నాయి.


రెండు తరాల రాజకీయ వారసత్వాన్ని అందుకున్న శ్రీ కాసుగంటి కళ్యాణ్ రావు న్యాయవిద్య పట్టా చేపట్టి ప్రస్తుతం న్యూజిలాండ్ తెలంగాణ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు.



కాసుగంటి కళ్యాణ్ రావు LLB

**Founder President**

**Newzealand Telangana Association**




# Request for Donors / Sponsors

మా సంస్థ **శ్రీ భగవాన్ పబ్లికేషన్స్** చాలా మంచి పుస్తకాలను ప్రచురించడము జరిగినది. 2016 సంవత్సరములో ఇంగ్లీష్ భాషలో టైటిల్ **"హిస్టరీ ఆఫ్ వెలమ కింగ్‌డమ్స్ – రాచకొండ, దేవరకొండ"** అనే పుస్తకాన్ని ప్రచురించడం జరిగినది. దాని **రచయిత డా॥ టి. దయాకర్ రావు** గారు ప్రొఫెసర్, హిస్టరీ డిపార్ట్‌మెంట్, కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్. ఈ పుస్తకము వారి డాక్టరేట్ థీసెస్‌కి సంబంధించినది. దీనికి మేము దేవరకొండ, రాచకొండకు సంబంధించిన ఒరిజినల్ చిత్రాలను కలిపి చాలా కాస్ట్లీగా మల్టీ కలర్‌లో ప్రచురించాము. ఈ పుస్తకానికి చాలా బాగా పబ్లిసిటి వచ్చింది. ఎందుచేతనంటే ఇది చాలా ప్రామాణిక, వాస్తవాలకి సంబంధించిన గ్రంథము. తెలంగాణ ప్రభుత్వం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ వారు 1000 పుస్తకాలు (10 లక్షల రూపాయల విలువైనవి) కొనటం జరిగినది. ఈ పుస్తకాన్ని పాఠకులకు చాలా ఆదరించారు. వారి కోరిక ప్రకారం దీనిని తెలుగులోకి అనువదించి టైటిల్ **"వెలమ రాజ్యాల చరిత్ర, రాచకొండ, దేవరకొండ"**గా ప్రచురించడానికి ప్రయత్నిస్తున్నాము. ప్రచురించే పుస్తకాల సంఖ్య 5000. ప్రచురణకు అయ్యే **ఖర్చు రూ. 8 లక్షలు.** ఈ పుస్తకాన్ని చాలా తక్కువ ధరకే అందించాలనే ఆశయముతో ప్రచురణకు అయ్యే ఖర్చులో కొంత భాగము కోసము **డోనర్స్‌ని, స్పాన్సర్స్‌ని విరాళాలు అందించవలసిందిగా రిక్వెస్ట్ చేస్తున్నాము.** వారి పేర్లు, వివరాలు ఈ పుస్తకములో పేర్కొంటాము. వివరాలకు ఈ క్రింది అడ్రస్‌కి సంప్రదించవచ్చు.

---

**Contact Address: N.S. BHAGAVANULU**

**SREE BHAGAVAN PUBLICATIONS**

7-1-29/23, Flat No. 102, Sai Siri Sampada Apartments,
Leela Nagar, Ameerpet, Hyderabad - 500 016, T.S. India.
Phone: **9502312277, 040-23736525** ; E_mail : sreebhagavanpublications@gmail.com

# ఇదీ జీవితమంటే.. సరిత సజీవం



జీవితం అంటే మనం చచ్చే వరకు బ్రతకడం కాదు. పది మంది మనసులలో పది కాలాల పాటు జీవించడమే జీవితం. ఇలాంటి జీవితానికి అర్థం, పరమార్థం ఉంటుంది. మనం సంతోషంగా జీవించాలంటే కావల్సింది ఆస్తులు, అంతస్థులు కాదు. మనల్ని ప్రేమించేవాళ్ళు మన ప్రక్కన ఉండాలి. ఇది డాక్టర్ వినీల్ మనోగతం. తన భార్య ఎరవెల్లి సరిత బ్రెయిన్‌డెడ్ కాగా ఆమె గుండె, కిడ్నీ, కార్నియా, కాలేయాలను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు ఇవ్వాలని క్షణాల్లో నిర్ణయం గైకొన్నాను. దీనివల్ల నలుగురుకి ప్రాణదానం చేసినట్లవుతుందని భావించాను. ఒక ప్రక్క గుండె నిండా విషాదం, మరో ప్రక్క తన సహధర్మచారిణి అవయవాలను దానం చేయడం ద్వారా మరో నల్గురికి కొత్త జీవితాలు అందివ్వగలిగానన్న ఆత్మ సంతృప్తి. ఏది ఏమైనప్పటికి మనోనిబ్బరంతో తీసుకొన్న నిర్ణయం మరో నలుగురి జీవితాలలో వెలుగు నింపుతుందని, అందుకు కారణం తన సహధర్మచారిణి కావడం ఆనందంగా ఉంది. – డా॥వినీల్ కుమార్, దంతవైద్య నిపుణులు

రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన శ్రీ ఎరవెల్లి వినీల్ భార్య శ్రీమతి ఎరవెల్లి సరిత బ్రెయిన్‌డెడ్ కాగా ఆమె అవయవాలను దానం చేయడానికి భర్త అంగీకరించడం వల్ల నలుగురి ప్రాణాలు నిలబడ్డాయి. ఎరవెల్లి వినీల్ పుట్టెడు దుఃఖంలోను తన త్యాగనిరతిని చాటారు. సరిత గుండెను కేవలం 10 నిమిషాలలో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేర్ ఆసుపత్రికి గ్రీన్ ఛానెల్ ద్వారా తరలించి ఒక యువతికి అమర్చారు. కాలేయం, కార్నియా, మూత్రపిండాలను కూడా వైద్యులు సేకరించారు.

శ్రీ ఎరవెల్లి వినీల్ వృత్తి రీత్యా దంత వైద్యులు. హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పర్చుకున్న వీరి సతీమణి శ్రీమతి ఎరవెల్లి సరితకు అధిక రక్తపోటు రావడంతో క్రింద పడిపోయారు. వెంటనే ఆమెను బంజారహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలిస్తుండగానే తలలో రక్తనాళాలు చిట్లిపోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఈ విషయాన్ని గుర్తించిన వైద్యులు ఆమెను బ్రతికించేందుకు అన్ని ప్రయత్నాలు చేసినా విధి వక్రీకరించడం వల్ల ఆమె బ్రెయిన్ డెడ్‌కు గురైంది. ఈ విషయాన్ని డాక్టర్లు నిర్ధారించడంతో డాక్టర్ వినీల్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరిత అవయవాలను దానంచేయాలని నిర్ణయించుకొన్నారు. దీంతో వైద్యులు అవయవాల సేకరణకు అన్ని ఏర్పాటు చేశారు.


బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రి నుండి నాంపల్లిలోని కేర్ ఆసుపత్రికి సరిత గుండెను కేవలం పది నిమిషాల వ్యవధిలో గ్రీన్ చానెల్ ద్వారా తరలించారు. ఇందుకోసం ట్రాఫిక్ పోలీసులు చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయం. సరిత కాలేయం, కార్నియా, మూత్రపిండాలను కూడా మరో ముగ్గురికి అందించేందుకు డాక్టర్లు ఏర్పాట్లు చేశారు. దీంతో సరిత నల్గురి జీవితాలలో వెలుగులు నింపి సజీవ మూర్తిగా, చిరస్మరణీయంగా నిలిచింది.

**అవయవ దానం వల్ల మరొకరి జీవితం లో వెలుగు :** అవయవ దానం చాలా గొప్పదని, దీనివల్ల మరొకరి జీవితం నిలబడుతుందని టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు, ఐటి,పురపాలక శాఖా మాత్యులు శ్రీ కల్వకుంట్ల తారక రామా రావు ట్వీట్ చేశారు. శ్రీమతి ఎరవెల్లి సరిత తన అవయవాలను దానంగా ఇవ్వడం వల్ల నలుగురి జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. అవయవదానం కోసం తన అంగీకారాన్ని తెలిపిన డా॥ వినీల్ మానవతావాదాన్ని కెటిఆర్ అభి నందిస్తు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని ట్విట్టర్ ద్వారా తెలిపారు.

**తన్నీరు బాపూరావు సంతాపం:** ఐవా కోశాధికారి, పోతుగల్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఛైర్మెన్ శ్రీ తన్నీరు బాపూరావు డా॥ వినీల్ మనవతా వాదాన్ని అభినందించారు. శ్రీమతి ఎరవెల్లి సరిత తన అవయవాలను దానం చేసి మరో నలుగురికి ప్రాణదానం చేయడంతో ఆమె జీవితం సార్థకమైందన్నారు. శ్రీమతి సరిత సజీవం అని శ్రీ బాపూరావు అభివర్ణించారు. శ్రీ ఎరవెల్లి వినీల్ కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. •

### కన్నుల పండుగగా - క్షత్రియ హోటల్ వేదికగా

# కుముదవల్లీ విలాసము గ్రంథావిష్కరణ




**పద్మనాయక వెలమ జాతి గర్వించ తగిన మహిళ, నాటి ఆంధ్రప్రదేశ్ వెలమ సంఘం ఉపాధ్యక్షులు స్వర్గీయ ప్రొఫెసర్ పొనుగోటి ప్రమదా దేవి సంఘ పురోభివృద్ధికి, మహిళా సాధికారతకు అలుపెరుగని కృషి చేశారు. నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవాభావం, మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్న ఆకాంక్ష ఆమె ఆభరణాలు. వీరి జన్మదినం సందర్భంగా ఆగష్టు 28న సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులోని క్షత్రియ హోటల్ టవర్స్‌లో సాయంత్రం 5:30 గంటలకు శ్రీ పొనుగోటి జగన్నాథరాయల కృతి 'కుముదవల్లీ విలాస' గ్రంథావిష్కరణ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎందరో సాహితీవేత్తలు పాల్గొన్నారు.**

చరిత్రను మరిచే క్రమంలో అది మనల్ని మరచిపోతుంది. విశాల విశ్వంలో ప్రతి దానికి ఓ చరిత్ర ఉంటుంది. గ్రీకు భాషలో హిస్టోరియా అంటే తెలుసుకో అని అర్థం. చరిత్రను తెలుసుకుంటేనే మనుగడ ఉంటుంది. పళ్ళచెళ్ళ గోత్రికుడు పొనుగోటి వంశజుడైన శ్రీ జగన్నాథరాయల విరచితమైన కుముదవల్లీ విలాసము గ్రంథాన్ని సాహితీలోకానికి అందించాలన్న తపనే ఈ కార్యక్రమానికి బాటలు వేసింది. క్రీ.శ.1680లో ఈ ప్రబంధాన్ని రచించినట్లు పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. వంశావళిని పరిశీలించినచో ఈ కాలము సరైందని భావించవచ్చు.

పలువురు సాహితీవేత్తలు తమ రచనలలో ఈ ప్రబంధాన్ని ప్రౌఢ ప్రబందము అనియు కొంత వరకు విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీ కృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద కావ్యముతో పోల్చవచ్చని పేర్కొనడం విశేషం. ఈ గ్రంథం నేటి విద్యార్థులకు ఒక పరిశోధనాంశంగా ఉపకరిస్తుందన్న అభిప్రాయాన్ని వేదికనలంకరించిన సాహితీవేత్తలు వ్యక్తం చేయడం గమనార్హం.

ఈ ప్రబందంనందు భక్తితత్పరుడైన పొనుగోటి జగన్నాథరాయలు తన కవిత్వంలో అయోనిజయైన కుముదల్లీని వైష్ణవ భక్తుడైన పరకాలుని నాయికా, నాయకులుగా అద్వితీయంగా వర్ణించారు. రాజులకు, భగవంతునికి కావ్యాలను అంకితమివ్వటమనేది నాటి కాలం ఆనవాయితి.

నాటి దేవాద్రి పట్టణం నేటి దేవరకొండలో శ్రీ పొనుగోటి జగన్నాథరాయలు తన గురువు అయిన శ్రీ తిరుమలాచార్యుల వారి ఆదేశమున రచించిన కుముదవల్లీ విలాసము అనే ప్రబంధమును తన గురువుకే అంకితమివ్వటం విశేషం.

కాలచక్ర భ్రమణంలో కొంత చెదిరిపోయిన ఈ కావ్యాన్ని 8వ తరం వాడైన



శ్రీ పొనుగోటి కృష్ణరాయలు పునరుద్ధరించారు. తర్వాత 11వ తరం వారైన శ్రీ పొనుగోటి వెంకటరాయుడు ఈ విశిష్ట ప్రబంధానికి శాశ్వతత్వం కల్గించే సంకల్పంతో క్రీ.శ.1925లో పుస్తక ముద్రణ ఓరుగల్లులోని ఇనుగుర్తిలో కావించారు. దాదాపు శతాబ్దకాలం తర్వాత పళ్ళచెళ్ళ గోత్రీకులు పొనుగోటి వంశజులైన వారు ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

ఇందుకు రెండు కారణాలున్నాయని కార్యక్రమ నిర్వాహకురాలు డా॥ పొనుగోటి ఇందిరాదేవి తెలిపారు. వీటిలో ఒకటి మా వంశానికి శ్రీ జగన్నాథరాయలుతో ఉన్న సంబంధం, రెండవది కుముదవల్లీతో మాకున్న సాహితీ అనుబంధం. ఈ రెండింటిని భావితరాలకు తెలియజేయాలన్నది మా ఆశయమని డా॥ ఇందిరాదేవి తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు, ముఖ్య అతిథి ప్రొ. ఎల్లూరి శివారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, సభాధ్యక్షులు ప్రొ. తంగెడ కిషన్ రావు, కరీంనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ రీడర్, గ్రంథ పరిచయకర్త డా॥ గండ్ర లక్ష్మణ్‌రావు, పాలెం ఎస్.వి. ప్రభుత్వ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపల్, సంపాదకులు, సన్మాన గ్రహీత శ్రీ రంగాచార్య, రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విశిష్ట అతిథి శ్రీ మొవ్వా వృషాద్రిపతి, ఆత్మీయ అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొ. సూర్యధనుంజయ, నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ కె.లావణ్య గౌరవ అతిథిగా ఐవా ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరి శ్రీకాంత్ రావులు పాల్గొన్నారు. •



స్వర్గీయ శ్రీమతి పొనుగోటి ప్రమదా దేవిగారి జయంతి సందర్భంగా కుముదవల్లి విలాసము గ్రంథావిష్కరణ సభకు గౌరవ అతిథిగా నన్ను ఆహ్వానించిన ప్రొఫెసర్ డా॥ పొనుగోటి ఇందిరా దేవి శ్రీమతి కోరుకంటి పద్మినిదేవి గార్లకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకొంటున్నాను. నాటి ఆంధ్రప్రదేశ్ వెలమ సంఘం ఉపాధ్యక్షులుగా విశిష్ట సేవలందించిన డా॥ ప్రమదాదేవిగారి దూరదృష్టి, మహిళా సాధికారత కోసం వారు తపించిన తీరు, నిస్వార్థ, నిరాడంబర వ్యక్తిత్వం, అరమరికలులేని ఆప్యాయతను గుర్తు చేసుకొనే అవకాశం లభించింది. సంఘ కార్యకలాపాలలో సీనియర్ మహిళా సభ్యురాలిగా, ఉపాధ్యక్షులుగా వారు అందించిన సేవలు చిరస్మరణీయం. వారి జన్మదినం సందర్భంగా గ్రంథావిష్కరణ సభ జరగడం అభినందనీయం. వేదికనలంకరించిన వారంతా బహుముఖ ప్రజ్ఞాశాలురు, అన్నింటకంటె మిన్న గురువులు. ఇంతమంది గురుతుల్యుల మధ్య నాకీ అవకాశం కల్పించిన నిర్వాహకులకు నా ధన్యవాదాలు. నాకు తెలిసినంత వరకు సాహిత్యం పట్ల మక్కువ ఉందికాని, దాన్ని లోతుగా పరిశీలించగల అనుభవం మాత్రం లేదని సవినయంగా మనవి చేసుకొంటున్నాను. నేను చెప్పేది ఒకే ఒక్క మాట అది సమాజం నుండి ప్రతి ఒక్కరు ఏదో ఒకటి ఆశించేవారే తప్ప ఏది ఆశించని వారు ఎవరైనా ఉన్నారంటే వారు గురువు మాత్రమే అన్నది నగ్నసత్యం.

అందుకే ఓం శ్రీ అస్మత్ గురుభ్యోనమః

– పూస్కూరు శ్రీకాంత్ రావు



**కాస్త పీచు తినండి...** మధుమేహులకు ఏది తినాలన్నా భయమే. ఎందుకంటే ఆయా పదార్థాల కారణంగా రక్తంలో గ్లూకోజ్ శాతం పెరగడంతో పాటు బరువూ పెరిగిపోతుంటారు. చివరకు కాస్త తియ్యగాఉండే పైనాపిల్... తినడానికి కూడా ఆలోచిస్తుంటారు. అందుకే రట్జర్స్ విశ్వవిద్యాలయానికి చెందిన నిపుణులు మధుమేహుల ఆహారం గురించి ఆరేళ్ళపాటు నిరంతర పరిశోధన చేసి అన్నింటికన్నా పీచు ఎక్కువగా ఉండే పదార్థాలు ఎంత తింటే అంత మంచిదని తేల్చారు. అంటే ముడి గోధుమలు, ఓట్స్, కొర్రలు, అరికెలు, సజ్జలు, ఆకుకూరలూ, అవకాడో, స్ట్రాబెర్రీ, పైనాపిల్ వంటి పండ్లు ఎక్కువగా తినాలని చెబుతున్నారు. వీటి కారణంగా పొట్టలో బ్యాక్టీ రియా శాతం పెరిగి, రక్తంలో చక్కెర శాతం పెరగకుండా చేస్తుందని చెబుతున్నారు.

– అంతర్జాలం నుండి...

# అత్తాకోడళ్లు - అన్యోన్యత



రేమద్దుల దివాకర్‌రావు
ఫోన్: 9391372407

కుటుంబ వ్యవస్థలో అత్తాకోడళ్లు ఎంత సఖ్యతగా ఉంటే ఆ ఇంట్లో అంతటి అన్యోన్యత అందరిలోనూ కనిపిస్తుంది. పెళ్లైన అమ్మాయి కొత్తకోడలి హోదాలో అత్తగారింట్లో అడుగిడిన ప్పుడు ఆ కుందనపుబొమ్మ ఊహలకు తగిన అత్త దొరికితే అంతా మంచే జరుగుతుందనిపిస్తుంది. అదేవిధంగా అత్త కోరుకున్న విధంగా వచ్చిన కోడలు మసలగలిగితే తన బిడ్డకు చెప్పే సుద్దులు కోడలుకూ చెప్పుకుంటుంది.

అత్తాకోడళ్లు అనేది తల్లీకూతుళ్లంత అందమైన ద్వంద సమాసము. అత్త అంటే మెట్టినింటి అమ్మ. కోడలంటే అత్తింటి కూతురు. అత్తమ్మ అమ్మకు మరో రూపం అని కోడలను కోవాలి. తన కోడలు కూతురంత అపురూపం అని అత్తగారు అనుకోవాలి. కోడలుకు అమ్మలాగ ఉండాలనుకునే అత్తలూ ఉన్నారు. అత్తకు నచ్చినట్లు నడుచుకుంటూ కూతురిలా కని పించాలనుకునే కోడళ్లూ ఉన్నారు. తన కోడల్ని ఎవరేమన్నా సహించలేని అత్తమ్మలూ ఉన్నారు. ఇంట్లో కూతురుకంటే కోడలుకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే అత్తగారు, తల్లిదండ్రులకంటే అత్తమామలను అధికంగా గౌరవించే కోడళ్లూ లేకపోలేదు. ఎప్పుడైనా అత్తాకోడళ్ల మధ్య అవగాహన లోపించి ఇబ్బంది అనిపించినా కాశింత మౌనాన్ని పాటిస్తూ సర్దుకొని కలిసి సాగ గలిగితే ఇరువురూ ఉత్తమ గుణవంతులనిపించుకోగలరు.

ఉమ్మడి కుటుంబాల్లోని 'అమ్మ'ల్లో కొందరు కొడుకు పెళ్లి చేయాలన్న ఆరాటం మొదలయినప్పటి నుంచి కాబోయె కోడలి అందచందాలు, చదువు సంధ్యలు, గుణాగుణాలు అన్నీ చూసి చేసి తెచ్చుకున్నా కోడలు ప్రతీ విషయం తనను అడిగే తెలుసు కోవాలని, తాను చెప్పింది మాత్రమే చేయాలని ఆ విధంగా ఎప్పటికీ తనకు అణిగిమణిగే ఉంటుందన్న భావనలో ఉండ వచ్చు. అదే విధంగా అమ్మాయిలు కూడా చిన్ననాటి నుంచి తల్లిచాటున పెరిగిన బిడ్డలుగా, పనిలో అనుభవం లేక అత్తవా రింట్లో తోచింది చేయలేక ప్రతీది అత్తమ్మను అడిగి చేయవచ్చు. అయితే కొత్తలో కొంతవరకు సవ్యంగానే సాగుతుంది. కాలం గడిచేకొద్ది బాధ్యతలు పెరుగుతాయి.ప్రాధాన్యతలూ మారుతాయి. అప్పుడు కోడలు అత్తగారి ప్రమేయం లేకుండా తనకు తోచింది చేయడం అది అత్తగారికి నచ్చకపోవడం, అప్పుడు అత్తాకోడళ్ల మధ్య అనుకోని మాట పెదవులు దాటడం, ఆ బంధంలో బయ టకు కనిపించని వైరం చోటు చేసుకోవడం జరగవచ్చు. అయినా దాన్ని వెంటనే భగ్నం చేసి మరోసారి దానికి స్థానమివ్వకుండా చూసుకోవడం తమ బాధ్యతగా భావించాలి.

ఈ రోజుల్లో కూడా కొందరు కోడళ్లు వాస్తవాలను గ్రహించలేకపో తున్నారు. భవిష్యత్తులో తాము కూడా అత్తలవుతామన్న విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఒక్కో అడుగు ముందుకు వేస్తే అత్తాకోడళ్ల మధ్య బంధం దృఢంగా మారే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కోడల న్నప్పుడు అత్తగారి వయసుకు, అనుభవానికి తగ్గ గౌరవమివ్వాలి. వారిలోని లోపాలు కొంతసేపు పక్కన పెడితే అప్పటి వరకు ఆవిడ ఎన్నో సమస్యలను ఎదుర్కొని పరిష్కరించుకోగలిగిం దన్న సంగతి మరిచిపోవద్దు. మన సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి కోడలు కొన్ని హద్దులు దాటకుండా ఉండడం మంచిది. సాధ్యమైనంత వరకు అత్తగారికి దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలి. ఉదా: వీలయినప్పుడల్లా వారి అవసరాలను గుర్తు చేస్తూ, తనకు కావాల్సింది కూడా మాటల్లో పంచుకోవచ్చు. ఫంక్షన్స్‌కు వెళ్ళేటప్పుడు ఆవిడ ఆభరణాలు, డ్రెస్సులు సెలక్ట్ చేయడంలో చొరవ తీసుకుంటే ఆవిడ ఆనందానికి అంతుండదని గుర్తించాలి. చాలా వరకు వివిధ కారణాల వల్ల కొడుకు కోడళ్లు దూరంగానే ఉండవచ్చు. అయినా తరచుగా అత్తగారిని పలుక రించి క్షేమ సమాచారాలు విచారించడం, పిల్లలతో మాట్లాడిం చడం, అప్పుడప్పుడు తమ దగ్గర కొచ్చి ఉండి పొమ్మని కోరడం లాంటివి ఇరువురు దగ్గరయ్యేందుకు దోహదపడతాయి.

మహిళలను మర్యాదగా పలుకరించే పదం 'అమ్మ'. అమ్మా అన్న పిలుపు ఆమెకిచ్చిన గౌరవంగా భావిస్తుంది ఆ అమ్మ. ఎంతో మంది కవులు తెలుగులో 'అమ్మ' అన్న పిలుపులోని తీయదనం మరే పదంలోనూ లేదని చెప్పారు. అంటే ఎంత కఠినస్తులైనా తీపిని ఇష్టపడని వారుండరు. అందుకొరకు అత్తమ్మలో దాగి ఉన్న అమ్మను చూడాలి. అంటే అత్త+అమ్మ= అత్తమ్మ. కాబట్టి కోడలు తన అత్తమ్మను అమ్మా అని పిలువ డానికి అలవాటు పడితే ఆ ఆప్యాతలోనున్న ఆత్మీయతను ఎవరూ విడదీయలేరు.

"సర్వే జనాః సుఖినోఽ భవంతు"



## పౌరుషానికి, పరాక్రమానికి పుట్టినిల్లు...

# బొబ్బిలి సంస్థానము

బొబ్బిలి పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది బొబ్బిలి యుద్ధం వాస్తవ వీరోచిత గాథ. భారతదేశ చరిత్రలోనే అత్యంత విషాదాన్ని మిగిల్చిన చరిత్ర. అప్పటి ఫ్రెంచ్ సేనాని బుస్సీదొర హృదయం కూడా కకావికలమైంది. ఇంతవరకు చాలా మందికి తెలిసిందే కానీ నాటి సంస్థాన పూర్వాపరాలు, పాలకుల చరిత్ర వీలయినంత వివరంగా తెలియచేయాలన్నదే ఈ మా ప్రయత్నం.

ఈ పట్టణం ఉన్న స్థలమును చికాకోలు నవాబు షేర్ మహమ్మద్ ఖాన్ ఈ సంస్థాన పాలకులకు ప్రసాదించుట వలన అచ్చట కట్టిన కోట ఊరునకు షేర్ అనగా పెద్దపులి 'బెబ్బులి' అని వ్యవహరించేవారు. అలా వాడుకలో 'బొబ్బిలి'గా మారింది. కవిటి, బొబ్బిలి, రాజాము, సీతానగరం పరిపాలనా సౌలభ్యం కొరకు నాలుగు ఠాణాలుగా విభజన చేశారు. ఈ సంస్థానమునందు 208 గ్రామాలు, 70 అగ్రహారాలు కలిపి మొత్తం 920 చదరపు మైళ్ళ విస్తీర్ణం కలిగి ఉండేది.

ఈ సంస్థాన పాలకులు హరిపాదోద్భవులైన వెలమ దొరలు. అత్యంత ప్రతాపవంతులైన ఈ వెలమదొరలలో రావువారు బలవంతులు. వీరిది రేచర్ల గోత్రం. ఇనుగంటి, చింతపట్ల, చెలికాని, తాండ్ర, దామెర గృహ నామములు కల వెలమ దొరలు బొబ్బిలి పాలకులకు నెయ్యము వియ్యము కలవారు. వెంకటగిరి వారికి బొబ్బిలి వారికి మూల పురుషుడు ఒక్కరే. ఈ మూలపురుషుని 15వ తరమువారగు రాయప్పనాయుడు (వెలుగోడు పాలకులు) ఇతనికి పెద్దరాయుడు అని కూడా వాడుక నామము ఉండేది. కొందరు బొబ్బిలి మూలపురుషుడు రాజా ధర్మారావని వ్రాశారు. కానీ బొబ్బిలి వంశావళిలో పెద్దరాయుడు మూలపురుషుడు అని పేర్కొన్నారు.

ఈ రాయుడప్ప మరియు విజయ నగర సంస్థాన పాలకులు 1652లో మొగలు బాదుషా తరపున షేర్ మహమ్మద్ ఖాన్ కళింగసీమను ఆక్రమించుటకు దాడి చేయునప్పుడు వీరు ఇరువురు ఖాన్ వెంట ఉండి సహకరించారు. లింగప్ప మొగలు బాదుషా మరియు చికాకోలు నవాబు షేర్ మహ్మద్ ఖాన్‌తో ఐకమత్యంగా విశ్వాసపాత్రునిగా ఉండేవారు. ఒకనాడు షేర్ మహ్మద్‌ఖాన్ కుమారుడు వేటకు వెళ్ళి దారి తప్పడం వలన పితూరీదార్లకు బందీ అయినాడు. ఖాన్ అనుమతి మేరకు లింగప్ప సాహసించి



పాపారాయుడు విజయరామరాజును చంపుటకు వాడిన ఆయుధాలు

కొండ ప్రాంతములన్నీ గాలించి పితూరీదారుల చెరనుండి ఖాన్ కుమారుడిని విడిపించి నవాబు మన్ననలు పొందారు. దీనికి ప్రతిఫలంగా పన్నెండు గ్రామాలను లింగప్పకు బహుకరించారు. ఈ సంఘటన నేటి శ్రీకాకుళం నందుగల పలాస చేరువలో 'రంగవాక'యను చోట జరిగినది. ఈ రంగవాక విజయమును పురస్కరించుకొని నవాబు లింగప్పకు 'రంగరాయ' అను బిరుదును ప్రసాదించారు. నాటి నుండి లింగప్ప రంగరాయ వంశీయులు ఈ బిరుదమును పౌరుషానికి చిహ్నముగా పరంపరగా తమ నామముల చివర ధరించుట ఆనవాయితీగా మారింది.

లింగప్ప రంగరాయలకు సంతానం లేనందున వెంకటగిరి పాలకుల కోవలో మాధవరాయల మూడవ కుమారుడగు వెంగళరావును దత్తత తీసుకున్నారు. పెద్ద రాయుడుని కూడా కలిపి లెక్కించిన బొబ్బిలి పాలకులలో వెంగళరావు మూడవ తరానికి చెందినవారు. లింగప్ప రంగరాయలు మరణించు నాటికి వెంగళరావు పిన్న వయస్కులు. అందువలన కొంతకాలము తండ్రియైన మాధవరావు, అన్నలగు పద్మారావు, నారప్పరావులు బొబ్బిలి సంస్థాన బాధ్యతలు నిర్వహించారు. వెంగళరావు తన బాధ్యతలను తదుపరి చేపట్టారు. ఆయనకు పెదజనార్ధన రంగారావు, రంగపతిరంగారావు అను ఇరువురు కుమారులు. జనార్ధనరంగారావు లక్కవరపుకోట సంపాదించి పరిపాలించారు. బొబ్బిలి సంస్థాన బాధ్యతను రంగపతి రంగారావు చేపట్టారు. ఈయన కుమారుడు రాజా రాయడప్ప రంగారావు తండ్రి మరణ సమయంలో పసిబాలుడు. రాజా రాయుడప్ప రంగారావు పసిబాలుడయినందున ఆయన పినతండ్రి లక్కవరపుకోట పాలకులగు రాజా పెద్దజనార్ధన రంగారావు కుమారుడు రాజా వెంకటపతి రంగారావు కొంతకాలము బొబ్బిలి జమీందారి వ్యవహారములు పర్యవేక్షించారు. తదుపరి రాజా రాయుడప్ప రంగారావు స్వయంగా పరిపాలన సాగించారు. వీరికి సంతతి లేనందున బొబ్బిలి పాలకుల పరంపరగా సంబంధియగు రావు గోపాలరావు పెద్ద కుమారుడగు గోపాలకృష్ణ రంగారావును దత్తత తీసుకున్నారు. ఈ రాజా గోపాలక్రిష్ణ రంగారావు తమ్ముడు బొబ్బిలి ముట్టడిలో ప్రసిద్ధులైన వెంగళ రంగారావు. రాజా గోపాలకృష్ణ రంగారావు భార్య మల్లమ్మదేవి. ఈమె కసీంకోట వాస్తవ్యులు పద్మనాయక కులోత్తంగులు శ్రీ చెలికాని వెంకయాంబా రామరాయల పుత్రిక. ఈమె సోదరియగు జగ్గమాంబ పిఠాపురం పెదనీలాద్రిరాయల (క్రీ.శ.1730-76) భార్య. 1756లో చెలరేగిన ఉత్తర సర్కారులలోని జమీందారుల పితూరీలను అణిచివేయుటకు పెద్ద సేనతో తరలివచ్చిన ఫ్రెంచ్ సేనాని బుస్సీ దొరకు విజయనగర పాలకులగు పెద్ద విజయరామ రాజు (1717 – 1757) చాలా సహకరించారు. నిజాము నుండి చికాకోలు, రాజమహేంద్రవరము సర్కారులను పెద విజయరామరాజు బుస్సీదొరను నమ్మించి బొబ్బిలి కోటను ముట్టడింపచేశారు. 1757లో జరిగిన బొబ్బిలి యుద్ధం చరిత్రలో ప్రసిద్ధమయినది.

### తదుపరి బొబ్బిలి యుద్ధం:

బొబ్బిలి యుద్ధం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక ప్రముఖ ఘట్టం. 1757 జనవరి 24న బొబ్బిలి సంస్థాన సైన్యానికి, ఫ్రెంచి, విజయనగర సంస్థాన సంయుక్త సైన్యానికి మధ్య జరిగిన యుద్ధమే బొబ్బిలి యుద్ధంగా పేరు గాంచింది. బొబ్బిలి కోట విశాఖపట్నానికి ఈశాన్యంగా 140 మైళ్ళ దూరంలో ఉంది. 18వ శతాబ్ది మధ్యకాలంలో బొబ్బిలి జమీందారుగా ఉన్న రాజా గోపాలకృష్ణ రంగారావుకు, విజయనగర సంస్థానం ప్రభువు పూసపాటి పెద విజయరామరాజుకూ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనేంత వైరం ఉండేది. రెండు రాజ్యాల సరిహద్దుల వద్ద ఉన్న వాగుల్లోని నీటిని బొబ్బిలి ప్రజలు బలవంతంగా తీసుకువెళ్ళేవారు. తన బలం చాలనందున విజయరామారాజు ఈ దోపిడిని ఎదుర్కొనలేక పోయేవాడు. ఫ్రెంచ్ కమాండర్ బుస్సీ వద్ద తనకున్న పలుకుబడిని ఉపయోగించుకొని, పక్కలో బల్లెంలా ఉన్న తన పొరుగు రాజును ఇక్కడి నుండి తరిమికొట్టాలని పెద విజయరామారావు భావించాడు. బొబ్బిలి పాలకులు మిగిలిన జమీందార్ల లాగా ఫ్రెంచి వారితో సత్సంబంధాలు నెలకొల్పుకోక, తమ చర్యల ద్వారా ఫ్రెంచ్ కమాండర్ మార్క్ ది బుస్సీతో శత్రుత్వాన్ని పెంచుకున్నారు. ఈ చర్యలన్నిటి పర్యవసానమే బొబ్బిలి యుద్ధం.

భారతదేశ చరిత్రలో ముందెన్నడూ ఎరుగని సంఘటనను ఆవిష్కరించిన యుద్ధం ఇది. అనేక జానపద గాథలకు ప్రాణం పోసిన బీభత్సకాండ ఈ యుద్ధంలో జరిగింది. బొబ్బిలికి విజయనగరానికి మధ్య జరిగిన ఘర్షణలు 18వ శతాబ్దంలో బొబ్బిలికీ విజయనగరానికీ మధ్య అనేక ఘర్షణలు, యుద్ధాలూ జరిగాయి. ఎక్కువగా బొబ్బిలి సంస్థానమే విజయం సాధిస్తూ ఉండేది. వాటిలో ప్రధానమైనవి ఇవి...

పెద విజయరామరాజు నారాయణ పట్నాన్ని ఆక్రమించేందుకు సాగి నారాయణ రాజు నేతృత్వంలో సైన్యాన్ని పంపించాడు. ఆ సైన్యం బొబ్బిలి పరగణాగుండా పోతున్నప్పుడు, బొబ్బిలి సైన్యం అడ్డగించి, ఓడించి వెనక్కు పంపింది. రాజు తన కింద ఉన్న పాలెగాళ్ళను కూడగట్టి పెద్ద సైన్యంతో బొబ్బిలిపై దాడి చేశాడు. మళ్ళీ బొబ్బిలి సైన్యం చేతిలో ఓడిపోయాడు. బొబ్బిలి సైన్యం రాజును వెంటాడగా అతడు పారిపోయి కమిలి కోటలో తలదాచుకున్నాడు. రాజు పార్వతీపురానికి దగ్గర్లోని బెలగం వద్ద కోటను నిర్మించి నారాయణ పట్నాన్ని ఆక్రమించాడు. అక్కడి నుండి బొబ్బిలిపై దాడి చేశాడుగాని విఫలుడయ్యాడు. ఈ యుద్ధాల్లోగానీ, నారాయణపట్నంలో మురికినీళ్ళు తాగడం వలన వచ్చిన రోగాల వలన గానీ 4000 మంది దాకా సైనికులను కోల్పోయాడు. నారాయణ పట్నం ప్రభువు తన తప్పును అంగీకరించి క్షమించమని అడిగాక పరిహారం వసూలు చేసి, అతడి రాజ్యాన్ని అతడికి ఇచ్చివేశాడు.

విజయరామరాజు మళ్ళీ తన సైన్యాన్ని కూడగట్టి బొబ్బిలిపై దాడి తలపెట్టాడు. ఈసారి అతడు దేశస్తులను కూడగట్టాడు. దేశస్తులంటే ఐరోపా వారితో యుద్ధాల్లో పాల్గొన్న దేశీయులు. కానీ బొబ్బిలిని ఓడించడం సాధ్యం కానిపనని వారు రాజును హెచ్చరించారు. తన దీవాను బుర్రా బుచ్చన్న సలహా మేరకు తానుకాక, పూసపాటి రామచంద్రరాజు సారథ్యంలో సైన్యాన్ని దాడికి పంపించాడు. బొబ్బిలి సైన్యం వారిని ఓడించి, రామచంద్రరాజు తలను నరికి, దానికి తిరునామాలు పెట్టి విజయనగరానికి పంపారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బొబ్బిలిపై పై చేయి సాధించలేకపోయాడు విజయరామరాజు.

**యుద్ధానికి దారితీసిన సంఘటనలు:**

బుస్సీ వద్ద రాజకీయం...

హైదరాబాద్ నిజాం సలాబత్ జంగ్ బుస్సీని ఉద్యోగం నుండి తొలగించిన వార్త తెలిసిన తరువాత విజయనగరం రాజులు తప్ప, ఉత్తర కోస్తా జమీందారులందరూ ఫ్రెంచివారికి శిస్తులు కట్టడం మానేశారు. బుస్సీ నిజాముతో రాజీ కుదుర్చుకుని, సర్కారు జిల్లాల పర్యటనకు వచ్చాడు. 1757లో బుస్సీ నిజాము సంస్థానం నుండి బయల్దేరి మచిలీపట్నం మీదుగా రాజమండ్రి చేరుకొని, కోటిపల్లి వద్ద మకాం వేశాడు. పాలెగాళ్ళను, జమీందార్లను, సంస్థానాధీశులను వచ్చి తనను కలవమని కబురు పంపాడు. బొబ్బిలి పాలకుడు రంగారావు తప్ప, విజయ రామ రాజుతో సహా అందరూ వచ్చి కలిశారు. విజయరామరాజు దీన్ని అవకాశంగా తీసుకొని రంగారావుకు వ్యతిరేకంగా బుస్సీ వద్ద, అతడి దివాను హైదర్ జంగు వద్దా ఆరోపణలు చేశాడు. మీరంటే వారికి లెక్కలేదని అందుచేతనే మీ వద్దకు వచ్చి కలువలేదనీ, ఫ్రెంచి వారికి ఇవ్వాల్సిన శిస్తు సరిగా చెల్లించడం లేదనీ వారికి నూరిపోశాడు. వారి రాజ్యానికి పొరుగున ఉన్న తనకు అనేక రకాల ఇబ్బందులు కలుగజేస్తున్నారని, వారిని బొబ్బిలి నుండి వెళ్ళగొట్టి, దాన్ని తనకు స్వాధీనం చేస్తే శిస్తు సక్రమంగా చెల్లిస్తాననీ అతడు బుస్సీకి చెప్పాడు. దాంతో బుస్సీ, బొబ్బిలి వదిలిపెట్టి పోవాలని రంగారావును ఆదేశించాడు. బొబ్బిలి స్థానంలో అంతకంటే పెద్దదైన వేరే స్థలానికి పోయి రాజ్యాన్ని స్థాపించుకోవచ్చని ప్రతిపాదించాడు. రంగారావు దాన్ని అవమానంగా భావించాడు.

విజయరామరాజు బుస్సీకి కట్టాల్సిన కప్పం పది లక్షలూ కట్టేశాడు. అంతేకాక మూడు లక్షల లంచం హైదర్ జంగ్‌కు వచ్చి, బుస్సీకి బొబ్బిలిపై మనసు విరిచేందుకు సహకరించమని చెప్పాడు. హైదర్ జంగు అందు కంగీకరించాడు.కొద్ది రోజులకే బుస్సీ కొందరు సిపాయీలను ఒక దూరప్రదేశానికి పంపించాల్సి వచ్చింది. వాళ్ళు బొబ్బిలి రాజ్యం గుండా వెళ్ళాల్సి రాగా, అందుకు తగ్గ అనుమతులు కూడా తీసుకున్నారు. విజయరామరాజు కుటిల రాజకీయ చాతుర్యం కావచ్చు, రంగారావు ప్రణాళిక కావచ్చు. ఆ సిపాయిలపై దాడి జరిగింది. 30 మంది చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు. బొబ్బిలి సంస్థానంపై చర్య తీసుకోవాల్సిన అవసరాన్ని బుస్సీకి తెలియజేయడానికి విజయరామరాజు ఈ సందర్భాన్ని బాగా ఉపయోగించుకున్నాడు. బొబ్బిలిని అణగదొక్కేసి, పాలెగారును అక్కడి నుండి తరిమెయ్యాలని బుస్సీ నిశ్చయించుకున్నాడు.

**ఇబ్రహీమ్ ఖాన్ ఉదాంతం:**

ఇబ్రహీంఖాన్ శ్రీకాకుళంలో ఫ్రెంచి వారి తరఫున ఫౌజుదారు. బుస్సీకి నిజాముతో సంబంధాలు దెబ్బతిన్న సమయంలో అతడు బుస్సీపై తిరుగుబాటు చేశాడు. రాజమండ్రి కోటలో సైనికులను రెచ్చగొట్టి, తిరుగుబాటు చేయించాడు. ఫ్రెంచివారు వసూలు చేసిన శిస్తులు వెనక్కి ఇచ్చేయాలని అతడు డిమాండు చేశాడు.బుస్సీ రాజమండ్రి చేరుకోగానే అతడు భయపడి పారిపోయి బొబ్బిలి రాజుల వద్ద



**బొబ్బిలి యుద్ధములో వాడిన ఆయుధాలు**



స్థూపముపై గల శాసనము

శరణు కోరాడు. ఈ సంఘటలన్నీ బుస్సీకి బొబ్బిలిపై ఉన్న కోపాన్ని పెంచి, వారిపట్ల అతడికి ఉన్న శత్రుభావనను మరింతగా పెంచి, అతణ్ణి యుద్ధం దిశగా నడిపించాయి.

**యుద్ధాన్ని నివారించేందుకు బొబ్బిలి చేసిన ప్రయత్నాలు:**

యుద్ధాన్ని నివారించేందుకు బొబ్బిలి సంస్థానం చాలా ప్రయత్నాలు చేసింది. విజయ రామరాజు అప్పటికే బుస్సీ వద్ద చేరాడని, ఇప్పుడు తాను వెళ్తే అనవసరమైన ఘర్షణ అవుతుందని భావించి బుస్సీని కలవ డానికి వెళ్ళకూడదని రంగారావు నిశ్చయించు కున్నాడు. కానీ అది బుస్సీకి అతడి దివాను కూ కోపం కలిగించిందని గ్రహించిన రంగా రావు ఆ సంగతిని బుస్సీకి వివరించాలని అతడు ప్రయత్నించాడు. హైదర్ జంగ్‌కు, రాజుకు మధ్య జరిగిన లంచం ఒప్పందం తన వేగుల ద్వారా రంగారావుకు తెలిసింది. హైదర్‌జంగుకు విషయం తెలియజెప్పేందుకు రంగారావు తన రాయబారి పంతెన బుచ్చన్న ను పంపించాడు. జంగు మన మాట వినక పోతే, మచిలీపట్నం వెళ్ళి అక్కడి ఫ్రెంచి అధికారిని కలిసి విషయం చెప్పమని అన్నాడు. కమాండరు మన గురించి, మన ఆత్మాభి మానం గురించి తెలిసినవాడు. అతడు మనకు సాయం చేస్తాడు అని బుచ్చన్నకు చెప్పి ఇద్దరి పేరిటా ఉత్తరాలిచ్చి పంపించాడు.

బుచ్చన్న పెద్దాపురం చేరుకుని హైదరు జంగును కలిశాడు. అతడు బుచ్చన్న చెప్పే విషయాన్ని వినలేదు. నువ్వు ఇక్కడికెందుకు వచ్చావ్? మీ ప్రభువు ఇక్కడికి రావాల్సిన అవసరం లేదని, మాతో స్నేహం చేయ్యాల్సిన అవసరం లేదనీ అనుకున్నాడు గదా. నువ్వు నీ ప్రభువు దగ్గరికే పో అని చెప్పాడు. మా దొరకంటే ముందే మా శత్రువు విజయరామ రాజు బుస్సీ వద్దకు రావడంతో ఆయన రాలే దని, విజయరామరాజుకు ఇచ్చిన గౌరవమే మా ప్రభువుకూ ఇస్తామని మీరు చెప్తే రావడా నికి ఆయన సిద్ధంగానే ఉన్నాడని బుచ్చన్న చెప్పాడు. అతడు రానవసరం లేదు, ముందు మీరు కోట ఖాళీ చేసి వెళ్ళండి అని హైదర్ జంగు చెప్పాడు. మా ఒంట్లో ఊపిరుండగా కోట ఖాళీ చెయ్యడం జరగదు అని చెప్పి బుచ్చన్న వెళ్ళిపోయాడు.

బుచ్చన్న అట్నుంచటే నేరుగా మచిలీ పట్నం వెళ్ళి కమాండరును కలిసి, ఉత్తరం ఇచ్చి జరిగింది చెప్పాడు. కామాండరు బుస్సీ కి తాను ఉత్తరం రాసి, తన అనుచరుణ్ణి బుచ్చన్నకు తోడిచ్చి పెద్దాపురం పంపాడు. బొబ్బిలి ప్రజలు మంచివాళ్ళని, విజయరామ రాజు చెప్పుడు మాటలు వినవద్దని ఆ ఉత్త రంలో రాసాడు. బుస్సీ ఆ ఉత్తరాన్ని చదివి సానుకూలంగానే మాట్లాడాడుగానీ అతని చర్యల్లో ఆ సానుకూలత కనిపించలేదు.

ఆ సాయంత్రం విజయరామరాజు హైదర్ జంగును కలిసి చూసారా నేను చెప్పిందే నిజమైంది. రంగారావు మిమ్మల్ని కలవడానికి రాకుండా, కమాండరు ద్వారా బుస్సీకి ఉత్తరం పంపించాడు. అతడికి మీరం టే లెక్కేలేదు అని అతణ్ణి రెచ్చగొట్టాడు. బుస్సీ కశింకోట నుండి బయలుదేరి దేవులపల్లిలో మకాం పెట్టినప్పుడు రంగారావు చెలికాని వెంకయ్య ద్వారా గౌరవ పురస్కారంగా అతడి వద్దకు పాన్ సుపారీ పంపించాడు. హైదర్ జంగు అతణ్ణి మీ దొర కోటను వదిలిపెట్టి వెళ్ళాడా లేదా అని గద్దించాడు. మాకు కోట ను విడిచి వెళ్ళే అవసరం లేదని, వెళ్ళే ప్రసక్తే లేదనీ అతడు తెగేసి చెప్పి వెళ్ళిపోయాడు. బుస్సీ అక్కడినుండి ససైన్యంగా బొబ్బిలి వెళ్ళి కోట ఎదురుగా శిబిరం విడిచాడు. అప్పుడు కోట గోడపై నుండి వెలమ దొరలు మొగలు చక్రవర్తి తమకు బహుకరించిన నౌబిత్తును (దుంధుభి, భేరి వంటి పెద్ద చర్మ వాయిద్యం) మోగించారు. హైదర్ జంగుకు అది విని ఆగ్రహం కలిగింది. హుసేన్ అలీఖాన్‌ను రాయ బారిగా కోటలోకి పంపించాడు. నౌబత్తును ఆపి, కోటను ఖాళీ చేసి వెళ్ళమని రాయబారి రంగారావుకు చెప్పాడు.

రంగారావు ఇలా సమాధానమిచ్చాడు. నౌబత్తు మాకు మొగలు చక్రవర్తి ఇచ్చినది, దాన్ని మోగించడం ఆపం. ఇక కోటను ఖాళీ ఎందుకు చెయ్యాలో మీరు చెప్పలేదు. అతి తీవ్రమైన ప్రకృతి విపత్తుల్లో కూడా మేమీ కోటను వీడి వెళ్ళలేదు. ఇది మాకు సంపద లను, సౌభాగ్యాలనూ ఇచ్చింది. దీన్ని విడిచి వెళ్ళం. విజయరామరాజు పరాక్రమానికి మా పరాక్రమానికి మీరు పోటీ పెట్టే పనైతే మా ప్రతిపాదనలు వినండి. సర్కారు పసుపు పచ్చ జెండాను విజయరామరాజు 40 వేల సైన్యం ముందుంచండి. మేము మా నాలుగు వేల సైన్యంతో దాన్ని లాక్కోగలిగితే మమ్మల్ని అతడి జమీందారికి ప్రభువులను చెయ్యండి. లాక్కోలేకపోతే మమ్మల్ని, మా జమీందారీని మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. మీ రాగ ద్వేషాలు మీ కందుతున్న ధనంపై ఆధారపడి ఉన్నట్లైతే విజయరామరాజు మీకిచ్చిన దానికి

రెండింతలు ధనమిస్తాం. అతడి రాజ్యాన్ని మాకిప్పించండి. మీకు మూడో మార్గం కూడా చెపుతాం. రాజును అతడి 40 వేల సైన్యాన్నీ మేం మా నాలుగు వేల సైన్యంతో ఎదుర్కొంటాం. మేం గెలిస్తే అతడి రాజ్యం మాది. అతడు గెలిస్తే మా రాజ్యం అతడిది. ఈ మూడు మార్గాలు కూడా మీకు రుచించకపోతే మా మాట చెబుతున్నాం వినండి. మా బొందిలో ప్రాణాలున్నంత వరకూ మేం బొబ్బిలి కోటను వదిలిపోము. ఆ తర్వాత యుద్ధం జరిగింది.

**యుద్ధం:**

బొబ్బిలి యుద్ధం 1757 జనవరి 24న తెల్లవారుతూండగానే మొదలై సాయంత్రానికి ముగిసింది. ఫ్రెంచి ఫిరంగులు బొబ్బిలి కోటను బీటలు వార్చడానికి పెద్దగా సమయం పట్ట లేదు. అయితే బొబ్బిలి వీరులు ప్రతిఘటన కారణంగా ఫ్రెంచి వారు కోటలోపలికి ప్రవే శించలేకపోయారు. 9 గంటల ప్రాంతంలో యుద్ధానికి కొంత విరామం ప్రకటించి, ఫిర గులను ప్రయోగించాక, మళ్ళీ కొనసాగిం చారు. 2 గంటలకు మరో విరామం ప్రకటించే వరకూ కూడా ఫ్రెంచి సైన్యం కోటలోకి ప్రవే శించలేకపోయింది.

**కోటలో బీభత్సం:**

ఈ సమయంలో రంగారావు తన ముఖ్య సేనానులను, అనుచరులను సమావేశపరిచి, ఓటమి అనివార్యమని చెప్పి, తదుపరి కర్తవ్యం గురించి వారికి చెప్పాడు. అందరూ రంగా రావు చెప్పినదానికి అంగీకరించారు. ఓటమి తరువాత తమ స్త్రీలు, పిల్లలు శత్రువు చేతికి చిక్కి అవమానాలపాలు కాకూడదని భావిం చిన బొబ్బిలి వీరులు కోటలోపల ఉన్న తమ నివాసాలకు నిప్పు పెట్టారు. మంటలకు తాళ లేక బయటకు వచ్చే వారిని కత్తులతో పొడిచి చంపారు. అలా కోటలో ఏ ఒక్క స్త్రీ గానీ, పిల్లవాడు గానీ బ్రతకలేదు. ఒక్క రంగారావు కుమారుడు తప్ప. కుమారుని చంపమని అతడి గురువుకు రంగారావు ఇచ్చిన ఆదేశాలను అమలు చెయ్యలేక అతడిని రక్షించాడు ఆ బాలుడి గురువు (ఇంకో కథనంలో ఆ బాలున్ని రక్షిం చింది అతడి ఆయా లక్ష్మి అని ఉంది.)

యుద్ధంలో చిట్టచివరి బొబ్బిలి వీరుడు కూడా నేలకొరిగాక మాత్రమే ఫ్రెంచి సైన్యం కోటలోనికి ప్రవేశించగలిగింది. లోపలికి వెళ్ళిన వారు అక్కడ మంటల్లో స్త్రీలు, పిల్లలు చనిపోయిన దృశ్యం చూసి దిగ్భ్రాంతులయ్యారు. శవాల మధ్య నుండి నడుచుకుంటూ ఆ గురువు రంగరాయుని కుమారుణ్ణి తీసుకుని వచ్చి బుస్సీ మనుష్యులకు అప్పగించారు. వాళ్ళు ఆ కుర్రవాడిని బుస్సీ వద్దకు తీసుకు వెళ్ళారు. లోపల జరిగిన సామూహిక మర ణాల గురించి తెలిసిన బుస్సీ, కోటలోనికి వెళ్ళేందుకు కూడా ఇష్టపడలేదు. (మరొక కథనం ప్రకారం అతడు కూడా లోపలికి వెళ్ళాడు.) బుస్సీ ఆ పిల్లవాడిని బొబ్బిలి వార సునిగా గుర్తించి, తాను రంగారావుకు బొబ్బిలి స్థానంలో ప్రతిపాదించిన కొత్త ప్రాంతానికి రాజుగా ఆ కుర్రవాణ్ణి గుర్తించాడు.

బొబ్బిలి కోటలో జరిగిన ఈ బొబ్బిలి వెలమ వీరుల వీరమరణాలు, స్త్రీల ప్రాణా హుతి తెలుగు ప్రాంతం యావత్తు అనేక బుర్ర కథలకు స్ఫూర్తినిచ్చింది.

**పెద విజయరామరాజు హత్య:**

యుద్ధం ముగిసిన తర్వాత మూడవ రాత్రి, విజయరామరాజు తన శిబిరంలో నిద్రిస్తుండగా ఇద్దరు సాయుధులు దేవులపల్లి పెద్దన్న, బుద్ధిరాజు వెంకయ్య శిబిరానికి కాపలా ఉండగా తాండ్ర పాపారాయుడు శిబిరంలోకి ప్రవేశించారు. నిద్రిస్తున్న విజయ రామరాజు గుండెలపై కూర్చుని పులి పులి పులి బొబ్బిలి పులి అని అరుస్తూ ఒక్కసారే తన వద్ద ఉన్న బాకుతో పొడిచి చంపారు. మొదటి పోట్ల తరువాత విజయరామరాజు అరిచిన అరుపులకు అతడి అనుచరులు వచ్చి ఆ ఇద్దరిపై కాల్పులు జరిపారు. అప్పటికే రాజును 32 పోట్లు పొడిచాడు. అనుచ రులు లోపలికి రాగానే పాపారాయుడు లేచి నిలబడి 'ఇదిగో చూడండి,మా పగ తీరింది.' అని అన్నారు. తదుపరి సైనికుల కాల్పుల్లో పాపారాయుడు కూడా మరణించాడు. •

# నీట్‌లో ప్రతిభ చూపి ఎంబిబిఎస్ సీటు సాధించిన వర్ష



నల్గొండ జిల్లా, కనగల్ మండలంలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన నాగులవంచ వర్ష నీట్‌లో దేశవ్యాప్తంగా 7315 ర్యాంకు, స్టేట్ 206 ర్యాంకు సాధించింది. కొద్ది రోజుల క్రితం జరిగిన కౌన్సిలింగ్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబిబిఎస్‌లో సీటు సాధించింది. వర్ష తండ్రి శ్రీ నాగులవంచ శేఖర్ రావు వ్యవసాయం చేసుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి శ్రీమతి శోభ గృహిణిగా ఉంటూ పిల్లల చదువులో తన తోడ్పాటునందిస్తుంది.

చిన్ననాటి నుండి చదువులో చురుకుగా ఉండే వర్ష నల్గొండ పట్టణంలో ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి చదివి 9.8 జిపిఏ సాధించి పాఠశాల యాజమాన్యం మన్ననలకు పాత్రురాలైంది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివింది. ఇంటర్‌లో కూడా 1000 మార్కులకు గాను 985 మార్కులు సాధించింది. ఈ చిన్నారి మున్ముందు గొప్ప డాక్టర్‌గా సమాజసేవలో స్థిరపడాలని ఐవా కార్యవర్గం ఆకాంక్షించింది. •



## జాయింట్ రిజిస్ట్రార్‌గా సేవలందించిన

# శ్రీ గోన విష్ణు వర్ధన్ రావు

# పదవీ విరమణ మహోత్సవం

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ కూడా ఓ పండుగ లాంటిది. అదో సంప్రదాయంగా చేస్తే కొంతకాలం గుర్తుంటుంది. అందులో కొంత ప్రత్యేకతను జోడించి ఆర్భాటంగా జరిపిస్తే ఎప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఆ రెండవ కోవలోకే వస్తుంది జాయింట్ రిజిస్ట్రార్ శ్రీ గోన విష్ణువర్ధన్‌రావు పదవీ విరమణ మహోత్సవం. జూన్ 30న హైద రాబాద్‌లోని కెబిఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా ఆ ప్రాంత రోడ్ల వెంట ఎటుచూసినా నిలువెత్తు స్వాగత ఫ్లెక్సీలు, ముఖ్యమైన రాజకీయ నాయకుల పదవుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని తలపెట్టేలా ఆకర్శింపబడింది.

ఆనాటి కార్యక్రమంలో అతిథులుగా పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉద్యోగ నాయకులతోపాటు విష్ణు వర్ధన్‌రావు బంధుమిత్రులు ఈ ఆత్మీయ సత్కారంలో పాల్గొని పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలందజేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వారంతా విష్ణువర్ధన్ రావు 33 ఏళ్ళ ఉద్యోగ ధర్మాన్ని, సేవలను కొనియాడుచు వారి విశాల హృదయాన్ని, సహాయ గుణాన్ని ప్రశంసించారు.

అతిథిగావిచ్చేసిన శాసనభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ శ్రీ విష్ణువర్ధన్ రావు జన్మదినాన్ని, పెళ్లి రోజును గుర్తు చేస్తూ తెలంగాణ సాధన ప్రణాళికా రూపకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ పుట్టినరోజు శ్రీ విష్ను పుట్టిన రోజు ఒక్కటే కావడం విశేషం. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర అవతరణరోజు వారి పెళ్లి రోజు కావడం ముదావహం. ఆ విధంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి గుర్తింపు పొందిన వీరికి ఆ రెండు రోజులను గుర్తు చేసుకొనక తప్పదని అన్నారు. శ్రీ విష్ణువర్ధన్ రావు పదవీవిరమణ తర్వాత కూడా తన సేవలు ఈ సమాజానికి అవసరం కాబట్టి వారు రాజకీయాల్లోకి రావాలి. ఒక రాజకీయ నేతగా ఎదగాలని ఆకాంక్షించారు.



నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం, పెద్దవూర మండంలోని బసిరెడ్డిపల్లికి చెందిన స్వర్గీయ నర్సింహారావు, యాదమ్మల పుత్రుడుగా 1961 ఆగష్టు 6న జన్మించాడు. బాల్యం బసిరెడ్డిపల్లిలో జరిగినా చదివిందిమాత్రం హైదరాబాద్ లోనే. తాను 9వ తరగతి చదువుతున్న సమయంలోనే తెలంగాణ తొలిదశ ఉద్యమం రావడం, దాంతో జై తెలంగాణ అంటూ పిడికిలి బిగించడం జరిగిపోయాయి. స్కూల్ ఫైనల్ నల్గొండలో పూర్తి చేసి అక్కడే ఇంటర్, డిగ్రీ అనిపించుకున్నాడు. 1983లో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో అడుగుపెట్టి పిజిలో చేరడమే కాకుండా స్టూడెంట్స్ యూనియన్‌లో చురుకైన పాత్ర పోషించాడు. తండ్రి నుండి అబ్బిన కష్టపడేతత్వం,కలుపుగోలుతనం, అమ్మ నేర్పిన ప్రేమ, దయాగుణాలు అలవడడంతో 'జ్ఞానం శీలం ఏకత' అనే తత్వం తనను విద్యార్థి రాజకీయాలవైపు మళ్లించింది. అంతకుముందే 1977లో ఆర్ఎస్ఎస్ ముఖ్యశిక్షక్‌గా పని చేసిన అనుభవమున్న వ్యక్తిగా నల్గొండ నాగార్జున డిగ్రీ కాలేజీలో ఉన్నప్పుడు ఏబివిపి జాయింట్ సెక్రటరీగా పనిచేసి పలు కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయగలిగాడు. పిజి తర్వాత 1986లో ఏవి కాలేజీలోని ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు పాఠాలు చెప్పి పార్ట్ టైం లెక్చరర్ అనిపించుకున్నాడు. అప్పుడే గ్రూప్స్‌కు ప్రిపేర్ కావడం జరిగింది. 1987లో డిఎస్‌సి ద్వారా రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం వచ్చింది. అదే ఏడాది గ్రూప్ 2 వలన లోకల్ ఫండ్ ఆడిటర్‌గా టిటిడిలో జాబ్ వచ్చింది. అయినా జూన్ 30న రిజిస్ట్రేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వఉద్యోగిగా ప్రస్థానాన్ని ప్రారంభించి నల్గొండ, దేవరకొండ, కోదాడలలో పని చేశాడు.

1991లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎక్జామ్‌లో టాపర్‌గా నిలిచి ఎస్ఐ కొరకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్నాడు. అయినా తాను గాడ్ ఫాదర్‌లా భావించే అప్పటి సబ్ రిజిస్ట్రార్ శ్రీ పాండురంగారావు సలహాతో అదే శాఖలో కొనసాగాడు. 1995 సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది సూర్యాపేట, నల్గొండలో విధులు నిర్వర్తించారు.

2007లో సబ్ రిజిస్ట్రార్‌గా ప్రమోషన్ పొంది కొత్తగా ఏర్పడిన బిబినగర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో మొట్టమొదటి సబ్ రిజిస్ట్రార్‌గా తన పుట్టిన రోజైన ఆగష్టు 6వ రోజు బాధ్యతలు చేపట్టాడు. అప్పటి వరకు ఎన్‌జిఓలుగా ఉన్న సబ్ రిజిస్ట్రార్స్‌కు ఆ రోజు గెజిటెడ్ హోదా లభించడం గమనర్హం. అంతకుముందు అదే శాఖలో ఉండి హోదా కొరకు ప్రయత్నం చేసిన వారిలో కీలకపాత్ర పోషించి కొలనుపాక విజయభాస్కర్‌తో కలిసి నాటి మంత్రివర్యులు జువ్వాడి రత్నాకర్ రావు చొరవతో జీఓ జారీ చేయించగలిగాడు. అక్కడ అందులోనే గ్రేడ్ వన్ ప్రమోషన్ పొంది కుత్బుల్లాపూర్, ఉప్పల్, మూసాపేటలలో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.





ఆ తర్వాత ప్రమోషన్ పొంది తన స్వంత జిల్లాలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా చేరి జన్మభూమి ప్రజలకు సేవలందించాడు. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నా అప్పుడప్పుడు స్వంతూరు వెళ్లి వ్యవసాయం చేసుకుంటూ గ్రామ సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కరింప జేయడం, గుడికి, బడికి విరాళాలు అందించడం జరిగింది.

చిన్ననాటి నుండి నాయకత్వ లక్షణాలు కలిగిన శ్రీ విష్ణువర్ధన్ రావు విద్యార్థిదశలోనే కాకుండా ఉద్యోగంలో చేరిన తర్వాత నల్గొండ జిల్లా టిఎన్‌జిఓ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలోనే రిజిస్ట్రేషన్ ఎంప్లయిస్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. 2011 లో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ గెజిటెడ్ అసోసియేషన్ ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆనాడు జూబ్లీహాల్లో జరిగిన సమావేశానికి శ్రీ కెసిఆర్, ప్రొఫెసర్ కోదండరాం, శ్రీ స్వామిగౌడ్, శ్రీ శ్రీనివాస్ గౌడ్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను ఏక తాటిపై నడిపించి ఉద్యమానికి ఊతమిచ్చి రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్స్ అన్ని బంద్ చేయించడంలో ముఖ్యపాత్ర పోషించారు. 2007 నుంచి కేసీఆర్‌కు దగ్గరై విరాభిమానిగా దీక్షా సమయంలో అండగా ఉన్నాడు. 2014లో టిజిఓ సెంట్రల్ అసోసియేషన్ కోశాధికారిగా సేవలందించారు. 2017లో యునైటెడ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టి విశిష్ట సేవలందించారు. స్వగ్రామంలో పేదరికాన్ని కళ్లారా చూసిన వ్యక్తిగా కష్టాల్లోనున్న వారికి చేతనైనంత సహకరించే గుణం వీరిది. పేద విద్యార్థుల చదువుకు కూడా ఆర్థికంగా సహకరించి చదివించిన వ్యక్తిగా గుర్తింపు ఉంది. సహృదయంతో స్పందించే వీరి దయాగుణాన్ని బట్టి వీరి సహచరులు భోళా శంకరుడు అంటారు.

వీరి కుటుంబ విషయానికి వస్తే తన జీవితంలోకి సహధర్మచారిణిగా ప్రవేశించిన ప్రవీణ తన ప్రేమానురాగాలతో పాటు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటు అన్నివిధాల ప్రోత్సహించిందని తానే స్వయంగా చెబుతారు. వారికి ఇరువురు సంతానం కూతురు పవిత్ర ఇంజనీరింగ్ చేస్తుండగా, కుమారుడు ప్రతీక్ టెన్త్ క్లాస్‌లో ఉన్నాడు. ఇక తమ్ముడు వివేక్‌రావు అన్నబాటలోనే నడిచే తమ్ముడిగా ఉంటూ న్యాయవృత్తి చేపట్టినా ప్రస్తుతం రాజకీయంగా వైస్ ఎంపిపిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు.

తన పదవీ విరమణోత్సవంలో వక్తలు కోరినట్లుగా ఈ గోన విష్ణువర్ధన్ రావు తన తదుపరి ప్రస్థానాన్ని ప్రజలకొరకు ప్రజా ప్రతినిధిగా ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రజలకు సేవలందిస్తారని ఆశించవచ్చు. •




గోన విష్ణువర్ధన్ రావు గారి
పదవీ విరమణ
మహోత్సవం
తేది 30-06-2019
వేదిక : కెబిఆర్ గార్డెన్స్, సహారా రోడ్,
మన్సూరాబాద్.


ARUNA STUDIO
BARKATPURA
9949815656, 9866882224.




ARUNA STUDIO
BARKATPURA
9949815656, 9866882224.


ARUNA STUDIO
99494-61333, 96030-04999.


తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ


BARKATPURA
9949815656, 9866882224.



పదవీ విరమ
ARUNA STUDIO
BARKATPURA
9949815656, 9866882224.


ARUNA STUDIO
BARKATPURA
9949815656, 9866882224.


ధికారులు కేం సంఘం, ఛైర్మన్, రిజిస్ట్రేషన్ సం

## ప్రముఖ విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి...

# డా॥ వెలిచాల కొండల్ రావు



**సిరులు పండే జీవగడ్డ, సహజ వనరుల రత్నగర్భ, కవులు, కళాకారులు, మేధావులు, తత్త్వవేత్తలు, పరిశోధకులు, విద్యావేత్తలెందరికో జన్మనిచ్చిన పుణ్యభూమి కరీంనగర్ జిల్లా. ఈ జిల్లా గడ్డపై పుట్టిన జాతి గర్వించే ముద్దుబిడ్డ డా॥ వెలిచాల కొండల్ రావు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి, ప్రిన్సిపాల్ కొండల్ రావుగా ఖ్యాతికెక్కిన బహుముఖ ప్రజ్ఞాశాలి వారి లోపలి కోణం.. మీకోసం...**

1932 జులై 21న కరీంనగర్ జిల్లా గుండిగ్రామంలో సామాన్యరైతు కుటుంబానికి చెందిన వెలిచాల కేశవరావు, శ్రీమతి రాధాబాయి దంపతులకు జ్యేష్ఠ సంతానంగా జన్మించిన డా॥ వెలిచాల కొండల్ రావు తెలంగాణ ప్రాంతానికి ప్రిన్సిపల్ కొండల్ రావుగా సుపరిచితులు. విద్యావేత్తగా, స్వాతంత్ర్య సమర యోధునిగా, రచయిత, అనువాదకులుగా, జర్నలిస్టు, తత్వవేత్తగా వీరికి పేరుంది.

బోధనారంగంలో దాదాపు 40 ఏళ్ళ సుదీర్ఘ అనుభవం ఉన్న డా॥ కొండల్ రావు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి మాస్టర్ ఆఫ్ కామర్స్‌లో పట్టభద్రులు. 1957లో వీరికి నిర్మలాదేవితో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమారుడు ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. డా॥ వెలిచాల కొండల్ రావు టర్కీ, థాయ్‌లాండ్, సింగపూర్, లండన్, అమెరికా దేశాలలో పర్యటించారు.

గతంలో వీరు తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్‌గా, కరీంనగర్ శాతవాహన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఎస్ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల కరీంనగర్ ప్రిన్సిపాల్‌గా, గవర్నమెంట్ సిటీ కాలేజ్ హైదరాబాద్, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజి కరీంనగర్, గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ జగిత్యాల ప్రిన్సిపల్‌గా పని చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ సిండికేట్ మెంబర్‌గా, ఉస్మానియా విశ్వవిద్యాలయ సెనేట్ మెంబర్‌గా, ఓయు అకాడమిక్ కౌన్సిల్ సభ్యునిగా, ఓయు అకాడమిక్ రిపార్మ్స్ కమిటి సభ్యులుగా, తెలుగు విశ్వవిద్యాలయ వ్యవస్థాపక కమిటి కో-ఆర్డినేటర్‌గా, తెలుగు అకాడమీ ప్రచురించే తెలుగు మాస పత్రికకు చీఫ్ ఎడిటర్‌గా సేవలందించారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లోని సిస్టర్ నివేదిత ఫౌండేషన్ ఛైర్మెన్‌గా, విశ్వనాథ సాహిత్య పీఠం ఛైర్మెన్‌గా, ఫోరం ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ గౌరవ వైస్ ఛైర్మెన్‌గా, సిస్టర్ నివేదిత ప్రొఫెషనల్ స్టడీస్






గౌరవ ఛైర్మన్‌గా, బిజినెస్ విజన్ చీఫ్ ఎడిటర్‌గా, జయంతి పత్రిక ఎడిటర్‌గా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ న్యూఢిల్లీకి శాశ్వత సభ్యునిగా, పోయట్రి సొసైటి ఆఫ్ ఇండియా శాశ్వత సభ్యునిగా, పోయట్రి సొసైటి హైదరాబాద్ శాశ్వత సభ్యుడిగా వివిధ హోదాలలో సేవలందిస్తున్నారు.

ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఆంగ్లభాషలో ఐ ఫీల్,ఐ రిమెంబర్, ఐడియాస్ ఆర్ గోల్డ్, బాల గంగాధర్ తిలక్ రచించిన అమృతం కురిసిన రాత్రి, పట్టాభి రాసిన రాగాల డజన్ పుస్తకాలను అనువదించారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషలలో ఎన్నో పుస్తకాలను రచించిన గొప్ప రచయితగా డా॥వెలిచాల కొండల్ రావుకు పేరుంది.

అవార్డులు: అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన వరల్డ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్ వారు డి.లిట్‌తో సత్కరించారు. ఎడ్యుకేషన్, లిటరేచర్‌లో వీరి సేవలకుగాను మైకేల్ మధుసూదన్ దత్ అవార్డునందుకొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవార్డు, థాయిలాండ్, ఇస్తాంబుల్‌లలో జరిగిన వరల్డ్ పోయట్స్ కాంగ్రెస్‌లో ప్రశంసా పత్రలందుకొన్నారు.

బోధన, చదవడం, వ్రాయడం, అనువదించడం, ప్రయాణించడం, గార్డెనింగ్, సంగీతం, వినడం డా॥ వెలిచాల కొండల్ రావు హాబీలు. వీరి తండ్రి స్వర్గీయ వెలిచాల కేశవరావు రచయితగా, రాజకీయవేత్తగా గుర్తింపు ఉంది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. వెలమ సామాజిక వర్గానికి వన్నె తెచ్చిన డా॥ వెలిచాల కొండల్ రావును ఐవా కార్యవర్గం అభినందిస్తుంది. •

## దేవరకొండ పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం దేవరకొండ డివిజన్‌కు గత నెలలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన శ్రీ అల్రాడి దివాకర్ రావు, అడ్వకేట్ ఎంపికైన కార్యవర్గాన్ని ప్రకటించారు. 2019-22 కాలానికిగాను ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో గౌరవ అధ్యక్షులుగా శ్రీ మాధవరం వెంకట రమణారావు, అధ్యక్షులుగా శ్రీ పొనుగోటి జనార్ధన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రావు కృష్ణకిషోర్ రావు, కోశాధికారిగా శ్రీ ఆవునూరు వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యక్షులుగా శ్రీ మాధవరం శ్రీనివాస రావు, శ్రీ కటికనేని భాస్కర్ రావు, శ్రీ దొంతినేని భగవంత రావు, శ్రీమతి మాధవరం సునితా జనార్ధన్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీ గుమ్మడపు నరసింహా రావు, శ్రీ ఉజ్జిని సురేందర్ రావు, శ్రీ దొంతినేని జనార్ధన్ రావు, శ్రీమతి నాగవరం ఊర్మిళ, కార్యవర్గ సభ్యులుగా శ్రీ పులిగిల్ల తిరుమల్ రావు, శ్రీ అవిరినేని శ్రీపతి రావు, శ్రీ వేముల గణేశ్వర్ రావు, శ్రీ నాగవరం నాగేశ్వర్ రావు, శ్రీ వెన్నమనేని యాదగిరి రావు, శ్రీ పొనుగోటి వెంకటేశ్వర్ రావు, శ్రీ ఉప్పుగంటి ప్రశాంత్ రావు, శ్రీ మాదవరం గోవర్ధన్ రావు,శ్రీ అవిరినేని శశిపాల్ రావు, శ్రీమతి బాణాల ద్రౌపతమ్మ, శ్రీ పులిగిల్ల గోవర్ధన్ రావులు ఎన్నికయ్యారు.

పద్మనాయక వెలమ సంఘం దేవరకొండ వారి 3వ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆగష్టు 25న సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో దేవరకొండ ప్రాంత వెలమ ప్రజాప్రతినిధులను, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచ్, ఉప సర్పంచ్‌లను ఘనంగా సత్కరించడం జరిగింది. •

# కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు



## వార్షిక సర్వసభ్య సమావేశం

తేది జులై 07, 2019 ఆదివారం రోజున ఉదయం 11 గంటలకు పద్మ నాయక వెలమ సంఘం, కరీంనగర్ వార్షిక సర్వసభ్య సమావేశం అధ్యక్షులు శ్రీ జువ్వాడి రంగారావు అధ్యక్షతన పద్మ నాయక కళ్యాణ మండపం నెం. 1 హాలు లో నిర్వహించబడినది.

ఉపాధ్యక్షులు శ్రీ బుద్ధినేని నర్సింగ రావు గౌరవ సభ్యులకు స్వాగతం పలి కారు. అనంతరం దివంగతులైన శాశ్వత సభ్యులకు సంతాపము తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీ జువ్వాడి రంగారావు మాట్లాడుతు సభ్యుల సూచనలనుపాటిస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధుల ఆశ్ర మం, బాలికల వసతి గృహంలో సదుపా యాలు మెరుగుపర్చడంతో పాటు మెరు గైన సేవలందిస్తున్నామన్నారు. గ్రేవీ యార్డును మరింత అభివృద్ధి చేస్తామ న్నారు. పద్మనాయక వెలమ సంఘం సంక్షేమానికి మేమంతా కట్టుబడి ఉన్నా మని పునరుద్ఘాటించారు.

ఆతర్వాత ప్రధాన కార్యదర్శి శ్రీ బల్మూరి ప్రసాద్ రావు వార్షిక నివేదిక సభకు సమర్పించినారు. కోశాధికారి శ్రీ బుద్ధినేని గోపాల్‌రావు2018-19 ఆర్థిక సంవత్సర ఆదాయ వ్యయములు సభకు వివరించారు.

హాజరైన సభ్యులందరికీ భోజన సదుపాయము కల్పించబడింది.

ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిలతో పాటు ఉపాధ్యక్షులు శ్రీ బుద్ధినేని నర్సింగ రావు, సంయుక్త కార్యదర్శి శ్రీ గండ్ర కమలా కర్ రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ గండ్ర రఘునాథ్ రావు, శ్రీ పీచర నరేందర్ రావు, శ్రీ బోయినిపల్లి అశోక్‌రావు, శ్రీ పొల్సాని జగదీశ్వర్ రావు శ్రీ సుంకిశాల గోపాల్ రావు, శ్రీ సాగి సతీష్ రావు, శ్రీ ఆలూరి ఆనంద్‌రావు, శ్రీ వంగపల్లి వెంకట నారాయణ రావు, శ్రీ బోయిని పల్లి సూర్యకుమార్, శ్రీ గండ్ర భాస్కర్ రావు, శ్రీమతి బోయినిపల్లి గీత, శ్రీమతి చెన్నమనేని శ్రీలత, పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పద్మనాయక వెలమ సంఘం కరీం నగర్ వారి ఆధ్వర్యంలో ఆగష్టు 15, 2019 గురువారం స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చడం జరిగినది. ఉదయం 8:30 నిమి షాలకు బాలికల వసతి గృహంలో సంస్థ అధ్యక్షులు శ్రీ జువ్వాడి రంగారావు పతా కావిష్కరణ చేశారు. జాతిపిత మహాత్మా గాంధికి జై భారత్ మాతాకి జై నినాదా లతో ప్రాంగణమంతా మార్మోగింది. అనంతరం విద్యార్థినులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేయడం జరిగినది.

ఉదయం 8:45 నిమిషాలకు పద్మ నాయక వెలమ సంఘం కార్యాలయం లో పతాకావిష్కరణ గావించారు. అనం తరం పద్మనాయక వృద్ధుల ఆశ్రమము ఇరుకుల్ల నందు పతాకావిష్కరణ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేయడం జరిగినది. ఈ జెండా వందన కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులందరు పాల్గొన్నారు.



# నైతిక విలువలే పునాదిగా ఎదిగిన జువ్వాడి నారాయణ రావు



**కష్టించే తత్వం, పనిలో నిజాయితీ, కార్యదీక్షలో పట్టుదల, సేవాభావం, నైతిక విలువల సమాహారం స్వర్గీయ జువ్వాడి నారాయణ రావు జీవితం. పుట్టింది సామాన్య రైతు కుటుంబంలో. ఆ రైతన్నల సేవలోనే దాదాపు 28 ఏళ్ళ పాటు తనదైన ముద్రవేసి ఉన్నతాధికారులతో శభాష్ అనిపించుకున్న వెలమ ఆణిముత్యం. అహాన్ని, అధికార దర్పాన్ని వీరు ఏనాడు ప్రదర్శించలేదు. కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దిన మార్గదర్శి, తన జీవన యానంలో ఒక్కొక్క మెట్టు పైకెక్కారే తప్ప వెనుతిరిగి చూడలేదు. సహకార రంగానికే వన్నె తెచ్చిన స్వర్గీయ జువ్వాడి నారాయణ రావు మృతి పట్ల ఐవా కార్యవర్గం, వెలమ వైజయంతి ఘన నివాళులర్పిస్తుంది.**

కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామంలో స్వర్గీయ జువ్వాడి నర్సింగ రావు, రాధమ్మ దంపతులకు 1925 అక్టోబర్ 9న జన్మించిన శ్రీ జువ్వాడి నారాయణ రావు 2019 ఆగష్టు 19న పరమపదించారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన వీరు తన జీవనయానంలో నైతిక విలువలే పునాదిగా ఎదిగారు.

1955లో సహకార బ్యాంకులో అకౌంటెంట్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో చేరిన వీరి అంకిత భావం, కష్టించి పనిచేసేతత్వం, క్రమ శిక్షణ, సమర్ధతలకు నిదర్శనంగా కేవలం 9 ఏళ్ళ కాలంలోనే మేనేజర్, అసిస్టెంట్ సెక్రటరీగా పదోన్నతులు పొందగలిగారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ వీరి పని తీరును, కష్టించి పనిచేసే తత్వాన్ని, నీతి, నిజాయితీ, అంకిత భావాన్ని దృష్టిలో ఉంచుకొని స్వర్గీయ జువ్వాడి నారాయణ రావును 1964లో కెడిసిసి బ్యాంకు సెక్రటరీగా నియమించింది. నిజానికి ఈ పదవిని ప్రభుత్వ కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ మాత్రమే నిర్వహించేవారు. తెలంగాణ రీజియన్‌లో మొదటిసారి తన సమర్ధతకు చిహ్నంగా స్వర్గీయ జువ్వాడి నారాయణ రావు ఈ అవకాశాన్ని దక్కించుకొన్నారు. 1979లో రాష్ట్ర కేడర్‌లోకి వెళ్ళిన వీరు ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు జనరల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. దాదాపు సహకార రంగంలో 28ఏళ్ళపాటు నీతి,నిజాయితీ, పారదర్శకతతో కూడిన సేవలందించి జనరల్ మేనేజర్ హోదాలో 1983లో పదవీ విరమణ చేశారు. వీరు సహకార రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు స్వల్పకాలిక ఋణాలు ఇప్పించి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించారు.

1943వ సంవత్సరంలో స్వర్గీయ సత్యమ్మతో వీరికి వివాహం జరిగింది. 2000 సంవత్సరంలో స్వర్గీయ జువ్వాడి నారాయణ రావు సహధర్మచారిణి సత్యమ్మ కన్నుమూసింది. స్వర్గీయ జువ్వాడి నారాయణ రావు సత్యమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్ళున్నారు. వీరిలో పెద్ద కుమారుడు శ్రీ జువ్వాడి నర్సింగ రావు, చిన్న కుమారుడు శ్రీ జువ్వాడి వినాయక్ రావులు అమెరికాలో చాలా ఏళ్ళు ఉన్నారు. ముగ్గురు కూతుళ్ళు శ్రీమతి అరుణ-మధుసూదన్ రావు, శ్రీమతి భారతి-కిషన్ రావు పుల్లూరి, శ్రీమతి గిరిజ -మోహన్ రావు తంగెడలు అమెరికాలో స్థిరపడ్డారు. వీరి మనుమలు, మనుమరాండ్లు, మునిమనుమలు అంతా ప్రవాస భారతీయులే కావడం విశేషం. •





## పంచాయితీరాజ్ శాఖామాత్యులు శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు చేతులమీదుగా

# కపిల డెయిరీ వారి రిటైల్ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభం

తెలంగాణలో క్షీరవిప్లవం జోరందుకున్న తరుణంలో కపిల డైరీని తిమ్మారెడ్డిపల్లిలో ప్రారంభించి వినియోగదారులకు నాణ్యమైన పాలను అందించే అవకాశం కల్గిందని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

కపిల డెయిరీ ఫారంను హైదరాబాద్ నుండి కరీంనగర్ రాష్ట్ర రహదారిపై 80 కి.మీ. రాయి వద్ద తిమ్మారెడ్డి పల్లి, గ్రామ శివారు, సిద్ధిపేట జిల్లాలో 2013వ సంవత్సరంలో నెలకొల్పడం జరిగింది. ఈ డెయిరీ ఫారంలో 1500 పాడి ఆవులను పెంచడానికి అవసరమైన అన్ని రకాల వసతులను శాస్త్రీయ పద్ధతుల్లో కల్పించడం జరిగింది. ప్రతి ఆవుకు ప్రపంచ పశు ఆహార నిపుణుల ఆధ్వర్యంలో చక్కటి పోషక విలువలు కలిగిన దాణాను ఫారం ఆవరణలో ఏర్పాటు చేసిన అధునాతన ఫీడ్ మిల్‌లో తయారు చేసి టిఎంఆర్ టెక్నాలజీతో ఇవ్వడం జరుగుతున్నది. తద్వారా పాడి ఆవుల ఆరోగ్య పరిరక్షణ జరిగి చక్కటి పోషక విలువలతో కూడిన స్వచ్ఛమైన పాలను ఉత్పత్తి చేయటం జరుగుతున్నది. పాడి ఆవులకు యాంటిబయాటిక్స్, హార్మోన్లు మరియు ఇతర రసాయనాలు ఇవ్వడం ఈ ఫారంలో నిషేధించడమైనది. ఆవుల ఆరోగ్య సంరక్షణను అనుభవజ్ఞులైన పశువైద్య బృందం నిత్యం పర్యవేక్షిస్తుంది. ఖచ్చితమైన జీవ సంరక్షణ (బయోసెక్యూరిటీ) పద్ధతుల ద్వారా ఫారంలోకి మనుషులు మరియు వాహనాల ప్రవేశాన్ని నియంత్రించడం జరుగుతున్నది. డెయిరీ ఫారం యొక్క మొత్తం విద్యుత్ అవసరాలకు కావాలసిన విద్యుత్తును ఫారంలోని ఆవుల పేడ ద్వారా






వచ్చే బయోగ్యాస్ ద్వారా ఉత్పత్తి చేసి విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించటం జరిగినది. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో ఉపయోగించే అధునాతన "రోటరీ మిల్కింగ్ ఫార్లర్" ద్వారా 6 నిమిషాల్లో 50 పాడి ఆవుల పొదుగు నుండి నేరుగా చిల్లింగ్ ట్యాంక్‌లోకి ప్రవేశించేలా 'పాలు పితికే' ప్రక్రియను మన దేశంలో మొదటిసారిగా కపిల డెయిరీ ఫారంలో ఏర్పాటు చేయటం జరిగింది. ఇట్టి 'రోటరి మిల్కింగ్ పార్లర్' ను అనుసంధానిస్తూ 'డెలవాల్, అమెరికా' వారి సాఫ్ట్‌వేర్ సాంకేతికతతో ప్రతి షెడ్‌లో అమర్చిన సెన్సర్లు మరియు ప్రతి ఆవుకు వేసిన ట్రాన్స్‌పాండర్ ద్వారా ప్రతి ఆవు యొక్క ఆరోగ్యం, బరువు, పాల దిగుబడి, పాల స్వచ్ఛత సంబంధిత అంశాల సమాచారం ఆటోమెటిక్‌గా రికార్డ్ అవడం జరుగుతుంది. అట్టి సమాచారాన్ని సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు విశ్లేషించి పశువైద్య బృందానికి అందించటం ద్వారా ఆవుల యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరిశుద్ధమైన, స్వచ్ఛమైన చక్కటి పోషక విలువలతో కూడిన పాలను ఉత్పత్తి చేయటం జరుగుతున్నది.

నైతికత లోపించిన వ్యాపార దృక్పథంలో పాల పొడిని రీకాంస్టిట్యూట్ చేసిన పాలను విక్రయించటం, చిక్కదనం కోసం రసాయనాలు కలపడం, పాలు చెడిపోకుండా దీర్ఘకాల నిల్వకోసం ప్రిజర్వేటివ్స్ రూపంలో రసాయనాలు కలపడం, పూర్తి కృత్రిమ పాలను తయారు చేయడం నేటి సమాజంలో సర్వసాధారణమైనది. నేడు మార్కెట్‌లో విక్రయించే పాలల్లో 70% కంటే అధికంగా పై కోవలోకి వస్తాయి. ఇటువంటి అనైతిక వ్యాపార ధోరణిలో జరుగుతున్న పాల ఉత్పత్తి మరియు విక్రయాలను దృష్టిలో ఉంచుకొని, పూర్తి నైతికతతో తల్లిపాలలోని పరిశుద్ధత, ప్రాకృతికత, స్వచ్ఛతతో సమానంగా ఆవు పాలను ఉత్పత్తి చేయాలనే ఉద్దేశ్యంతో కపిల డెయిరీ ఫారంను ఏర్పాటు చేయడం జరిగినది.

**ఇతర పాలు :** పాల ఉత్పత్తి వీరు చేయకుండా వివిధ ప్రాంతాల నుండి, వివిధ వ్యక్తుల నుండి కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి విక్రయిస్తారు. ఏ ఫారం నుండి లేదా ఏ ఆవు నుండి పాలు ఉత్పత్తి అయినాయో చెప్పలేరు. ఆవు పొదుగు శుభ్రత, పాలు పితకటం నుండి పాల స్వచ్ఛతలో వీరికి ఎలాంటి నియంత్రణ ఉండదు. సేకరించిన పాలలోని వెన్నను వేరు చేసి, వారు ప్యాకెట్లపై ముద్రించిన వెన్న శాతాలకు అనుగుణంగా వెన్న రహిత పాలకు వెన్నను కలుపుతారు. దీని వల్ల పాలకు ప్రాకృతకంగా ఉండవలసిన వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతాలు మరియు పోషక పదార్థాలు వీరి పాలలో ఉండవు. పాల ఉత్పత్తి వీరి చేతుల్లో ఉండదు కాబట్టి యాంటి బయోటిక్స్, హార్మోన్లు, ప్రిజర్వేటివ్స్ మరియు ఇతర రసాయన అవశేషాలు ఉండే అవకాశాలు మెండు.

**కపిల పాలు:** పాలఉత్పత్తి స్వయంగా మా ఫారంలోని ఆవుల నుండి చేయబడుతుంది. ఒకే ఫారంలోని ఆవులనుండి పాలు ఉత్పత్తి అవుతాయి. "రోటరీ మిల్కింగ్ పార్లర్" ద్వారా పరిశుద్ధమైన, స్వచ్ఛమైన పాలను శుభ్రపరచిన ఆవు పొదుగు నుండి చిల్లింగ్ ట్యాంక్‌లలోకి నేరుగా సంగ్రహించటం జరుగుతుంది. పాల నుండి వెన్నను వేరు చేయడం జరుగదు. కావున ప్రకృతి సిద్ధంగా పాలలో ఉండవలసిన వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతాలు మరియు పోషక పదార్థాలు కపిల పాలలో ఉంటాయి. యాంటి బయోటిక్స్, హార్మోన్లు, ప్రిజర్వేటివ్స్ మరియు ఇతర రసాయన అవశేషాలు ఉండవు.

పై ప్రత్యేకతలు కలిగిన కపిల డెయిరి పాల నుండి నెయ్యి, పన్నీరు, సుగంధ పాలు (ఫ్లేవర్డ్ మిల్క్), పెరుగు మొదలైన పాల పదార్థాలను పారదర్శకంగా అందరూ చూసే విధంగా తయారు చేయటం జరుగుతుంది. కపిల డెయిరీ ఫారంలో ఉత్పత్తి అయ్యే పరిశుద్ధమైన, స్వచ్ఛమైన, చక్కటి పోషక విలువలతో కూడిన పాలను, అట్టి పాలనుండి తయారు చేసిన పాల పదార్థాలను ప్రజలకు నేరుగా అందించాలనే సదుద్దేశ్యంతో మా డెయిరీ ఫారం ఆవరణలో ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయడం జరిగినది. మా పాలు మరియు పాల పదార్థాలలోని శ్రేష్ఠతని గుర్తెరిగి మీ ఆరోగ్య పరిరక్షణలో ముందడుగు వేస్తారని ఆశిస్తున్నాము. •

# శ్రీమతి జగ్గన్నగారి పద్మకు 'వే' ఫౌండేషన్ పురస్కారం




**స్వశక్తిపై ఎదిగి, భర్త ప్రోత్సాహంతో డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో మంచి గుర్తింపు పొందిన నేటితరం మహిళా మణిపూస, భావితరాల మహిళలకు స్ఫూర్తిప్రదాత శ్రీమతి జగ్గన్నగారి పద్మ. డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా 23 ఏళ్ళ సుదీర్ఘ అనుభవంలో దాదాపు 12వేల మంది పైబడి మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడమే కాకుండా వారందరికి లైసెన్సులు కూడా ఇప్పించిన ఘనత వీరికే దక్కుతుంది. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన శ్రీమతి జగ్గన్నగారి పద్మ దృఢదీక్ష, పట్టుదల, అన్నింటికి మించి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయడం వల్లే ఎంతో మంది మహిళల్లో నూతనోత్తేజాన్ని నింపగలిగారు. వారి జీవనగమనానికి రాచబాటలు వేశారు. శ్రీమతి జగన్నగారి పద్మ చేసిన సేవలకు గుర్తింపుగా అఖిల భారత మహిళా సమ్మేళనంలో 'వే' ఫౌండేషన్ ద్వారా పురస్కారాన్ని అందుకొన్నారు.**

రాజన్న సిరిసిల్ల జిల్లా లింగంపేట గ్రామానికి చెందిన స్వర్గీయ జగ్గన్నగారి నారాయణ రావు, స్వర్గీయ లక్ష్మి దంపతులకు 1975 మే 15న కనిష్ట పుత్రికగా జన్మించిన శ్రీమతి జగ్గన్నగారి పద్మ వృత్తిరీత్యా డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామం లింగన్నపేటలో పూర్తయ్యింది. కామారెడ్డిలో డిగ్రీ పూర్తిచేసిన వీరు హైదరాబాద్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్‌లో తెలుగు లిటరేచర్‌లో పిజి చేశారు. వీరికి కంది శంకర్ రావుతో వివాహమయ్యాక సహధర్మచారిణికి ఉన్న ఆసక్తిని గమనించి డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా స్థిరపడేందుకు ఎంతగానో ప్రోత్సహించారు. భర్త ఆశీర్వాదబలం, శ్రీమతి పద్మ పట్టుదలతో హైదరాబాద్ లోని విజయనగర్ కాలనీలో కనకదుర్గా మోటార్ డ్రైవింగ్ స్కూలును స్థాపించింది. ఈ స్కూలు ద్వారా ఎంతో మంది మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చింది. డ్రైవింగ్ శిక్షణలో దాదాపు 23 ఏళ్ళ సుదీర్ఘ అనుభవం ఉన్న శ్రీమతి పద్మ సేవలకు గుర్తింపుగా ఆగష్టు 31న విజయవాడలోని ఎంజి రోడ్డులో ఉన్న మురళి పార్క్ హోటల్ లో జరిగిన అఖిల భారత మహిళా సమ్మేళనంలో 'వే'ఫౌండేషన్ శ్రీమతి పద్మకు 2019 ఉమెన్ ఎక్సలెన్సీ, లీడర్‌షిప్ అవార్డును ప్రధానం చేసింది. ఈ అవార్డును అరకు పార్లమెంటు సభ్యులు శ్రీమతి మాధవి, అమలాపురం పార్లమెంటు సభ్యులు శ్రీమతి అనురాధ చేతుల మీదుగా అందుకొన్నారు.

**బాధ్యతను పెంచింది:** 2019 వే ఫౌండేషన్ ఉమెన్ ఎక్సలెన్సీ, లీడర్‌షిప్ అవార్డు పొందిన తర్వాత నా బాధ్యత మరింత పెరిగింది. మహిళా డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఈ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ అవార్డు రావడానికి నన్ను ఎళ్ళవేళలా ప్రోత్సహించి ఆశీర్వదించిన నా భర్త శ్రీకంది శంకర్‌రావుకు జీవితాంతం ఋణపడి ఉంటానన్నారు. నేటి సమాజంలో మహిళా స్వతహాగా ఏ వృత్తి చేపట్టాలన్నా భర్త సహకారం ఎంతైనా అవసరమన్నారు. తన కూతరు చి. పల్లవిరాయ్‌కి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు లభించడం నాకెంతో తృప్తిని, ఆనందాన్ని కల్గించిందన్నారు. వారి మాటల్లో చెదరని ఆత్మ విశ్వాసం, తరగని ఉత్సాహం కన్పించింది. 2019 ఉమెన్స్ ఎక్సలెన్సీ, లీడర్‌షిప్ అవార్డునందుకొన్న శ్రీమతి జగ్గన్నగారి పద్మను ఐవా కార్యవర్గం, వెలమ వైజయంతి అభినందిస్తుంది.

– జువ్వాడి అశోక్ రావు



# జగిత్యాల వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో హరితహారం



జగిత్యాల జిల్లా వెలమ సంక్షేమ మండలిలో అధ్యక్షులు శ్రీ వొద్దినేని పురుషోత్తమ రావు అధ్యక్షతన జరిగిన హరిత హారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు డా॥ మకునూరు సంజయ్ కుమార్ హాజరై మొక్కలు నాటడం జరిగింది. రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రిగారి 'పచ్చని చెట్టు – ప్రగతికి మెట్టు' అనే నినాదంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరంక్షించాలని కోరారు. భూతాపాన్ని తగ్గించడానికి మన చేతుల్లో ఉన్న ఒకేఒక్క పరిష్కారం మొక్కల పెంపక మేనని తెలిపారు.

అనంతరం గత స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించిన కుల బాంధవులైన జిల్లా పరిషత్ వైస్ ఛైర్మెన్ మరియు జిల్లా పరిషత్ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, సభ్యులను సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జెడ్పి వైస్ ఛైర్మెన్ శ్రీ హరిచరణ్ రావు, జెడిపిటిసి సభ్యులు శ్రీ శ్రీ కాసుగంటి రాజేందర్ రావు, శ్రీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, శ్రీమతి పునుగోటి ప్రశాంతి, ఎంపిపిలు శ్రీమతి మెన్నేని స్వర్ణలత, శ్రీమతి దోనకంటి ఉమాదేవి, మండల పరిషత్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ వొద్దినేని పురుషోత్తమ రావు, ఉపాధ్యక్షులు శ్రీ చిట్నేని రవికుమార్,శ్రీ సాగి రామా రావు,ప్రధాన కార్యదర్శి శ్రీ బోయినిపల్లి ఆనంద్ రావు, కోశాధికారి శ్రీ ఐనేని రవీందర్ రావు, సంఘటిత కార్యదర్శులు శ్రీ సాగి శ్రీధర్ రావు, శ్రీ బందారి దివాకర్ రావు, కార్యవర్గ సభ్యులు శ్రీ మెన్నేని శ్రీనివాస్ రావు, శ్రీ వక్రాల శ్రీనివాస్ రావు, శ్రీ అల్లాల హరిక్రిష్ణ రావు, శ్రీ అయిల్నేని కమలాకర్ రావు, శ్రీ మిట్టపెల్లి రాజేందర్ రావు, శ్రీ చిట్నేని రవికుమార్, మహిళా కార్యవర్గ సభ్యులు శ్రీమతి కొండపల్కుల వినిత, శ్రీమతి మెన్నేని మంజులలతో పాటు మాజీ అధ్యక్షులు శ్రీ ఎన్నమనేని రాజేశ్వర్ రావు, శ్రీ ముప్పాల రాంచందర్ రావు మరియు పెద్ద సంఖ్యలో వెలమ బంధువులు పాల్గొన్నారు. •



## ఓల్డ్ జగిత్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేయూత నిచ్చిన ప్రవాస భారతీయుడు ...

# డా॥ అయిల్నేని జగన్మోహన్ రావు



జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)కు పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ, ఆపి మాజీ అధ్యక్షుడు, జగిత్యాల మండలం, మోతె గ్రామస్తులు డా॥ అయిల్నేని జగన్మోహన్ రావు తన వంతుగా 3 లక్షల రూపాయలతో స్మార్ట్ క్లాస్ రూం ఏర్పాటుకు చేయూతనందించారు. ఇందులో ఇంటరాక్టివ్‌బోర్డ్, ప్రొజెక్టర్, కంప్యూటర్‌లు, సౌండ్ సిస్టమ్‌లు తదితర వస్తువులు ఉన్నాయి. ఈ డిజిటల్ క్లాస్ రూమును జగిత్యాల శాసన సభ్యులు డా॥ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దాత డా॥ జగన్మోహన్ రావును పలువురు అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే డా॥ సంజయ్ కుమార్ మాట్లాడుతూ చిన్ననాడు చదువుకున్న పాఠశాలకు తనవంతుగా సాయపడుతున్న డా॥ అయిల్నేని జగన్మోహన్ రావు అభినందనీయులన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పేద విద్యార్థులెందరో ఉన్నత స్థానంలో నిలిచారన్నారు. జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ అంటే తెలియనివారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎవరు ఉండరన్నారు. డా॥ అయిల్నేని జగన్మోహన్‌రావు 1999లో జగిత్యాల తొలి అంబులెన్స్‌కు రూ.5 లక్షల విరాళము అందించారన్నారు. ప్రతిమ ఆసుపత్రి సేవల ఏర్పాటులో జగన్మోహన్ రావు పాత్ర కీలకమన్నారు. రూ.30 లక్షల వ్యయంతో అత్యాధునిక అంబులెన్స్ అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మానసికంగా దృఢత్వం కలిగిన గొప్ప వ్యక్తి జగిత్యాల్‌కు ఏదో చేయాలనే తపనతో ముందుకెళ్తున్న వ్యక్తి శ్రీ జగన్మోహన్ రావు అన్నారు. ప్రభుత్వం సైతం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. తాము కూడా సర్కారు బడుల్లో చదివిన విద్యార్థులమే నన్నారు. పాఠశాలలో ఏ అవసరం ఉన్నా తన వంతు కృషి చేస్తాననీ, మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సాంకేతికత సాయంతో విద్యాబోధనలో గణనీయమైన మార్పులు వస్తాయనీ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులెందరో ఉన్నత స్థానంలో నిలిచారని తెలిపారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.

అనంతరం శ్రీ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) లోని ఉపాధ్యాయుల అంకిత భావాన్ని ప్రశంసించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా విద్యపైన దృష్టి పెట్టాలన్నారు. నైతిక విలువలు పాటించి అందరూ ఉన్నత స్థాయికి ఎదిగి మాతృభూమికి సేవ చేయాలన్నారు. అనంతరం దాతలను పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీ వెంకటేశ్వర్లు, డా॥ రంగారెడ్డి, ఆపి మాజీ అధ్యక్షులు శ్రీ మంచాల కృష్ణ, శ్రీ ఏవిఎల్ఎన్ చారి, శ్రీ సిరిసిల్ల శ్రీనివాస్, శ్రీ యాచమనేని కాశీరావు, శ్రీ అయిల్నేని సురేందర్ రావు, ఉపాధ్యాయులు శ్రీ బోయినిపల్లి ఆనంద్‌రావు, శ్రీ లక్ష్మణ్, శ్రీ దేవయ్య, శ్రీ రామానుజం, శ్రీ రవి, శ్రీ సురేందర్, శ్రీమతి రజిత, శ్రీమతి విద్య, శ్రీమతి అనితలతోపాటు విద్యార్థులు వారి తల్లి దండ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు. •

## పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి చైర్మెన్‌గా ...

# మేసినేని ఆనంద రావు నియామకం



విద్యాబోధన, పరిశోధన రంగాలలో తనదంటు ముద్రవేసిన ప్రొఫెసర్ శ్రీ మేసినేని ఆనంద రావు 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డిగ్రీలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. 1976లో రసాయన శాస్త్రంలో పిజి చేసిన వీరు డిస్టింక్షన్ సాధించారు. 1980లో ఫిజికల్ కెమిస్ట్రీ విభాగంలో డాక్టోరల్ డిగ్రీ పొందారు. 1979లో రసాయన శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన శ్రీ ఆనంద రావు 1996 ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. బోధనా రంగంలో 38 ఏళ్ళ అనుభవం ఉంది. వీరిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి చైర్మెన్‌గా నియమించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు 'ఐవా' కార్యవర్గం, వెలమ వైజయంతి ధన్యవాదాలు తెలియజేసింది.

రాజన్న సిరిసిల్లా జిల్లాలో మారుమూల గ్రామమైన నేరెల్ల శ్రీ ఆనంద్ రావు సొంతూరు. ప్రాథమిక విద్యాభ్యాసం సొంతూరులోనే పూర్తి చేశారు. తరువాత 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు సిద్ధిపేట ప్రభుత్వ స్కూల్లో, బిఎస్‌సి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివారు. పువ్వు పుట్టగానే వికసించినట్టు శ్రీ ఆనంద్ రావు స్కూల్‌కు వెళ్ళినప్పటి నుండి తోటి విద్యార్థుల కన్నా చదువులో మంచి ప్రతిభ కనబరిచేవారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన తనకు చదువుకోవాలనే పట్టుదల మరింత పెంచింది. ఆ పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో చదివి 1973 సం॥ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించారు. సహజంగా చిన్నప్పటి నుండి శ్రీ ఆనంద్ రావు ప్రతిభ, పాఠవాలతో ముందుండేవారు. అదే సమయంలో వరంగల్ ఆర్ఇసిలో ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. కానీ తన వద్ద 150 రూపాయలు ఫీజుకట్టే ఆర్థిక స్థోమత లేనందున ఇంజనీరింగ్ చేసే అవకాశం కోల్పోయారు. ఆయినా ఏ మాత్రం నిరుత్సాహం చెందలేదు. ఉస్మానియా యూనివర్సిటీ మొదటిసారి నిర్వహించిన పిజి ప్రవేశ పరీక్ష వ్రాసి ఎంఎస్‌సి కెమిస్ట్రీలో మంచి మార్కులు సాధించి యూనివర్సిటీలోనే పీజి పూర్తి చేశారు. తదనంతరం లెక్చరర్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. మొదటి పోస్టింగ్ బికనూర్ పిజి కాలేజీ. కొంతకాలం ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేసిన తర్వాత 1986లో ఓయూ రీడర్‌గా 1998లో ప్రొఫెసర్ అయ్యారు. ప్రొ. ఆనంద్‌రావు ప్రొఫెసర్‌గా యూజిసి, డిఎస్‌టి, సెమి కండక్టింగ్ పాలిమర్స్‌లో ప్రాజెక్ట్స్ వర్క్ పూర్తిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు నిర్వహించబడింది. యూనివర్సిటీలో ఆ కోర్సుకు సంబంధించిన ఆదరణ లేకపోవడంతో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను మూసివేయడం జరిగింది. రసాయన శాస్త్రంలో నిపుణులైన ప్రొ.ఆనంద్ రావును ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించిన బాధ్యతలు అప్పగించారు. దానికోసం అహర్నిశలు కృషిచేసి ఆ కోర్స్ ప్రయోజనాలను తిరిగి పునరుద్ధరించి, దానికి పూర్వవైభవం వచ్చేవిధంగా చేశారు.

ప్రొ. ఆనంద్ రావుకు ఏ పని అప్పగించినా నిష్టతో, నిబద్ధతతో తన వృత్తి నైపుణ్యాన్ని చాటుతారు. ఆయన వ్యక్తిత్వాన్ని, పని పట్ల ఉన్న ఆసక్తిని చూసి ప్రశంసించని వారుండరు. ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి దూర విద్యాకేంద్రం అభివృద్ధి కోసం డైరెక్టర్‌గా అహర్నిషలు విస్తృత సేవలందించారు. దూరవిద్యా కేంద్రం లోని అన్ని విభాగాలపైన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ సిబ్బంది సహకారంతో ప్రగతిపథంలో నడిపించారు. జాతీయ స్థాయిలో ఈ కేంద్రాన్ని ఉత్తమ ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యనందించే సరస్వతీ నిలయంగా తీర్చిదిద్దారు.

# యువతకు కల్పతరువు ఈ స్టడీ సర్కిల్

పోటీ పరీక్షలకు అందించే ఉచిత శిక్షణ నిరంతరంగా కొనసాగుతుంది. నిరుద్యోగ బీసీ యువతకు మెరుగైన శిక్షణ ఇవ్వడం కోసం ఈ స్టడీ సర్కిల్ కృషి చేస్తోంది. ప్రైవేట్‌కు దీటుగా అత్యంత నైపుణ్యం కలిగిన, బాగా అనుభవం ఉన్న అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తున్నాము. జిల్లాలోని అన్ని బిసి హాస్టళ్ల విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణతో పాటు యువతకోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని విద్యార్థులకు తగిన ప్రేరణనిస్తున్నాము. చైతన్యం కలిగిస్తున్నాము. త్వరలో విశాలమైన నూతన సొంత భవనంలో స్టడీ సర్కిల్‌లోకి అడుగు పెట్టబోతున్నాము.

– గోనె శ్రీలత, డైరెక్టర్
బిసి స్టడీ సర్కిల్ ఖమ్మం



ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు కల్పతరువులా మారింది ఖమ్మంలోని బిసి స్టడీ సర్కిల్. పదేళ్ల కిందట జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ఈ స్టడీ సర్కిల్ ఇప్పటి వరకూ ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ ఆదుకుంటోంది. వేలకు వేలు ఖర్చుచేసి పోటీ పరీక్షలకు చదవలేని విద్యార్థులకు ఈ అధ్యయన కేంద్రం వరంగా మారింది. ఖమ్మం బిసి స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొందడానికి ప్రభుత్వం సంవత్సరంలో పలుమార్లు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుంది. ఇందులో అర్హత సాధించిన వారికి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తుంది. బీసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు రిజర్వేషన్ ఆధారంగా సీట్లు రిజర్వ్ చేస్తారు. ఈ పోటీ పరీక్షలకు ప్రవేశ పరీక్ష రాయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్ష కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. మెరిట్ జాబితా ఆధారంగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు.

**పదేళ్ళుగా...** నిరుద్యోగ యువతకు వివిధ ఉద్యోగ, పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ ఉచితంగా ఇవ్వాలనే ఉద్దేశంతో 2010లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్‌ను నెలకొల్పారు. అప్పటి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ పోటీ ప్రవేశ, ఉద్యోగ పరీక్షలకు ఉచితంగా శిక్షణను అందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం దీనిని మరింత బలోపేతం చేసింది. పూర్తిస్థాయిలో అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంది. బిసి స్టడీ సర్కిల్ ద్వారా 17 రకాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తోంది.

**30 నుంచి 60 రోజుల శిక్షణ...** కోర్సు ఆధారంగా శిక్షణకాలం 30 రోజుల నుంచి 60 రోజుల వరకూ ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో విశేష అనుభవం కలిగిన అధ్యాపకులు బోధన చేస్తారు. వివిధ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన వారిలో ప్రత్యేక తర





గతులు నిర్వహించి మోటివేట్ చేయిస్తారు. బయోమెట్రిక్ ద్వారా హాజరును నమోదు చేస్తూ పారదర్శకతను పెంచారు. క్విజ్‌పోటీలు, ఓఎంఆర్ షీట్ ద్వారా వారాంతపు, మాసాంతపు పరీక్షలను కూడా నిర్వహించి సామార్థ్యాలు పరీక్షిస్తుంటారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం,టీ స్నాక్స్‌ను కూడా అందిస్తున్నారు. విశ్లేషణాత్మక, పూర్తిస్థాయి స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నారు.

**స్క్రీనింగ్ టెస్టు ద్వారా ఎంపిక...** స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందే అభ్యర్థులకు నియమ నిబంధనలను నిర్ణయించారు. శిక్షణ ఆధారంగా, ఇంటర్ డిగ్రీల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక చేపుకొని సన్నద్ధులను చేస్తారు. సివిల్ సర్వీసెస్ సహా మరికొన్నింటికి ఆన్‌లైన్ స్రీనింగ్ టెస్ట్ నిర్వహించి శిక్షణకు అర్హులను ఎంపిక చేస్తారు. శిక్షణ పొందే అభ్యర్థులు తప్పనిసరిగా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఆధారంగా ప్రక్రియను పూర్తి చేస్తారు. ఒక అభ్యర్థి ఒక్కసారి మాత్రమే ఉచితశిక్షణను వినియోగించుకోవాలి. బిసిలకు 75 శాతం, ఎస్సిలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

**వేలాదిమందికి ట్రైనింగ్...** 2010 నుంచి వేలాది మందికి శిక్షణ ఇచ్చి ఎందరినో ఉద్యోగార్థులుగా తర్చిదిద్దింది బిసి స్టడీ సర్కిల్. ఇప్పటి వరకు సివిల్స్, ప్రాథమిక పరీక్ష, గ్రూప్-2, గ్రూప్-4, బ్యాంక్ క్లర్క్, ఐబీపిఎస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, సిఆర్‌పిఎఫ్, పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ, విఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, డిఎస్సీ, గురుకుల, ఫారెస్ట్ ఆఫీసర్స్ తదితర ఉద్యోగాలకు శిక్షణ ఇస్తోంది. ఈ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న వందలాది మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించారు. ప్రభుత్వం గ్రూప్ పరీక్షలకు సంబంధించిన శిక్షణ ఇస్తున్నారు. ఆర్ ఆర్‌బి, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ సెక్టార్‌లలో ఉద్యోగాలకు సంబంధించిన ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా ఆన్‌లైన్ విధానం ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

**సివిల్ సర్వీస్ ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌కు 198 మంది హాజరు...**

తెలంగాణ రాష్ట్ర బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ కల్పించేందుకు స్క్రీనింగ్ టెస్టును నిర్వహించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఉచిత శిక్షణకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు 300 మంది అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోగా 198 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న తీరును బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్, ఐవా కార్యవర్గ సభ్యులు శ్రీమతి గోనె శ్రీలత పర్యవేక్షించారు. •

## సీతాఫలం



*సీతాఫలాల సీజన్ వచ్చేసింది. మార్కెట్లో విరివిగా ఈ పండ్లు దొరు కుతున్నాయి. ఇంతకీ సీతాఫలం మనకు ఎలాంటి ఫలాన్ని ఇస్తుందో తెలుసుకుందాం. తిన్న వెంటనే శక్తినిచ్చే ఫలం సీతాఫలం. కండరాలకు బలాన్ని ఇస్తుంది. విటమిన్ సి పుష్కలంగా ఉండే ఈ పండు తినడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. లివర్ కాన్సర్, మెదడులో ట్యూమర్స్, బ్రెస్ట్ కాన్సర్ రాకుండా చేసే గుణం సీతాఫలానికుంది. ఈ పండ్లలో బి6 విటమిన్ అధికంగా ఉంటుంది. ఒత్తిడి, డిప్రెషన్ రాకుండా చేయడంతోపాటు మెదడు చురుగ్గా ఉండేందుకు ఉపయోగ పడుతుంది. దంతాలకు మంచి ఆహారం. దంతాల్లోని నొప్పిని నివారిస్తుంది. ఐరన్ అధికంగా ఉండే సీతాఫలాలు తినడం వల్ల అనిమియా రాదు. ఈ ఫలం కళ్ళకు కూడా ఆరోగ్య ప్రదాయినే. జీర్ణక్రియ, చర్మం, వెంట్రుకల ఆరోగ్యానికి ఇది సహకరిస్తుంది.*

*- అంతర్జాలం నుండి...*

# దీనజన బాంధవుడు... కటారి సత్యసాగర్ రావు ఇకలేరు



**ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కరీంనగర్ శాఖ వ్యవస్థాపకుల్లో ఒకరు, తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు నర్సింగ్ హోమ్‌ల సంఘం అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డా॥ కటారి సత్యసాగర్ రావు తీర్థయాత్రలకు బయలుదేరి మార్గమధ్యమంలో గుండెపోటుతో మరణించడం కరీంనగర్ వైద్యులందరినీ విషాదంలో ముంచెత్తింది. ఎందరో వైద్యులకు సర్జరీలు నేర్పించి వైద్యులను నిత్యం ప్రోత్సహించిన సత్యసాగర్ రావు ఇక లేరన్న చేదు నిజాన్ని కరీంనగర్ ప్రజలు కూడా జీర్ణించుకోలేకపోయారు. దీనజన బాంధవునిగా, సామాజిక సేవా దృక్పథంతో వీరు బ్రతికినంత కాలం పేద, సాదలకు వైద్య సేవలందించారు. కాసుల కోసం కక్కుర్తిపడే నైజం డా॥ కటారి సత్యసాగర్ రావు డిక్షనరీలోనే లేదు. పేదలన్నా, వారి ప్రాణాలన్నా ఆయన ఎంతో చలించిపోయేవారు. సేవాభావమే ఊపిరిగా వీరి జీవిత చరమాంకం వరకు వైద్య సేవలందించి ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారు.**

1950 మే 4న స్వర్గీయ కటారి రాంగోపాల్ రావు, సుభద్ర దంపతులకు జన్మించిన ప్రముఖ వైద్య నిపుణులు, దీనజన బాంధవులు, సామాజిక సేవా తత్పరులు, దివంగత కరీంనగర్ మాజీ శాసన సభ్యులు స్వర్గీయ కటారి దేవేందర్ రావు సోదరుడు డా॥ కటారి సత్యసాగర్ రావు కంచి యాత్రకు వరంగల్ నుండి బయలుదేరి వెళ్తుండగా ఆకస్మిక గుండెపోటుతో కుప్పకూలిపోయారు. చాలా సేపటికి కుటుంబ సభ్యులు వెళ్ళి చూడగా అప్పటికే డా॥ సత్యసాగర్ రావు మరణించారు. ఈ వార్తా కరీంనగర్ పట్టణంలో దావానంలా వ్యాపించడంతో కరీంనగర్ జిల్లాకు చెందిన డాక్టర్లంతా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

వీరి పార్థీవదేహాన్ని మొదట కరీంనగర్‌లోని స్వగృహం సాగర్ ఆసుపత్రికి తరలించి ప్రజలు, వైద్యులు, మిత్రులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం ఉంచారు. అనంతరం ఇరుకుల్ల వద్ద ఉన్న పద్మనాయక స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. వేలాది మంది ప్రజలు, డాక్టర్లు డా॥ కటారి సత్యసాగర్ రావు అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

డా॥ కటారి సత్యసాగర్ రావు మృతి చెందారన్న వార్త విన్న వెంటనే కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్ సాగర్ ఆసుపత్రికి చేరుకొని డా॥ కటారి సత్యసాగర్ రావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి మరణం జిల్లా ప్రజలకు తీరని లోటని పేదసాదలకు కాసులతో నిమిత్తం లేకుండా వైద్య సేవలందించిన గొప్ప మానవతావాది అని పేర్కొన్నారు.

కరీంనగర్ పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ జువ్వాడి రంగారావు డా॥ కటారి సత్యసాగర్ రావు మరణం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. వారు వైద్యవృత్తిని వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో చూసారని, వారి జీవిత చరమాంకం వరకు పేదలకు ఉచిత వైద్య సేవలందించారని కొనియాడారు.

కరీంనగర్ పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ బల్మూరి ప్రసాద్ రావు డా॥ కటారి సత్యసాగర్ రావు మృతితో కరీంనగర్ జిల్లా ప్రజలు గొప్ప మానవతావాదిని, సామాజిక సేవాతత్పరున్ని కోల్పోయిందన్నారు. వైద్యరంగంలో ఎందరికో సర్జరీలు నేర్పించి జూనియర్ డాక్టర్లను ఎంతగానో ప్రోత్సహించారన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా, ఐఎంఏ మాజీ అధ్యక్షునిగా, తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు నర్సింగ్ హోంల సంఘం అధ్యక్షులుగా వారందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

'ఐవా' మాజీ అధ్యక్షులు, కెయిమ్స్ ఛైర్మెన్ శ్రీ చలిమెడ లక్ష్మీనర్సింహా రావు డా॥ కటారి సత్యసాగర్ రావు భౌతిక కాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. వీరి మరణం వైద్యులందరికీ తీరనిలోటన్నారు. వైద్యవృత్తికే వన్నె తెచ్చిన గొప్ప మానవతావాది డా॥ కటారి సత్యసాగర్ రావని పేర్కొన్నారు.

'ఐవా' ప్రధాన కార్యదర్శి శ్రీ పూస్కూరు శ్రీకాంత్ రావు డా॥ కటారి సత్యసాగర్ రావు ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాం తిని, ఆవేదనను వ్యక్తం చేశారు. పేద లకు వైద్య సేవలందించడంలో వీరికి మరెవరు సాటిరారన్నారు. డా॥ కటారి సత్యసాగర్ రావు ఆకస్మిక మృతి పట్ల ఐవా కార్యవర్గం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వీరి మృతి కరీంనగర్ జిల్లా వైద్యరంగానికి, పేద ప్రజలకు తీరని లోటని తెలిపింది.

డా॥ కటారి సత్యసాగర్ రావు అంతిమ యాత్రలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ ప్రతాప్ రెడ్డి, కరీంనగర్ సీనియర్ వైద్యులు డా॥ భూంరెడ్డి, ఐఎంఎ ఉపాధ్యక్షులు డా॥ బిఎన్‌రావు, జాతీయ ఉపాధ్యక్షు రాలు డా॥ ప్రమీల, శ్రీ రవీందర్ రావు, శ్రీ సంపత్ రావు, డా॥నగేష్‌లతో పాటు వందలాది మంది డాక్టర్లు, వేలాది మంది ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని డా॥ కటారి సత్యసాగర్ రావుకు కన్నీటి వీడ్కోలు పలికారు.

డా॥ కటారి సత్యసాగర్ రావుకు ఒక కుమారుడు డా॥ అరుణ్ కటారి, కుమార్తె డా॥ అనల సాగిలున్నారు. వీరి కుటుం బమంతా వైద్య సేవలోనే తరించడం విశేషం. •

# సమాజసేవలో దొంతినేని అంజల్ రావు



రెండు కళాశాలలకు తనవంతు సహకారమందించి వాటిపేర్లలో మార్పు తెచ్చిన శ్రీ దొంతినేని అంజల్ రావు 1950 సెప్టెంబర్ 4న నల్గొండ జిల్లా, దేవర కొండ తాలూకాలోని టి.గౌరారం (ప్రస్తుతం డిండి మండలం)లో జన్మించారు. వీరి తల్లి దండ్రులు స్వర్గీయ దొంతినేని వెంకట నర్సమ్మ, గోపాల్ రావులు. వీరిది వ్యవ సాయ కుటుంబం. గోపాల్ రావు అంజల్ రావుకు రెండున్నరేళ్ళ ప్రాయంలో చని పోయినా వీరి మాతృమూర్తి వెంకట నర్సమ్మ పట్టుదలతో చదివించి వీరి గ్రామము నుండి మొట్టమొదటి పట్ట భద్రుని చేయించినారు. శ్రీ అంజల్ రావు 1971లో కాలేజీ డిగ్రీ చదువు నల్గొండ లోని ఎన్‌జి కాలేజీలో పూర్తిచేసి, 1975 లో ఆంధ్రాబ్యాంకులో చేరి 2010 సెప్టెం బర్‌లో సైదాబాద్ శాఖ నుండి ఎంఎం జిఎస్2 హోదాలో పదవీ విరమణ పొం దారు. వీరి సతీమణి శ్రీమతి భారతి అన్ని విషయాలలో వీరికి చేదోడు వాదో డుగా ఉన్నారు. వీరి సంతానంలో పెద్ద కుమార్తె శ్రీమతి డి. విజయలక్ష్మి డాక్ట ర్‌గా, పెద్ద అల్లుడు శ్రీ అనిల్ కుమార్ కాగా చిన్న కుమార్తె శ్రీమతి హారిణి, అల్లుడు నాగేశ్వర్ బాబు అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉంటున్నారు. కుమా రుడు డి. నర్సింహా రావు అకాల మరణం చెందటంచే వారి జ్ఞాపకార్థం డిండిలోని ప్రభుత్వ కాలేజిని దొంతినేని నర్సింహా రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలగా జిఓ ద్వారా పేరు మార్పిడి చేయించినారు.

అదే విధంగా వీరి మాతృమూర్తి స్వర్గీయ దొంతినేని వెంకట నర్సమ్మ శ్రమ, పట్టుదల, వీరికి విద్యయందున్న అభిరుచి సమాజంలో గుర్తింపుకై వారి పేరుమీద దేవరకొండ ప్రభుత్వ జూని యర్ కళాశాల డెవలప్‌మెంట్ కమిటీకి 27 లక్షల 33 వేలు చెల్లించి ఆ కళా శాల పేరును శ్రీమతి దొంతినేని వెంకట నర్సమ్మ బాలుర జూనియర్ కళాశాల, దేవరకొండగా పేరు మార్పిడి చేయిస్తూ జీవో నెం40 సెక్రటరీ ఆఫ్ గవర్నమెంట్ ద్వారా విడుదల చేయించారు. ఆ విధంగా తనకు తల్లి పట్ల గల ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తూ, మాతృమూర్తి స్వర్గీయ దొంతినేని వెంకట నర్సమ్మ పేరు చిరస్థా యిగా నిల్చిపోయేటట్లు అదే విధంగా తనకు విద్యయందుగల అభిరుచిని వ్యక్త పరిచారు.

వీరిని మన వెలమ బంధువులు ఆదర్శంగా తీసుకొని సమాజ శ్రేయస్సు కొరకై తమవంతు సహాయ సహకారా లందించాలని వెలమ వైజయంతి ఆకాంక్షిస్తున్నది. •

# అమ్మలా ఆదరిస్తున్న భగిని నివేదిత ఆశ్రమం



- అమ్మలా ఆదరిస్తున్నారు...
- ఆప్యాయతతో అనురాగం పంచుతున్నారు.
- విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు...

ఇంతకన్నా ఎవరికైనా ఇంకేం కావాలి. అదీ అమ్మా-నాన్న, నా అనే వారెవరూ లేని వారికి ఆపన్న హస్తం అందిస్తున్న ఆ మానవతా మూర్తులకు మనసున్న ప్రతి ఒక్కరూ అభినందనలు తెలుపుతున్నారు. దాతృత్వం గావిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే... రెండు దశాబ్దాల క్రితం జగిత్యాల పట్టణానికి చెందిన ఓ ఐదుగురు విద్యావంతులైన మహిళలు ఒక పవిత్ర ఆశయంతో, మంచి సంకల్పంతో.. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ రాష్ట్ర సేవికా సమితి సహకారంతో, జగిత్యాల వైద్యుల సహకారంతో ఆరంభించిన ఆవాసం ఆ అనాథలైన ఆడ పిల్లలకు నీడనిచ్చి అక్కున చేర్చుకుంటుంది.

ఆడ పిల్లలకు వరంగా మారిన ఈ ఆవాసం నిర్వాహకులు, సంకల్పించిన మానవతా మూర్తుల్లో ఐదుగురు మహిళలూ వైద్యకుటుంబానికి చెంది, గృహస్థులుగా ఉంటున్నవారే. ఇతరాత్రా వేరే వ్యాపకాలకు పోకుండా ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే మిన్న అనే నమ్మకంతో పట్టణానికి చెందిన శ్రీమతి రేణుకా మధుసూదన్ రావు, శ్రీమతి ఉమాదేవిశంకర్, శ్రీమతి గిరిజ సత్యనారాయణమూర్తి, శ్రీమతి కాలువ సునంద వెంకటరాజిరెడ్డి, శ్రీమతి మీనాక్షి ర్నాతచార్యులు కలిసి ఒక పవిత్ర ఆశయంతో గత 1997లో భగిని నివేదిత ఆవాసం పేరిట, ఆనాథ ఆడపిల్లల కోసం ఒక నీడను ఏర్పాటు చేశారు. ఈ పవిత్ర కార్యక్రమం కోసం సరస్వతీ విద్యాపీఠం అనుబంధ సంస్థ గీతావిద్యాలయం సైతం చేయూతనందించి, ఆవాసం ఏర్పాటుకు సహకరించారు.

ఇక రెండు దశాబ్దాలుగా నిరంతరంగా, నిరాటంకంగా సాగుతున్న ఈ భగినీ నివేదిత ఆవాసం నిర్వహణకోసం ఎందరో దాతలు ముందుకు రావడం జరిగింది. వీరిలో ప్రధానంగా జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు డా॥ ఐల్నేని జగన్‌మోహన్ రావు ఆనాథ ఆడ పిల్లలకు సహాయం అందించడానికి గాను ఆవాసం నిర్మాణం కోసం స్పందించి 10 లక్షల రూపాయలు విరాళంగా అందించారు. వారితోపాటు ఐదుగురు మహిళల కుటుంబ సభ్యులు డా॥ మధుసూదన్ రావు, రేణుకారావు దంపతుల కుమార్తెలు, డా॥ వెంకట రాజిరెడ్డి, సునంద దంపతుల కూతురు అమెరికాలో ఉంటూ తమ తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆవాసంకు ప్రతి ఏటా విరాళం తమవంతుగా అందిస్తున్నారు.

కాగా ప్రతి ఏటా కనీసం 5 నుండి 6 లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు మహిళా నిర్వాహకులు తెలిపారు. ఉచిత భోజన వసతితోపాటు ఉచిత విద్యను అందిస్తూ, వారిని తీర్చిదిద్దాలన్నది ఈ భగిని నివేదిత ఆవాసం మహిళల లక్ష్యం. కొందరు మానవతా దృక్పథంతో ఇప్పటి వరకు సుమారు





30 లక్షలకు పైగా విరాళాలు అందించారు. అలాగే ప్రతి సంవత్సరం కూడా ఆర్థిక సాయం అందిస్తూనే ఉన్నారు.

ఇప్పటి వరకు సుమారు 300 మందికి పైగా అనాథ బాలికలను అక్కున చేర్చుకొని అమ్మలా లాలిస్తూ, వారికి చదువుతో పాటు విలువైన జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. ఈ ఆవాసంలో అభ్యాసం చేసిన విద్యార్థులు వైద్య, సాంకేతిక విద్యతో పాటు డిగ్రీ చదువు పూర్తి చేసుకొని, ఉన్నత చదువుల్లో, ఉద్యోగాల్లో స్థిరపడిన వారున్నారు. తమకు మంచి విద్యను అందించి, అమ్మలా అక్కు చేర్చుకున్న ఆవాసాన్ని, నిర్వాహకులను మరచిపోకుండా అంతో ఇంతో సాయమందిస్తున్నారు.

భగిని నివేదిత ఆవాసంలో ఐదుగురు మహిళల ఆశయం వెనుక ఆడపిల్లల అమానవీయ సంఘటనలు ఎన్నో వారిని కదిలించాయి. మంచి చెడు చెప్పే అమ్మా నాన్నలకు దూరమైన ఆడపిల్లల రక్షణ బాధ్యతకు ఆ మహిళలు నడుం బిగించారు. వారు ఎంచుకున్న ఈ సదాశయం ఎందరో ఆడపిల్లల జీవితాలను మలుపు తిప్పుతుంది. అనాథ ఆడపిల్లల సంరక్షణయే ధ్యేయంగా ఏర్పాటైన ఈ భగిని నివేదిత ఆవాసంకు కాకాజీ అనే మరో దాత ఆరు లక్షల ఆర్థిక సహాయమందించారు. మహిళలు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి ఆడపిల్లలను తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

ఈ ఆవాసంలో జగిత్యాల ప్రాంతం నుండే కాకుండా ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి కూడా అనాథ ఆడపిల్లలు ఈ భగిని నివేదిత ఆవాసంలో తమ జీవితాన్ని గడుపుతున్నారు. ఆవాసంలోని ఒక్కో ఆడపిల్ల పరిస్థితిని పరిశీలిస్తే ఒక్కో వ్యథ మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. కాగా ఈ నిర్వాహకులలో శ్రీమతి ఉమాదేవి కొద్ది రోజుల నుండి వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉండడంతో ఆమె స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శ్రీమతి మెన్నేని నీలిమ భాగస్వామ్యం వహిస్తున్నారు.

ఏది ఏమైనా ఒక పవిత్ర ఆశయంతో ఏర్పాటు చేసిన భగిని నివేదిత ఆవాసం మంచి ఫలితాలనిస్తుండటం పట్ల అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తూ మేము సైతం సామాజిక సేవలో భాగస్వాములం కావాలనే సదుద్దేశంతో తమ దాతృత్వాన్ని ప్రకటిస్తున్నారు. •

# ఆకట్టుకున్న గోరింటాకు వేడుకలు



జగిత్యాల జిల్లా కేంద్రములో పద్మనాయక కళ్యాణ మండపంలో పద్మనాయక కిట్టి పార్టీ మహిళలు ఆషాఢ మాస గోరింటాకు వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకొని సందడి చేశారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా॥ మకునూరు సంజయ్ కుమార్ సతీమణి శ్రీమతి రాధిక వెలమ సంక్షేమ మండలి జగిత్యాల మహిళ కార్యవర్గ సభ్యులు శ్రీమతి కొండపల్కల వినిత, శ్రీమతి మెన్నేని మంజుల మహిళలతో కలిసి వేడుకల్లో హుషారుగా పాల్గొన్నారు. •

### జలగం వెంగళరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో...

# అర్హులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఖమ్మం జిల్లా పెనుబల్లిలో జలగం వెంగళ రావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో జులై 21న సాయంత్రం 4 గం టలకు కీ॥శే॥ శ్రీమతి జలగం శిరీష గారి స్మృత్యార్థం వారి భర్తగారైన కెప్టెన్ జలగం రామారావు వెలమ సామాజిక వర్గానికి చెందిన పేద, మెరిటోరియస్ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ చేయడం జరిగింది.

స్వాగతోపన్యాసములో భాగంగా మాజీ మంత్రివర్యులు శ్రీ జలగం ప్రసాదరావు కుమారుడు శ్రీ జలగం అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి పెనుబల్లిలో నిర్వహింపబడిన జెవిఆర్ ఫౌండేషన్ భవనంలో మన సామాజిక వర్గానికి చెందిన పేద, ఉత్తమ ప్రతిభ కన బర్చిన పిల్లలకు ఉపకార వేతనాలు పంపి ణీ చేయుట జరుగుతుందని తెలియ జేస్తూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెప్టెన్ జలగం రామారావును వేదికపైకి ఆహ్వానించుట జరిగింది. విశిష్ట అతిథు లుగా మాజీ మంత్రివర్యులు శ్రీ జలగం ప్రసాదరావు, అతిథులుగా ఖమ్మం జిల్లా పద్మనాయక వెలమ సంఘం అధ్యక్షులు శ్రీ సాగి వెంకటేశ్వర్ రావు, మాజీ అధ్య క్షులు శ్రీ పులిగుండ్ల సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి, ఐవా కార్యవర్గ సభ్యులు శ్రీ రామడుగు సీతారామారావులను సాద రంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు శ్రీ జలగం ప్రసాదరావు మాట్లాడుతూ గత 25 ఏళ్ళ నుండి మా బాబాయిగారైన కెప్టెన్ జలగం రామారావు ఆధ్వర్యంలో మా పిన్ని స్వర్గీయ శ్రీమతి జలగం శిరీషగారి స్మృత్యార్థం ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పేద, మెరి టోరియస్ పిల్లలకు ఉపకార వేతనాలు పంపిణీ చేయుట జరుగుతున్నదని, ఈ సంవత్సరం జెవిఆర్ ట్రస్ట్ కాంప్లెక్స్‌లో 25 మంది పిల్లలకు రూ. 4 లక్షల ఆర్థిక సహాయం, ఒక విద్యార్థిని చి॥ ఎత్తపు లిఖితకు లాప్‌టాప్ బహుకరిస్తున్నామని తెలిపారు. కావున ఉపకార వేతనాలు





పొందిన పిల్లలంతా వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని అదే విధంగా మీరు కూడా మీవంతుగా పేద పిల్లల విద్యాభివృద్ధికి సాయపడాలని, అలా సాయపడినప్పుడే ఈ కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని తెలిపారు.

ఖమ్మం జిల్లా పద్మనాయక వెలమ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ సాగి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ఇది చాలా మంచి కార్యక్రమమని, ఈ కార్యక్రమంలో పాల్గొనుట అదృష్టమని స్వర్గీయ శ్రీమతి జలగం శిరీష మెమోరియల్ స్కాలర్‌షిప్ పొందే విద్యార్థులంతా చక్కగా చదువుకొని మీతోటి వారికి సహాయపడాలని కోరినారు. అలాగే "ఒక మనిషి ఎదిగితే ఘనత, మనిషితో కుటుంబం ఎదిగితే మమత, మనిషితో సంఘం ఎదిగితే చరిత" అనేది నానుడి అని ఆ విధంగా జలగం వారి కుటుంబమంతా సమాజానికి సేవ చేస్తున్నారని మరియు కెప్టెన్ రామారావు కెప్టెన్‌గా దేశానికి ఎంతో సేవ చేశారని ఒక వ్యక్తిగా ఎంతో ఎత్తుకు ఎదిగి ప్రస్తుతం 95 సంవత్సరాల వయసులో కూడా మన సామాజిక వర్గాన్నంతా కుటుంబంగా భావించి, మన సామాజికవర్గ ఉన్నతి కోసం స్కాలర్‌షిప్స్ అందించి చరిత్ర సృష్టిస్తున్నారని, వారు దీర్ఘాయుషులై జీవించాలన్నారు.

ఖమ్మంజిల్లా వెలమ సంఘం మాజీ అధ్యక్షులు శ్రీ పులిగుండ్ల సురేష్ బాబు మాట్లాడుతూ ఈ రోజు చాలా ఆనందంగా ఉందని, గత 7 సంవత్సరాలుగా శ్రీమతి జలగం శిరీష మెమోరియల్ స్కాలర్‌షిప్స్ ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో పంపిణీ చేయడం జరుగుతున్నదని ఈ సంవత్సరం నుండి జెవిఆర్ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేయుట ముదావహమని తెలిపారు. ఈ రోజు మనందరికి సుదినం ఎందుకంటే ప్రతి సంవత్సరం వారు పంపిన ఉపకార వేతనాలు వేరేవారు పంపిణీ చేయుచుండగా ఈ సంవత్సరం వారే స్వయంగా వచ్చి మీ అందరికి స్కాలర్‌షిప్స్ వారి చేతుల మీదుగా అందించటం, మీరు పొందటం చాలా సంతోషించవలసిన విషయం. కావున మీరంతా బాగా చదివి,మంచిగా స్థిరపడి తోటి వారికి సాయపడుతూ, వారి పేరునిలపాలని కోరుతూ వారు ఆయురారోగ్యాలతో ఉంటూ, ఇంకా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

ముఖ్య అతిథి గౌరవనీయులు, పెద్దలు కెప్టెన్ జలగం రామారావు మాట్లాడుతూ మీ అందరిని కలుసుకొనుట చాలా సంతోషంగా ఉన్నదని గత 25 ఏళ్ళ నుండి మన సామాజిక వర్గానికి చెందిన పేద, ఉత్తమ ప్రతిభకనబరిచిన ఎంతో మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామని మీరంతా బాగా చదువుకొని, మీ కాళ్ళపై మీరు నిలబడి మీ తల్లిదండ్రులను బాగా చూసుకొని, మీ తోటి వారికి సాయపడినపుడే మన జీవితాలకు సార్థకత అని తెలిపారు. అదే విధంగా ప్రతి ఒక్కరు మీ పర్మార్మెన్స్ తరచుగా ట్రస్ట్‌కు తెలియజేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కెప్టెన్ గారు చదువుకొనే రోజులలో విద్యాపరంగా ఇన్ని సౌకర్యాలు లేవని ప్రతి రోజు కొన్ని కిలోమీటర్లు నడిచి వెళ్ళి, క్రమశిక్షణ, భయభక్తులతో చదువుకునే వారమని, క్రమశిక్షణతో ఉన్నప్పుడే జీవితంలో పైకి వస్తారని, అందరూ క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు.

ఇంకా ఈ కార్యక్రమంలో ఐవా కార్యవర్గ సభ్యులు, ఖమ్మం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ రామడుగు సీతారామారావు మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారావచ్చే స్కాలర్‌షిప్స్ పొందుటకు ప్రయత్నించాలని, మీరంతా బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని కోరారు.

స్కాలర్‌షిప్స్ పొందిన పిల్లలంతా తమ అనుభవాలను పంచుకొనుట జరిగింది. మేమంతా బాగా చదువుకొని మా తల్లిదండ్రులను బాగా చూసుకొంటామని, మా వంతుగా సమాజానికి సేవ చేస్తామని తెలిపారు. అనంతరం గౌరవనీయులు కెప్టెన్ రామారావు గారికి అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. అల్పాహార విందు తర్వాత వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. **– చెలికాని హనుమంత రావు**

# పేదల సేవలో డాక్టర్ ప్రియాంక రావు




ప్రతీ కుటుంబంలో అనేక రూపాల్లో అనేక బాధ్యతలను నిర్వర్తిస్తున్న మహిమాన్విత మాతృమూర్తి మహిళ. తల్లిగా, చెల్లిగా,అక్కగా, భార్యగా సేవలను అందిస్తున్న ప్రేమమూర్తి. కుటుంబం బాధ్యతలనే కాదు సమాజంలోని అనేక రంగాల్లోనూ రాణిస్తూ ఉత్తుంగ తరంగమై దూసుకుపోతోంది.

కాప్రాలోని హెచ్‌బి కాలనీకి చెందిన డా॥ప్రియాంక వృత్తిలో రాణిస్తూ సమాజహితం కోసం కృషి చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ పలువురి మన్ననలను పొందుతున్నారు. వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన డాక్టర్ ప్రియాంక 2009లో దంత వైద్యవిద్యను పూర్తిచేశారు. తరువాత మూడేళ్ల ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగం చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీ వెంకటవరప్రసాద్‌ను 2012లో వివాహం చేసుకొని కాప్రాలోని హెచ్‌బికాలనీలో స్థిరపడ్డారు. చిన్ననాటి నుంచి చదువులో చురుగ్గా ఉండే ఆమెకు క్రీడల్లోనూ ప్రవేశముంది. తండ్రి శ్రీ మార్తినేని అప్పారావు స్ఫూర్తితో చిన్ననాటి నుంచే పేదలకు సేవ చేయాలన్న తపన ఉండేది. వైద్య వృత్తిలోకి వచ్చాక పేదల బస్తీలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. నగర, శివారు గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల్లోని పేదల పిల్లలకు దంత సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా ఆసుపత్రికి రాలేని వృద్ధుల వద్దకు ఆమె స్వయంగా వెళ్లి వైద్య సేవలందిస్తారు. తిరుమలానగర్ లయన్స్ క్లబ్‌లో సభ్యురాలిగా చేరి సేవలను మరింత విస్తరించారు.

### దంత వైద్యుల సమస్యలపై...

రాష్ట్రంలో దంత వైద్య విద్య చదువుకుని ఉద్యోగాలులేని యువవైద్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రాష్ట్రంలో 30 వేలకుపైగా దంత వైద్యులకు ఉద్యోగాలు లేక ప్రైవేటు ఆసుపత్రులు పెట్టుకున్నా కార్పోరేట్ ఆసుపత్రుల ధాటికి అవి నడవక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో 2014లో తెలంగాణ డెంటిస్ట్ అసోసియేషన్ (టిడిఏ)ను ప్రియాంక స్థాపించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షురాలిగా రాష్ట్రంలోని దంత వైద్యులను ఓ వేదిక పైకి తీసుకువచ్చారు. దంత వైద్యుల సమస్యలపై పోరాటాలు చేశారు. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించే వారికి ఉపాధి కల్పించాలని ఉద్యమించారు.

వారి సమస్యను ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ నాయకత్వ లక్షణాలను గుర్తించిన ప్రియాంకకు ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ఇటీవల జరిగిన తెలంగాణశాసనసభ ఎన్నికల్లో శాసన సభ్యురాలిగా పోటీ చేసేందుకు ప్రియాంకకు టికెట్ ఇచ్చింది.

### టిడిఏ రాష్ట్ర అధ్యక్షురాలు...



హెచ్‌బీకాలనీలో జరిగిన టిడిపి సమావేశంలో డాక్టర్ ప్రియాంకను తెలంగాణ డెంటిస్ట్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

**తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం..**

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను వెతికి వారు సాధించిన రికార్డులను మన తెలుగు ప్రజలకు మరోసారి తెలియజేస్తూ పురస్కారాలు అందజేస్తున్నారు. డా॥ ప్రియాంకకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో పలువురు పెద్దల సమక్షంలో పురస్కారాన్ని అందజేశారు. టిఆర్ఎస్ ప్రతినిధి డా॥ వేణుగోపాలాచారి మాట్లాడుతూ ప్రియాంక దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం సామాజిక సేవలందిస్తూ,స్పృహ మొదలైన క్యాంపులను నిర్వహిస్తూ నిరంతరం పదుగురికి సేవలందిస్తున్నారన్నారు.

**అంబేడ్కర్ సేవా పురస్కారం...**

ఉచిత దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలందిచండంతో పాటుగా పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నందుకు గాను స్నేహ టీవి, అంబేడ్కర్ టీవి ఆధ్వర్యంలో వీరిని అవార్డుకు ఎంపిక చేశారు. రవీంద్ర భారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి శ్రీ శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే శ్రీ బాలకిషన్,అంబెద్కర్ టీవి ఛైర్మెన్ శ్రీ శివభాగ్యరావు చేతుల మీదుగా అవార్డు నందుకున్నారు. ●

# సామాజిక సేవాదృక్పథంతో ముందడుగు



**ఆపన్నులకు అభయహస్తం అందించే నేస్తం శ్రీ జూలపల్లి శ్రీధర్ రావు, అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డారు. ఓ వైపు సామాజిక సేవ, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఐటి కంపెనీ నిర్వహణ, క్షణం తీరిక లేని పని ఒత్తిడి, అయినా సహనం మూర్తీభవించిన శ్రీ శ్రీధర్ రావు అమెరికాలోని వెలమ బంధువులకు ఆప్తునిగా, ఆపదల్లో అండగా నిలుస్తూ తన సామాజిక సేవా తత్పరతను, మానవతావాదాన్ని చాటుకొంటున్నారు. అమెరికాలోని ప్రవాస భారతీయ ఆర్గనైజేషన్‌లన్నింటిలోను వీరు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ అడ్వైజరీ బోర్డు సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. 'వానా' కార్యక్రమాలలో ముఖ్య భూమిక పోషిస్తున్న వీరి సామాజిక సేవా తత్పరతకు సంబంధించిన సమాచారం సంక్షిప్తంగా...**

పోరాటాల పురిటిగడ్డ, సహజ వనరుల రత్నగర్భ వరంగల్ జిల్లా పర్వతగిరి గ్రామంలో శ్రీ జూలపల్లి కమలాకర్ రావు దంపతులకు జన్మించిన శ్రీ జూలపల్లి శ్రీధర్ రావు సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులు. ప్రస్తుతం వీరు అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డారు. వార్నర్ మీడియా ఎల్ అండ్ టిలో పని చేస్తున్నారు. సన్ ఐటి టెక్నాలజీస్ పేరిట ఒక కంపెనీని అమెరికాలోని అట్లాంటాలో స్థాపించారు. ఈ కంపెనీ నిర్వహణ బాధ్యతను శ్రీ జూలపల్లి శ్రీధర్ రావు సహధర్మచారిణి శ్రీమతి శిరీష చూస్తున్నారు. అమెరికాలోని అన్ని ప్రవాస భారతీయ ఆర్గనైజేషన్‌లలో వీరు చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

గ్రేటర్ అట్లాంట తెలుగు సొసైటీ అడ్వైజరీ బోర్డు సభ్యులుగా ఉన్న శ్రీ జూలపల్లి శ్రీధర్ రావు అనేక సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఐవా ఆధ్వర్యంలో చేపడుతున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు బాసటగా నిలుస్తున్నారు. తరచుగా హైదరాబాద్ వచ్చే వీరు ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నారు. టిఆర్ఎస్ ఎన్నికల సమయంలో వీరు క్రియాశీల పాత్ర పోషించారు. రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖామాత్యులు శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావుకు సమీప బంధువులు.

జెవిఆర్ బాలుర వసతి గృహ విద్యార్థులలో ఎవరైనా సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వాలనుకుంటే వారికి ఆర్థిక చేయూతనందిస్తున్నారు. అడాప్ట్ ది స్టూడెంట్ కార్యక్రమానికి కూడా వీరు సహకరిస్తున్నారు.

అమెరికాలోని వెలమ బంధువులందరికీ ఎలాంటి సహాయం అవసరమైనా, ఏదైనా సమస్య తలెత్తినా ఆ సమస్య పరిష్కారానికి చొరవ చూపే అత్యుత్తమ మానవతావాది శ్రీ జూలపల్లి శ్రీధర్ రావు. ●

శ్రీమతి& శ్రీ జూలపల్లి శిరీష -శ్రీధర్ రావు

దంపతుల పుత్రిక

# జూలపల్లి చరిత్ర కు

# నూతన వస్త్రాలంకరణ మహోత్సవం

తేది 20 - 07 - 2019

వేదిక : Lanier Tech, (Forsyth Conference Center)
3410 Ronald Reagan Blvd, Cumming, GA 30041














# దేశంలో సమతుల్యతతో సాగిన విద్యావ్యాప్తి



*ప్రాచీనకాలంలో హిందూమత విధానాల ఆధారంగా విద్యాబోధన ప్రధానంగా గురుకుల వ్యవస్థ ద్వారా జరిగేది. నాడు గురువులు, విద్యార్థులు ఒకే ఆవాసంలో ఉండేవారు. గురుకులాలు ప్రధానంగా సమాజానికి దూరంగా అడవులలో ఉండేవి. వేదాలు, ఉపనిషత్తులు నేర్పించేవారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు దేహదారుఢ్యంపై కూడా దృష్టి పెట్టేవారు. వేదయుగం తర్వాత ఖగోళ శాస్త్రం, వైద్యం, గణితం, తర్కం, వివిధ భాషలు, వ్యాకరణం, సంగీతం, లలిత కళలు, వాస్తుశిల్పం మొదలైన అంశాలన్నీ నేర్పడం ప్రారంభించారు. ఈ కాలంలోనే బౌద్ధ, జైనమతం ఉద్భవించి విద్యాబోధనలో మరింత మార్పులు తెచ్చాయి.*

భారతదేశంలో విద్యాబోధనా విధానం, విద్యార్థులకు విద్యను అందించే పద్ధతులు ప్రాచీనకాలం నుంచి ప్రస్తుత ఆధునిక కాలం వరకు అనేక రకాలుగా మారుతూ వచ్చాయి. నాడు విద్యా గురువులు, శిష్యుల మధ్య విద్యా సంభాషణ ఒకరి నుంచి మరొకరికి ఎక్కువగా మౌఖికంగానే ఉండేది. తర్వాత రాత పూర్వకంగా విద్యాబోధన అందించడం ప్రారంభమైనది. ఈ కోణంలో పరిపరిశీలిస్తే అనేక అంశాలను ప్రస్ఫుటంలోకి వస్తాయి. మన ప్రాచీన భారతదేశంలో మొదట్లో విద్యాబోధన ముఖ్యంగా మతం, ఆధ్యాత్మిక, నైతికత అందించేదిగా ఉండేది. అయితే తర్వాత వలస రాజ్యాల కాలంలో వలస పాలకులు స్థానిక భాషలను నిర్లక్ష్యం చేశారు. వారి పరిపాలనా సేవలను, రక్షణకు అనువైన వ్యక్తులను నియమించుకోవడానికి ముస్లీం రాజుల కాలంలో ఉర్దూను, తర్వాత బ్రిటీష్ కాలంలో ఇంగ్లీషును ప్రోత్సహించారు. వివిధ జాతుల స్థానిక భాషలు, ఆ భాషల్లో విద్యాబోధన అందించే ప్రక్రియలు ఆగిపోయాయి. భారతదేశానికి బ్రిటీషర్ల నుండి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత పరిస్థితులు మారాయి. ఇప్పుడు అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీషుకు, స్థానిక భాషలకు సమతుల్యత ఏర్పడింది. విద్యాబోధనా వ్యవస్థలో అనేకమార్పులు వచ్చాయి. ఈ సమతుల్యత వల్ల దేశంలో విద్యావ్యాప్తి మరింత మెరుగైన విధానంలో జరగుతుంది. ఈ విధానం ప్రపంచంతో సంబంధాలను పెంచింది. విద్యార్థి ప్రపంచంతో పోటీపడుతున్నాడు. సమతుల్యత ఉత్తమమైన మానవ వనరులను ఉత్పత్తి చేయడంలో ఎంతో తోడ్పడింది. ఇప్పుడు డిజిటల్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా విద్యను అందించే అధ్యాపకులు, ఆ విధానం ద్వారానే విద్యను పొందే అధ్యాపకుల మధ్య ఆసక్తి పెరిగినందున కొత్త డిజిటల్ ప్రపంచం దేశానికి కూడా ఎంతో అవసరమైంది. ఇప్పుడు ఈ విధానం దేశంలో మరింత వేగంగా పరుగులు పెడుతోంది. ఆన్‌లైన్ కోర్సులను అత్యధికంగా అందిపుచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎక్కువగా ఎన్‌రోల్‌మెంట్ పెరిగి విద్యావ్యాప్తికి దోహదపడుతుంది.

మధ్యయుగాల కాలం 10వ శతాబ్దం ఏడి నుండి 18వ శతాబ్దం వరకు మధ్య కాలం వరకు అంటే బ్రిటీష్ పాలనకు ముందు 632 సిఈలో మహమ్మద్ ప్రవక్త మరణించిన తర్వాత అరబ్ నావికులు భారతదేశంలో వాణిజ్యం ప్రారంభించారు. సుమారు క్రీ.పూ. 1000లో టర్కీ, ఇతర మధ్య ఆసియా ఆక్రమణదారులు ఉత్తర భారతదేశంపై దాడిచేసి వారి సామ్రాజ్యాలను స్థాపించారు. ముస్లీం పాలకులు మక్తాబ్స్ (ప్రాథమిక పాఠశాలలు)ను స్థాపించారు. ఇక్కడ విద్యార్థులు ఖురాన్ ఆధారంగానే చదవడం, రాయడం, ప్రాథమిక ఇస్లామిక్ ప్రార్థనలు నేర్చుకున్నారు. ఆధునిక భాషా నైపుణ్యాలు బోధించే మదర్సాలు (మాధ్యమిక పాఠశాల) కూడా ఉన్నాయి. ఈ సమయంలోనే కమ్యూనికేషన్ కోసం అరబిక్, పర్షియన్,ఉర్దూ భాషలు ఉద్భవించాయి.ముస్లీం పాలన కారణంగా హిందూ, బౌద్ధ విద్యా వ్యవస్థ పతనమైనది. ముస్లీం రాజుల కాలంలో విద్యాబోధన కొనసాగినా భాషలు మారిపోయాయి. సంస్కృతీ మారిపోయింది.

వలసరాజ్యాల కాలం క్రీ.శ. 1757 నుంచి 1947 వరకు సాగింది. 16వ శతాబ్దం నాటికే పాశ్చాత్య రోమన్ కాథలిక్ మిషనరీలు పోర్చుగ్రీసు ఆక్రమిత ప్రదేశాలపై ల్యాండ్ అయ్యాయి. తర్వాత పలు చోట్ల ప్రజలు కూడా క్రైస్తవ మతంలోకి మారడం ప్రారంభించారు. మిషనరీలకు అనుసంధానంగా పాఠశాలలు



స్థాపించబడ్డాయి. పోర్చుగ్రీస్, డచ్, ఫ్రెంచ్, బ్రిటీష్ వంటి వివిధ దేశాల వ్యాపార వేత్తలు భారతగడ్డపై అడుగుపెట్టారు. తర్వాత వారు భారతదేశ పాలకులుగా మారినా భారతీయుల విద్యావ్యాప్తి కోసం పెద్దగా ప్రయత్నాలు చేయలేదు. భారత దేశంలోని వనరులను దోపిడి చేయడం పైనే దృష్టి సారించారు. బ్రిటీష్ చార్టర్ యాక్ట్ 1813 భారతదేశంలో వివిధ విద్యా బాధ్యతను స్వీకరించడానికి ఈస్ట్ ఇండియా కంపెనీపై ఒత్తిడి చేసింది. నూతనంగా పాఠశాలలను తెరిచేందుకు మిషనరీలకు లైసెన్స్‌లు ఇచ్చేందుకు ఈ చట్టం నియంత్రణ మండలికి అధికారం ఇచ్చింది. 1835 వరకు ఇతర మాధ్య మాలలో ఇతర ఓరియంటల్ భాషలతో పాటు భారతదేశంలో వరుసగా హిందూ, ముస్లీం, మిషనరీ సంస్థలలో సంస్కృత, పెర్షియన్, ఇంగ్లీష్ ఉన్నాయి. 1835 మార్చి 7న అప్పటి భారత గవర్నర్ జన రల్ లార్డ్ విలియం జెంటింక్ మెకాలే ప్రతిపాదనల కారణంగా ఓరియంటల్ భాషల నుంచి బోధనా మాధ్యమంగా ఇంగ్లీష్‌పై దృష్టి కేంద్రీకృతమైంది. ఏదే మైనా వలస పాలనలో బ్రిటీష్ వారు విద్యావ్యవస్థను అభివృద్ధి చేసేందుకు యత్నాలు చేయాల్సి వచ్చింది. ఎప్పటిక ప్పుడు వివిధ కమిటీలు, కమిషన్ల సిఫా ర్సుల కారణంగా భారతదేశంలో విద్యా వ్యాప్తి కోసం ప్రాథమిక పాఠశాలలు, మాధ్యమిక పాఠశాలలు, ఉన్నత పాఠశా లలు, సాంకేతిక విద్యా సంస్థలు, వృత్తి పరమైన విద్యాసంస్థలు, విశ్వవిద్యాల యాలు బ్రిటీషర్లు ప్రారంభించారు. ఈ సంస్థలు పరిమితంగానే ఉన్నప్పటికీ అవి భారతదేశంలో ప్రస్తుత విద్యావ్యవ స్థకు పునాది వేసింది. 1857లో బొంబా యి, కలకత్తా, మద్రాసులలో మొదట మూడు విశ్వవిద్యాలయాలు ప్రారంభిం చబడ్డాయి. ఈ విశ్వవిద్యాలయాలు లండన్ విశ్వవిద్యాలయం తరహాలో రూపొందిం చబడ్డాయి. స్వాతంత్రం తర్వాత భారత దేశం కమిటీలు, వివిధ కమిషన్ల సిఫా ర్సులకారణంగా విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు యత్నాలు ప్రారంభమయ్యాయి. విద్యా కమిషన్ 1948, మాధ్యమిక విద్యా కమిషన్ 1952-53, విద్యాకమిషన్ 1964-66, జాతీయ విద్యావిధానం 1968, జాతీయ విద్యావిధానం 1986, కొఠారీ కమిషన్ తదితర సిఫార్సుల వల్ల దేశంలో విద్యావ్యాప్తి కోసం రాజ్యాంగంలో సవరణలు చేశారు. విద్యలో ప్రైవేటు యాజమాన్యాలు పాల్గొనేందుకు అవస రమైన చట్టాలను కూడా భారతదేశం రూపొందించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాఠశాలల ఏర్పాటులో గణనీయమైన పెరుగుదల కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వంలోని మినిష్టరీ ఆఫ్ స్టాటస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్స్ ఇంప్లి మెంటే షన్ (మోస్పీ) రికార్డు చేసిన సమాచారం ప్రకారం 2015-16 నాటికి పాఠశాలల సంఖ్య 15,22,346గా ఉంది. ఉన్నత విద్యలో కూడా స్థిరమైన వృద్ధి ఉంది. 1950-51లో దేశవ్యాప్తంగా 27 విశ్వ విద్యాలయాలు ఉన్నప్పటికీ, 2018-19 నాటికి 903 విశ్వవిద్యాలయాలు ఏర్ప డ్డాయి. అదేవిధంగా కాలేజీలు కూడా 578 నుంచి 39050కు పెరిగాయి. విశ్వ విద్యాలయాలు, కాలేజీలు కాకుండా 20 18-19 నాటికి 10, 011 స్టాండ్ అలోన్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పడ్డాయి. మెజారిటీ విశ్వ విద్యాలయాలు ఇప్పుడు ఇంగ్లీషు మాధ్య మంగానే విద్యను బోధిస్తున్నప్పటికీ, ప్రాంతీయ భాషలకు, ఉర్దూకు అంకిత మైన అనేక విశ్వవిద్యాలయాలు కూడా ఉన్నాయి. మెజారిటీ కాలేజీలలో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ఆయా రాష్ట్ర ప్రాంతీ య భాషలలో అందించబడతాయి.

భారతదేశంలో టెలివిజన్‌కు మొదట యునెస్కో పైలెట్ ప్రాజెక్టుగా 1959లో ఢిల్లీలో ప్రవేశపెట్టింది. దీనిని కమ్యూనికే షన్, కమ్యూనిటీ అభివృద్ధి మాధ్యమంగా అధ్యయనం చేసింది. ఈ ప్రాజెక్టు విజయ వంతంగా పూర్తయిన తర్వాత 1960లో ఆల్ ఇండియా రేడియోలో భాగంగా ఇటీ వలే ఉనికిలోకి వచ్చింది. 9వ తరగతి విద్యార్థుల ప్రయోజనం కోసం ప్రత్యే కంగా రూపొందించిన కార్యక్రమాలు ప్రతి మంగళవారం 3 నుంచి 4 గంటల వరకు ప్రసారం చేయబడేవి. ఫోర్డ్ ఫౌం డేషన్ సహాయంతో 1961లో సైన్స్ విష


యాలలో 20 నిమిషాల కార్యక్రమాలను వారానికి ఐదు రోజులు ప్రసారం చేయడానికి ఢిల్లీ స్కూల్ ప్రాజెక్టు ప్రారంభించబడింది.

రాష్ట్రాల ప్రాంతీయ భాషలలో విద్యా కార్యక్రమాలను ప్రసారం చేయడం ద్వారా గ్రామీణ, పట్టణ మధ్య గ్యాప్‌ను తగ్గించడం సులభమైనది. కమ్యూనికేషన్ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడంతో భారతదేశం 1982లో ఎడ్యుకేషనల్ టీవీ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ఉపక్రమించింది. ఇన్‌సాట్ 1బి ఉపగ్రహాన్ని ప్రయోగించి ఎడ్యుకేషనల్ నెట్‌వర్క్ దేశంలోని మరిన్ని ప్రాంతాలకు చేరుకుంది. 1984లో యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజిసి) ఉన్నత విద్య విద్యార్థుల ప్రయోజనం కోసం టెలివిజన్ కంట్రీవైడ్ క్లాస్‌రూమ్ (సిడబ్ల్యూసిఆర్)ను ప్రారంభించింది. భారతదేశ జాతీయ ఛానల్ దూరదర్శన్‌లోని సిడబ్ల్యూసిఆర్ స్లాట్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల ప్రయోజనం కోసం ఫుల్‌ఫ్లెడ్జ్ కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమాలు ప్రధానంగా ఇంగ్లీషు, హిందీభాషలలో ఉండేవి. తర్వాత సంవత్సరాలలో న్యూ కౌన్సిల్ ఏర్పాటైంది. ఈ మేరకు ఢిల్లీలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (సిఐఇటి), స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (ఎస్ఐఇటి) స్థాపనతో నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, దూరదర్శన్‌లో పాఠశాల పిల్లల కోసం ఎడ్యుకేషనల్ టీవి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. 2000 సంవత్సరంలో ఇందిరాగాంధి నేషనల్ ఓపెన్ విశ్వవిద్యాలయం దేశంలోని అత్యధిక విద్యార్థులు చేరేందుకు జ్ఞాన్‌దర్శన్ అనే ప్రత్యేక ఛానెల్ ప్రారంభించారు. సిలబస్ ఆధారంగా యుజిసి వ్యాస్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛానెల్‌ను 2004లో ప్రారంభించారు. ప్రభుత్వపరంగా విద్యాసంస్థలను స్థాపించడమే కాకుండా విద్యావ్యాప్తి కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడంలో భారతదేశం ఎల్లప్పుడూ చురుకుగా ఉంది. తరగతి విద్యకు అనుకూలంగా టెలివిజన్,ఐసిటీలను ఉపయోగించడం ద్వారా కొత్త పద్ధతులలో ప్రయోగాలు చేస్తున్నారు.

– డా।। వి. జగదీశ్వర్ రావు

# పద్మనాయక వైజయంతి గ్రంథ సమీక్ష

– అర్రాడి దివాకర్ రావు




**పద్మనాయక వైజయంతి**

**రచయిత:**

కోటగిరి బుచ్చినాయన గారు (కోటగిరి వెంకట నరసింహ సత్య నారాయణ రావు)

**వెల :** 300/-

**ప్రతులకు :** ఐవా కార్యాలయం

వెలమలు, పద్మనాయకులు, పద్మనాయక వెలమలు పూర్వాపరాలు, వంశనామాలు, గోత్రాలు, పద్మనాయక ప్రభువుల బిరుదాలు, కాకతీయ సామ్రాజ్యంలోని పద్మనాయకులు ప్రాధాన్యత, యుద్ధం, ధైర్యశౌర్య ప్రతాపాలు, సర్వజ్ఞ సింగభూపాలుడి దీప్తి, బొబ్బిలి బెబ్బులి తాండ్ర పాపారాయుడి కీర్తి, వెలమల వైష్ణవ సాంప్రదాయ ప్రస్థి, పద్మనాయకుల రాజ్య పాలన, దయ, ధర్మ, దానగుణాలు, నాటి సంస్కృతీ సంప్రదాయాలు, కవి పండితుల కావ్య, శతక, శృంగార ప్రబంధాలు, భక్తిరస గీతాలంకారాలు, పద్మనాయక రాజన్యుల సాహిత్యనివాళి మొదలగు విషయపరిజ్ఞానంతో కూడిన చారిత్రాత్మక ఛాయా చిత్రాలతో పాటు ఎన్నో ఆధారాలను సేకరించి, పద్మనాయక వెలమల సమగ్ర సాహిత్య చరిత్రగా శ్రీ బుచ్చినాయన(శ్రీ కోటగిరి వెంకట నరసింహ సత్యనారాయణ రావు)గారు 1994లో ఈ గ్రంథాన్ని సమర్పించి వెలమ జాతికి అంకితమిచ్చారు.

అటువంటి గొప్ప చరిత్రకు సంబంధించిన గ్రంథాన్ని అమెరికాలో ఒక మంచి డాక్టర్‌గా స్థిరపడిన డా।। పేరాల సుధాకర్ రావు మరోసారి ఈ చరిత్ర మూలాలను పరి శోధించి, లోటుపాట్లను సవరించి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ప్రొ. తంగెడ కిషన్ రావు సంపాదకత్వంలో వెలమ జాతికి సంబంధించిన విజ్ఞాన సర్వస్వంగా తీర్చి దిద్ది ఇటీవల పునర్ముద్రణ గావింపజేసి మన జాతికి అందించిన మన పూర్వీకుల చరిత్ర. ఇటువంటి గొప్ప అభిమాన ఆకర్షణీయమైన గ్రంథాన్ని పద్మనాయక వెలమలు దేశ విదేశాల్లో ఎక్కడ ఉన్నా ఒక్కసారైనా చూసి తరించాలి. కాబట్టి చరిత్ర–సాహిత్యమని రెండు భాగాలుగా విభజించి 425 పేజీలు కలిగియున్న ఈ చరిత్రను చూడగోరినవారు అఖిల భారత వెలమ సంఘం ప్రధాన కార్యాలయంలో నేరుగా గాని లేదా ఫోన్ నెం. 040-2763 7694 ద్వారా గాని సంప్రదించి ఈ గ్రంథాన్ని స్వంతం చేసుకోగలరని మనవి.

# వెలమ ఆణిముత్యం బోయినిపల్లి పృథ్వీరాజ్



**పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న చందంగా చిన్ననాటి నుండి చదువుల్లో తన ప్రతిభను చాటుతు అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం కార్నిజి మిలన్‌లో ఎం.ఎస్ ప్రాడక్ట్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశం పొందే స్థాయికి ఎదిగారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన బోయినిపల్లి పృథ్వీరాజ్. విద్యావంతుల కుటుంబంలో పుట్టి ప్రవాస భారతీయ విద్యార్థిగా ప్రతిష్టాత్మక కోర్సు నభ్యసించేందుకు వెళ్తున్న బోయినిపల్లి పృథ్వీరాజ్‌ను ఐవా కార్యవర్గం, వెలమ వైజయంతి అభినందిస్తుంది.**

కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామంలో 1994 జనవరి 24న శ్రీ బోయినిపల్లి లక్ష్మణ్ రావు శ్రీమతి రజిని దంపతులకు జన్మించిన పృథ్వీ రాజ్ ప్రాథమిక, సెకండరీ విద్యాభ్యాసం కరీంనగర్‌లోని 'జెమ్స్'లో పూర్తి చేశారు. హైదరాబాద్, సైఫాబాద్‌లోని ఫ్రిడ్జ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇంజీనిరింగ్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు.

ఇంజనీరింగ్ విద్య పూర్తయిన తర్వాత చెన్నైలోని అఫైన్ అనలటిక్స్ కంపెనీలో రెండేళ్ళపాటు బిజినెస్ అనలిస్టుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత హైదరాబాద్ తిరిగి వచ్చిన పృథ్వీరాజ్ టి.వ్యాలి కాంపెనీ కో-ఫౌండర్‌గా 2007 మేలో కొత్త కంపెనీ ఏర్పాటైంది. ఇందులో కళాకారుల ప్రతిభకు మెరుగులుదిద్ది వారిని అత్యుత్తమ కళాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కంపెనీని ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం అమెరికాలోని కార్నిజి మిలన్ యూనివర్సిటీలో ప్రాడక్టు మేనేజ్‌మెంట్ కోర్సులో ఎంఎస్ చేయడానికి ప్రవేశం లభించింది. 2020 జనవరిలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం కార్నిజి మిలన్‌లో పృథ్వీరాజ్ అడుగు పెట్టబోతున్నారు. పృథ్వీరాజ్ తల్లిదండ్రులు శ్రీ బోయినిపల్లి లక్ష్మన్‌రావు, శ్రీమతి రజిని దంపతులు ఉన్నత విద్యావంతులు. శ్రీ లక్ష్మన్‌రావు ఎంఎస్సీ కెమిస్ట్రీ పట్టభద్రులు కాగా శ్రీమతి రాజమణి మైక్రో బయోలజీలో ఎం.ఎస్సీ పూర్తి చేసింది. వీరు కరీంనగర్‌లో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు 'జెమ్స్' స్థాపించి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యనందించారు. వీరు విద్యారంగానికి అందించిన సేవలు విశిష్టమైనవి. వీరికి ఒక కూతురు శ్రీ గౌతమి ఉంది. ఈమె బిట్స్ పిలాని విద్యార్థిని. పృథ్వీరాజ్ ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఐవా కార్యవర్గం ఆకాంక్షిస్తుంది. •





*గుడ్డు పోషకాల నిలయం. ఇందులో మాంసకృత్తులు, అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్, ఖనిజాలు దండిగా ఉంటాయి. గుడ్డు తింటే బరువు పెరుగుతుందని చాలా మంది భావిస్తుంటారు. దానికి కారణం పచ్చసొనలోని కొలెస్ట్రాల్. కొవ్వుల స్థాయి అధికంనిగా ఉన్నప్పటికీ దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు అంత ఎక్కువగా ఏమీ పెరగటం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో కాలరీలు తక్కువ. పైగా చాలా సేపటి వరకు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఫలితంగా త్వరగా ఆకలి వేయదు. కణాల పనితీరు, వాటి ఎదుగుదల, శక్తిని అందించటంతో పాటు శరీరంలో జరిగే పలు జీవక్రియలకు అవసరమైన పోషకాలు గుడ్డుతో లభిస్తాయి. గుడ్డు తెల్లసొన మధుమేహం కలవారికి, మరియు ఇతర వ్యాధులతో బాధపడేవారికి చాలా మంచిది. ఇది రుచిని కలిగి ఉండడమే కాకుండా పోషకాలను కూడా మెండుగా కలిగి ఉంటుంది. గుడ్డులోని తెల్ల సొనలో కోలిన్ అనే మైక్రో పోషకం ఉండడం వలన డిఎన్ఏ ఏర్పాటులో పాల్గొనే మిథైలేషన్ విధానంలో బాగా సహాయపడుతుంది. గుడ్డు తెల్లసొన నరాలు, మెదడు పనితీరుకు ఉండగా ఉంటుంది.*

*– అంతర్జాలం నుండి...*

# పిల్లల విజయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం

– డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు




**పిల్లల విజయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం**

**రచయిత:** డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు

**వెల :** 50/–

21వ శతాబ్దంలో ఊహకందని మార్పులు అనేకం వస్తున్నాయి. ఈ మార్పులకు తగ్గట్లుగా తమ పిల్లలను తయారు చేయటం తల్లిదండ్రులకు ఒక ఛాలెంజ్‌గా మారింది తమ పిల్లలు అటు చదువులో, ఇటు జీవితంలో విజయం సాధించాలని ప్రతి తల్లి, ప్రతి తండ్రి తాపాత్రయపడతారు. అందుకోసం నిరంతరం శ్రమిస్తుంటారు. అయితే చాలా మంది తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో పలు సమస్యలతో సతమతమవుతుంటారు. పిల్లలు ఎంతో కష్టపడి చదివినప్పటికీ వారి వారి శక్తి సామర్థ్యాలకు తగ్గట్లుగా విజయాలను అందుకోలేక పోతుంటారు. కొందరు పిల్లలు మాత్రమే ఆశించిన స్థాయిలో చదువులో రాణించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతుంటారు. తల్లిదండ్రులు తమ ప్రవర్తన ద్వారా, తమ ప్రతిస్పందనల ద్వారా పిల్లలు ఎదుర్కొనే వైఫల్యాలకు లేదా విజయాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారకులు కాగలరు. తల్లిదండ్రుల నుంచి సరైన ప్రేరణ, మార్గదర్శకత్వం లభించిన పిల్లలు ఇటు చదువులో, అటు జీవితంలో మంచి విజయాలు సాధించగలరు.

ఈ దిశగా తల్లిదండ్రులకు పేరెంటింగ్‌పై సరైన అవగాహన కల్పించటం కోసం పిల్లల పెంపకంలో చేదోడు, వాదోడుగా ఉండే పలు విషయాలను గురించి "పిల్లల విజయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం" అనే పుస్తకాన్ని ఎమెస్కో పబ్లికేషన్స్ రూపొందించింది. ఈ పుస్తకాన్ని ప్రముఖ ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్, డాక్టర్ రావూస్ ఫౌండేషన్ ఛైర్మెన్ డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు రచించారు.

పిల్లల పట్ల తల్లిదండ్రుల దృక్పథం ఎలా ఉండాలి? పిల్లల ఆసక్తులు, అభిరుచులు ఎలా గుర్తించాలి? పిల్లలలో చదువుల పట్ల ఆసక్తిని ఎలా పెంచాలి? చెడు స్నేహాలకు లోనుకాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనునిత్యం ఉత్సాహభరితంగా ఎలా ఉంచాలి? అనే విషయాలపై సైకాలజిస్టులు సూచించిన పద్ధతుల గురించి వివరంగా చర్చించారు. పిల్లలను చదువుల్లో రాణించేలా తీర్చిదిద్దటం ఎలా అనే అంశంపై విలువైన సూచనలు చేశారు. పాఠశాలలు లేదా కళాశాలలు ఎంపిక చేసుకోవటం దగ్గర నుంచి క్లాసుమెట్స్ వల్ల పిల్లలపై పడే ప్రభావం వరకు రకరకాల విషయాలను గురించి శాస్త్రీయమైన సమాచారాన్ని ఇచ్చారు. తల్లిదండ్రులు చదువుల్లో పిల్లల అభివృద్ధిని ఎలా సమీక్షించాలి? ఎలాంటి పొరపాట్లు దొర్లే అవకాశం ఉందనే విషయాలను ఉదాహరణలతో వివరించారు. పిల్లలకు ట్యూషన్స్, కోచింగ్‌ల వల్ల జరిగే లాభనష్టాల గురించి పిల్లలకు ఒత్తిడి లేకుండా చదువు నేర్పించే పద్ధతుల గురించి సైకాలజిస్ట్‌లు చెప్పే రకరకాల విషయాలను పొందుపరిచారు. పిల్లలకు పాఠశాలలు లేదా కళాశాలలు నేర్పే విషయాలకు తోడుగా తల్లిదండ్రులు ఏఏ విషయాలు నేర్పాల్సిన అవసరం ఉంటుందనేది చర్చించారు.

పిల్లలే తల్లిదండ్రుల విజయసంకేతాలు. పిల్లలకు సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందినప్పుడు అద్భుతాలు చేయగలరు. ఈ దిశగా పిల్లల విజయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అనే పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పుస్తకాన్ని ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో బుక్స్ పబ్లిష్ చేసింది. ప్రతులకు www.emescobooks.comను సంప్రదించవచ్చు. అమెజాన్, ఫ్లిప్కార్ట్ వంటి ఆన్‌లైన్ స్టోర్స్‌లలో కూడా లభిస్తుంది.

డా॥ దేశినేని వెంకటేశ్వర్ రావు 'స్మార్ట్ మైండ్స్' పేరుతో హైదరాబాద్‌లో కౌన్సిలింగ్ మరియు ట్రైనింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, స్టడీ స్కిల్స్, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మ విశ్వాసం పెంచుకోవటం, టైం మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ఇంటర్వ్యూ స్కిల్స్‌తోపాటు అన్ని రకాల సైకలాజికల్ సమస్యల పరిష్కారం కోసం 9912380754 ఫోన్‌నెంబర్‌పై సంప్రదించవచ్చు. ఎంసెట్, ఐఐటి, నీట్, సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వెలమకమ్యూనిటీ విద్యార్థులకు 'ఉచిత కన్సల్టేషన్' అందిస్తున్నారు. •

# అఖిల భారత వెలమ అసోషియేషన్

3-6-432 హిమాయత్‌నగర్, హైదరాబాద్-500 029. ఫోన్ : 27637694

## వెలమ వివాహ వేదికకు అందించవలసిన వివరాలు

అఖిల భారత వెలమ సంఘం వారి వివాహవేదిక సేవలను వినియోగించుకోదలచిన వారు ఈ క్రింది వివరాలను పంపవలెను.

| | | | |
|---|---|---|---|
| అమ్మాయి/అబ్బాయి పూర్తి పేరు | : | చేస్తున్న ఉద్యోగ వివరాలు | : |
| పుట్టిన తేది/ సమయం | : | తల్లి మరియు తండ్రి పేరు | : |
| వయస్సు/ ఎత్తు/ రంగు | : | ఇంటి పేరు | : |
| పుట్టిన గ్రామం/ పట్టణం | : | గోత్రం | : |
| మండలం, జిల్లా | : | తోబుట్టువుల వివరాలు | : |
| జన్మనామం/ నక్షత్రం/ పాదం/ రాశి | : | శాశ్వత మరియు తాత్కాలిక | : |
| (వీలైతే జన్మ పత్రిక ప్రతి) | : | చిరునామా | : |
| విద్యార్హతలు | : | టెలిఫోన్ మరియు సెల్‌నెంబర్ | : |

పైన పేర్కొన్న వివరాలను సంఘం ఇతర అవసరాల నిమిత్తం వినియోగించదు, వెల్లడించదు. ఈ వివరాలను పై అడ్రస్సుకు స్వయంగా అందచేయడం గానీ లేక పోస్ట్ ద్వారా గానీ పంపగలరు.

### వెలమ బంధువులందరికీ అభినందనలు...

వెలమ వివాహ విభాగం గత నెల అనగా మార్చి నుండి వారంలో 5 రోజులు (ఆది, మంగళవారాలు మినహా) తమ విశిష్టమైన సేవలు అందించడం జరుగుతుంది. ఉదయం 11 గం॥ నుండి మధ్యాహ్నం 2 గం॥ వరకు వివాహ విభాగం సభ్యులు అందుబాటులో ఉండి తమ సేవలందించగలరు. కావున వివాహ సంబంధాలు వెతికే బంధుమిత్రులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోగలరు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను పిల్లలపై బలవంతంగా రుద్దకుండా వారికి జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలలో స్వంతంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను కల్పించాలి. మీ పిల్లలకు మంచి వివాహ సంబంధాలు కుదుర్చుకొని వారి వైవాహిక జీవితాన్ని ఫలవంతం మరియు ఆదర్శవంతంగా తీర్చిదిద్దగలరు.

కుటుంబ స్థితిగతులు, నడవడికలు అన్నీ క్షుణ్ణంగా తెలుసుకొని ముందడుగు వేయడం చాలా అవసరం. విదేశీ సంబంధాల మోజులో పడి కష్టాలపాలు కావద్దు. వివాహ సంబంధాల కొరకు బయోడేటా మరియు ఫోటో allindiavelamaassociation@gmail.com కి ఈమెయిల్ చేయగలరు.

సర్వేజనాః సుఖినోభవంతు

**- వివాహ విభాగం**

*<u>గమనిక:</u> ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ వివాహాలు నిశ్చయమైన వారు వివాహ విభాగానికి తెలియపర్చగలరు. మా వద్ద గల రికార్డుల నుండి బయోడెటా తొలగించడానికి సహకరించండి.*

# శ్రద్ధాంజలి...



## శ్రీమాన్ జువ్వాడి నారాయణ రావు గారు

జననం : 09-10-1925 | ఇరుకుల్ల గ్రామం, కరీంనగర్ జిల్లా | పరమపదం : 19-8-2019

మా హృదయ ఫలకాలపై చెక్కిన సజీవ శిల్పం మీ రూపం.. అనురాగానికి చిరునామా మీ హృదయం...
మీరు వేసిన ప్రతి అడుగు మాకు ఆదర్శం... చేరిన ప్రతి గమ్యం స్ఫూర్తి శిఖరం... మీరే మాకు మార్గదర్శి...
ప్రేమానురాగాలతో మా అందరికీ వెలుగు నిచ్చి జీవన జ్యోతిగా ఆఖరి వరకు దారి చూపావు. అలసి సొలసిపోయి
విశ్రమించిన మీ పాద పద్మాలకు మా హృదయ పూర్వక అశ్రునివాళులు అర్పిస్తూ...



కుమారులు-కోడళ్లు : జువ్వాడి నర్సింగరావు - పద్మ
జువ్వాడి వినాయక రావు - మధులిక

కుమార్తెలు-అల్లుళ్ళు : అరుణ-మధుసూదన్ రావు కడారి
భారతి-కిషన్ రావు పుల్లూరు
గిరిజ-మోహన్ రావు తంగెడ

మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు & కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు




RNI NO. APTEL/2002/8960 BOOK-POST PRINTED MATTER

If Undelivered Please Return to:
VELAMA VAIJAYANTHI
ALL INDIA VELAMA ASSOCIATION
3-6-432, Himayath Nagar,
Hyderabad - 500 029.
Ph: 2763 7694